ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 01.10.2026 | సంపుటి : 13 సంచిక : 72 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# గడీలను మరఫిరంగులతో పేల్చివేస్తాం

## సిరిసిల్లపై జెండా ఎగురవేస్తాం : సీఎం రేవంత్

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల.. ఉరిసిల్లగా మారింది
- కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు
- సమస్యల పరిష్కారం కోసం కేంద్రం వద్దకు ఎన్ని సార్లయినా వెళ్లాల్సిందే
- సిరిసిల్ల బహిరంగ సభలో సీఎం ప్రసంగం
- అంబేడ్కర్ కూడలి నుంచి బహిరంగ సభా వేదిక వరకు 3 కి.మీ మేర పాదయాత్రగా వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్

### ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం



- పథకాల ప్రయోజనాలు పేదలకు చేరేలా పని చేయాలి : సీఎం రేవంత్ రెడ్డి
- నిస్సహాయతతో కలెక్టరేట్ గడప తొక్కే వారి కన్నీరు తుడవాలి
- కలెక్టరేట్ సమీకృత కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించిన సీఎం
- రూ.1096.22 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.28.70 కోట్లతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

12లో..

### రూ.345.78 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా బ్యూరో / జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 30 (జనంసాక్షి): ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉత్సాహంగా సాగింది. కేటీఆర్ అడ్డాలో తమ బలాన్ని నిరూపించేలా కీలక నేతలు, శ్రేణులు, నేతన్నలతో సీఎం మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లక్ష్యంగా కొంతకాలంగా పదునైన ఆరోపణలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి... ఇవాళ తన విమర్శలు పదును మరింత పెంచారు. సిరిసిల్ల వాసులకు జరిగిన

మిగతా 2లో..

"సిరిసిల్ల గడిల మీద గురిపెడదాం. ఫిరంగులమై పేలుదాం. సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం ఇదే మన ప్రతిజ్ఞ. రాబోయే ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. గతంలో కవిత ఓడితే వెంటనే కేసీఆర్ మండలి సభ్యురాలిని చేశారు. నేను సీఎం అయితే తెలంగాణ కోసం పోరాడిన విజయశాంతిని మండలి సభ్యురాలిని చేశా. కుటుంబ పాలన కావాలా? అధికార దర్పం కావాలా? ఆలోచించాలి. నాటి జోడీ వైఎస్, డీఎస్ అయితే ఈనాటి జోడీ రేవంత్, మహేశ్. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తాం"
- సీఎం రేవంత్ రెడ్డి

# నేడు మంత్రివర్గ సమావేశం

- ఉద్యోగులకు రెండు డీఏలు, అభివృద్ధి పనులపై సమీక్ష
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సహా, పాలిటెక్నిక్‌లు, రాజీవ్ యువవికాసం, మెట్రో ప్రాజెక్టు అంశాలు చర్చించే అవకాశం



హైదరాబాద్(జనంసాక్షి):సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏల మంజూరుతో పాటు మరికొన్ని కీలక అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు మొదటి డీఏ 3.64 శాతం, రెండో డీఏ 2.74 శాతం మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. డిసెంబరు నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం విధివిధానాలపై చర్చించే అవకాశం ఉంది. కుటుంబ యజమాని మరణిస్తే ఐదు లక్షల రూపాయల బీమా ఇచ్చే ఈ పథకాన్ని వచ్చే నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం

మిగతా 2లో..

# ఆసియా క్రీడల్లో భారత్‌కు గోల్డెన్ డే

## బుధవారం ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు • ఆర్చరీలో హ్యాట్రిక్

టోక్యో(జనంసాక్షి):బుధవారం ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇవాళ 'గోల్డెన్ డే' అని చెప్పవచ్చు. ఒక్కరోజే మన అథ్లెట్లు పసిడి పతకాల మోత మోగించారు. మొత్తం నాలుగు స్వర్ణాలు సాధించి పట్టికలో భారత్ స్థానాన్ని మెరుగుపర్చారు. ఇక మరికొన్ని విభాగాల్లో మన క్రీడాకారులు కాంస్య పతకాలు కూడా అందుకున్నారు. మరి ఇవాళ ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెట్ల ప్రదర్శన ఎలా సాగింది? ఎన్ని పతకాలు

మిగతా 2లో..



### ఆసియా క్రీడల్లో తెలంగాణ బిడ్డ బంగారు పంట

- తెలంగాణకు 'చికిత' గర్వకారణం
- ఆమె నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుంది.. సీఎం రేవంత్ హర్షం

2లో..

# రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ విద్యుత్ విషయంలో రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవైపు కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉంది. నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కనే ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయి. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది... అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను

మిగతా 2లో..

# మళ్లీ కేసీఆరే సీఎం

## తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే:కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. 26 సంవత్సరాల్లో ఒక్కసారి కూడా బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోలేదని, 2014, 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందన్నారు. కొచ్చిలో ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడిన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్ విధానంతో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. సమర్థవంతంగా జనాభా నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయని, దక్షిణాది రాష్ట్రాలకు జనాభా ఆధారిత డీలిమిటేషన్ శాపంగా మారుతుందన్నారు. దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24% నుంచి 19%కి తగ్గిందన్న కేటీఆర్ చట్టసభల్లో సీట్లు పెంచాలనుకుంటే అసెంబ్లీ సీట్లను కూడా ఎందుకు పెంచడం లేదు? అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహం ఉందన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

## ఈసీపై ఇండియా కూటమి ప్రత్యక్షపోరాటం

- అక్రమాలపై ఐక్యంగా పోరాడతాం :ఇండియా కూటమి
- తమ స్వలాభం కోసం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, మార్చ్ చేపట్టాలని 'ఇండియా కూటమి' నేతలు నిర్ణయించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2 నుంచి 8వరకు వారం రోజుల పాటు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే నినాదంతో పాదయాత్ర చేపట్టనున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు వెల్లడించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఎన్నికల సంఘాన్ని భాజపా నేతలు ఏ రకంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై మేమంతా (ఇండియా కూటమి నేతలు) ఐక్యంగా పోరాడతాం. అధికారం కోసం మోదీ, అమిత్ షా ఈసీని ఓ రబ్బర్ స్టాంపులా వినియోగిస్తున్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించినా ఈసీ పట్టించుకోలేదు. ఈవీఎంల పనితీరుపై ఎంతో కాలంగా సమాధానం కోరుతున్నా స్పందించ లేదు. ఇకపై ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లు తీసుకురావాలి. సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే ఎన్నికల సమయంలో పరిగణలోకి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

**వారికి తగిన శిక్ష పడాల్సిందే: రాహుల్ గాంధీ**

తమ స్వలాభం కోసం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'వారు ఎంత పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే.

మిగతా 2లో..

# కృష్ణానదిపై మరో 2 బ్యారేజీల నిర్మాణం : చంద్రబాబు

### నిషేధిత జాబితాలోని భూములకు మరింత రిలీఫ్

22ఏ(1)బి కింద ఉన్న ఆస్తులకూ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం



2లో..

# రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు

- క్వింటా గోధుమలకు రూ.2,610కు చేరిన మద్దతు ధర
- ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'ఏఐ' సాయం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2027–28 ఏడాదికి గోధుమలకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.25 చొప్పున పెంచుతూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,610కు చేరింది. గోధుమలతో పాటు మరికొన్ని పంటలకు సైతం మద్దతు ధరను పెంచింది. దేశ రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యల

మిగతా 2లో..

# వినువీధిలో పైలెట్ల ఘర్షణ




- దుబాయ్-ఇజ్రాయెల్ విమానంలో ఎమర్జెన్సీ కోడ్ కలకలం
- సౌదీఅరేబియాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

అబుదాబి(జనంసాక్షి): దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఓ విమానం టేకాఫ్ అయిన వెంటనే ఎమర్జెన్సీ కోడ్ ప్రసారం చేసింది. విమానం హైజాక్ అయిన సందర్భంలో అలాంటి కోడ్‌ను రిలీజ్ చేస్తుంటారు. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు జరుగుతుండటంతో ఈ పరిణామంతో ఇజ్రాయెల్ ఉలిక్కిపడింది. ఆ ప్రయాణికుల విమానానికి తోడుగా పంపేందుకు యుద్ధ విమానాలు మోహరించిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే.. విమానంలో ఇద్దరు పైలట్ల మధ్య తలెత్తిన గొడవ కారణంగా ఈ భయానక పరిస్థితి ఏర్పడినట్లు పేర్కొన్నాయి. ఫ్లైదుబాయ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 180 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరింది. సౌదీ గగనతలంలో ఉండగా.. దాని మార్గం మారినట్లు ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్‌రాడార్ 24 వెల్లడించింది. ఆ విమానం ఉత్తర సౌదీ అరేబియా

మిగతా 2లో..

### విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

ప్రధాని నెతన్యాహు ఆరోపణ



# నైరుతి సీజన్ ముగిసింది

- సాధారణ వర్షపాతం కంటే తక్కువే..
- కురవని వానలు, నిండని జలాశయాలు
- నిరాశ మిగిల్చిన రుతుపవనాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. రాష్ట్రంలో కేవలం 601.8 మి.మీ. మాత్రమే వర్షాలు కురిశాయి. లోటు వర్షపాతం కారణంగా గోదావరి, కృష్ణా బేసిన్‌లలోని ప్రాజెక్టులు అరకొరగా నిండాయి.రాష్ట్రంలో ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు నిరాశనే మిగిల్చాయి. ఈ ఏడాది ఆలస్యంగా జూన్ పదో తేదీ

మిగతా 2లో..

### కురిసింది కేవలం 61 రోజులే..

*వర్షాకాలంలో జూన్ నుంచి సెప్టెంబరు 29 వరకు 121 రోజుల్లో రాష్ట్రంలో సగటున వర్షం కురిసింది కేవలం 61 రోజులే. అయితే తెలంగాణలోని 33 జిల్లాలకు గాను 18 జిల్లాలలో తీవ్రమైన లోటు వర్షపాతం నమోదైంది. అతి తక్కువగా జోగులాంబ గద్వాల జిల్లాలో 22 రోజులు మాత్రమే వర్షాలు కురిశాయి. ఇక్కడ 40% లోటు నమోదైంది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.*

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
01.10.2026

## ఆసియా క్రీడల్లో భారత్‌కు 'గోల్డెన్ డే'

సాధించారు? ఇప్పుడు చూద్దాం!బుధవారం భారత్ పతకాల మోత స్వర్ణంతోనే ప్రారంభమైంది. ఉదయం జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ పసిడి నెగ్గింది. జ్యోతి సురేఖ, చికితా, ప్రీతికాతో కూడిన భారత త్రయం చైనాను 238-234 తేడాతో ఓడించి పోడియంపై నిలిచింది. అలాగే ఈ స్కోర్‌తో భారత త్రయం ఆసియా రికార్డును కూడా సమం చేసింది. ఈ విభాగంలో అత్యధిక స్కోర్ సాధించిన కొరియా మహిళల కాంపౌండ్ జట్టు (238 పాయింట్లు)ను మన స్టార్లు సమం చేశారు. మహిళల జట్టు గోల్డ్ మెడల్ నెగ్గిన గంటలోనే మిక్స్‌డ్ టీమ్ కూడా ఆర్చరీ కాంపౌండ్‌లో పసిడి పట్టేసింది. మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత షూటర్లు సాహిల్ రాజేశ్ జాదవ్- చికిత తనిపర్తి సౌత్ కొరియాను ఢీ కొట్టింది. ఈ ఫైనల్‌లో ఇరుజట్ల స్కోర్లు (157-157) సమం అయ్యాయి. దీంతో షూట్‌ఆఫ్ లో భారత్ టీమ్ విజయం సాధించి స్వర్ణం ముద్దాడింది. ఇక ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్ టీమ్ విభాగంలోనూ భారత్‌కు స్వర్ణం దక్కింది. 34 స్కోర్ సాధించిన భారత్ విజేతగా నిలిచి పసిడి ముద్దాడింది. ఈ పోటీలో ఖతార్ జట్టు 32 స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. ఇది ఇవాళ భారత్‌కు మూడో గోల్డ్ మెడల్ కావడం విశేషం. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు గోల్డ్ మెడల్ వచ్చింది. సాహిల్ రాజేష్ జాదవ్, కుశాల్ దలాల్, గణేశ్ మణిరత్నం తిరుమూరుతో కూడిన భారత త్రయం చైనాపై 238-237 తేడాతో నెగ్గింది. దీంతో కాంపౌండ్ ఆర్చరీలో మూడు విభాగాలోనూ భారత్‌కు పసిడి పతకం దక్కింది. ఇది భారత్‌కు ఇవాళ నాలుగో పసిడి పతకం కావడం విశేషం.

బాక్సింగ్‌లో కాంస్యం

బాక్సింగ్‌లో భారత్‌కు కాంస్య పతకం దక్కింది. బాక్సర్ ప్రియా ఘంఘాస్ సెమీఫైనల్ 60 కేజీల విభాగంలో చైనాకు చెందిన యంగ్ చెంగ్యూపై 1-4 తేడాతో ఓడిపోయారు. దీంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## ఆసియా క్రీడల్లో తెలంగాణ బిడ్డ బంగారు పంట

హైదరాబాద్(జనంసాక్షి):ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితారావుకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించడం ద్వారా తెలంగాణ ఖ్యాతిని ఆమె విశ్వవ్యాప్తం చేసి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ మేరకు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభను గుర్తించి వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను సీఎం రేవంత్ అభినందించారు. చికిత నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

## కృష్ణానదిపై మరో రెండు బ్యారేజీల నిర్మాణం

విజయవాడ(జనంసాక్షి): భవిష్యత్తులో రాజధాని అమరావతిలో వంతెనలు, భారీ భవంతులు, బుల్లెట్ రైళ్లు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ప్రపంచంలోనే నెంబర్ వన్ క్యాపిటల్‌గా అమరావతి తయారవుతుంది. ఇప్పటికే విజయవాడ, గుంటూరులో భూముల విలువ పెరిగింది. త్వరలో ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఆ తర్వాత ఔటర్ రింగ్‌రోడ్డు వస్తాయి. అనేక నగరాలకు కనెక్టివిటీ వస్తుంది. విశాఖపట్నం నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రైల్వే ట్రాక్ వస్తుంది. ఇవన్నీ పూర్తయితే అమరావతి, గుంటూరు, విజయవాడ ఒక్కటై.. అమరావతి అన్‌స్టాపబుల్ సిటీగా తయారవుతుంది. కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ ఉంది. దీనికి ఎగువన వైకుంఠపురం వద్ద, దిగువన చోడవరం వద్ద మరో రెండు బ్యారేజీల నిర్మాణం చేపడతాం. దీంతో విజయవాడ మొత్తం నీటితో కళకళలాడుతుంది" అని సీఎం తెలిపారు.

# గడీలను మరఫిరంగులతో పేల్చివేస్తాం

అన్యాయం, బీఆర్‌ఎస్ పాలనతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ జోరుగా విమర్శలు ఎక్కుపెట్టారు.బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, స్థానికులు, జిల్లా వాసులతో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని మనసులో మాట వెల్లడించారు. సిరిసిల్ల చేనేత కష్టాలు, కాళేశ్వరం ముంపు సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి ప్రసంగం సాగింది. 2009 నుంచి కేటీఆర్‌ను సిరిసిల్ల ప్రజలు గెలిపించారని, అయినా ఆయన నేతన్నల ఆత్మహత్యలను ఆయన ఎందుకు ఆపలేకపోయారని, గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు. గజ్వేల్‌కు పారిపోయి వచ్చారు మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదని, ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం మీ గురించి ఆలోచన చేసిందా? ప్రజలను రేవంత్ అడిగారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని ఉద్యమానికి ఊపిరి పోసింది కరీంనగర్ జిల్లా కాదా? ప్రశ్నించారు. 2009లో కరీంనగర్‌ను వదిలి పాలమూరుకు ఎందుకు వలస వచ్చారని, కరీంనగర్ ప్రజలను కేసీఆర్ వంచించి, మోసగించారని నిలదీశారు. మానేరు వాగులో గొయ్యి తీసి పాతి పెడతామంటే కేసీఆర్ పాలమూరుకు పారిపోయి వచ్చారని, అక్కడ కేసీఆర్‌ను గెలిపిస్తే రాష్ట్రం వచ్చాక మమ్మల్ని వంచించారని తెలిపారు. మమ్మల్ని కృష్ణా నదిలో ముంచి గజ్వేల్‌కు పారిపోయి వచ్చారని, మా వలసలు, ఆత్మహత్యలు ఆగలేదని, మా జీవితాల్లో వెలుగు రాలేదని వెల్లడించారు. రాష్ట్రంలో సంపన్న



కుటుంబంగా రూ.లక్ష కోట్ల ఆస్తులు సంపాదించారని, ఎన్ని బాత్రూమ్‌లు, చిప్పలు కడిగితే రూ.లక్ష కోట్ల ఆస్తులు వస్తాయని విరుచుకుపడ్డారు.

**రామయ్యకూ శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్**

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారని, కేసీఆర్ బంధువులైన రవీందర్‌రావు, సంతోష్‌రావు మానేరు ఇసుక దొంగలని సీఎం విమర్శించారు. మానేరు ఇసుక కొల్లగొట్టి రవీందర్‌రావు, సంతోష్‌రావు, కేటీఆర్ వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మానేరు బాధితుల్లో రవీందర్, సంతోష్, సౌమ్య పేర్లు పెట్టారని, ముంపు బాధితుల ప్యాకేజీ కోసం ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారని, ముంపులో కొంప పోయిన సంతోష్‌రావు రూ.10 వేల కోట్లు ఎలా సంపాదించారని తెలిపారు. ఒకరు గోదావరి జలాలు, మరొకరు మానేరు ఇసుక కొల్లగొట్టారని, మరొకరు హైదరాబాద్‌లో ఆంధ్రా వాళ్లతో జతకట్టి వ్యాపారాల్లో వాటా తీసుకుంటారని అన్నారు. వేములవాడ శివయ్య, భద్రాద్రి రామయ్యకూ శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరేనని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిరిసిల్లకు రూ.2,234 కోట్లు ఖర్చు చేశారని, రెండున్నరేళ్లలో సిరిసిల్ల జిల్లాకు రూ.1,731 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు.

కరీంనగర్ పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో సిరిసిల్లకు చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా ప్రభుత్వ కళాశాల మైదానికి చేరుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రాజ్యాంగ నిర్మాతకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి నేతన్న చౌక్ మీదుగా ర్యాలీగా సభాస్థలి పాదం కలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి అలుపూ లేకుండా మూడుకిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ దారి పొడవునా ప్రజలకు అభివాదం చేశారు. సామాన్య కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వడివడిగా అడుగులూ వేస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం నింపారు. మూడు కిలోమీటర్లు నడుస్తూ రగుడు బైపాస్ రంగినేని ట్రస్ట్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

బహిరంగ సభాస్థలి వద్దే రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో నూతనంగా మంజూరైన నేత బజారు, రూ.5 కోట్లతో పెద్దూరులో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి భవన్, రూ.15 కోట్లతో రెండు ఖీఆూ, 4 తహశీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన, రూ.16 కోట్లతో కొనరావుపేట, సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం, రూ.99 కోట్లతో వేములవాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 200 కోట్లతో సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.10 కోట్లతో రుద్రంగిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

## నిషేధిత జాబితాలోని భూములకు మరింత రిలీఫ్

- 22ఏ(1)బి కింద ఉన్న ఆస్తులకూ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి):22ఏలోని నిషేధిత జాబితా పరిధిలో ఉన్న పలు రకాల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం మరింత ఉపశమనం కల్పించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇదివరకు ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు పొందిన లేదా కోర్టు తీర్పులు ఉన్న ఆస్తులను సెక్షన్ 22ఏ పరిమితి నుంచి మినహాయించి రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇస్తున్న విధానాన్నే, ఇప్పుడు సెక్షన్ 22ఏ(1)బి కింద ఉన్న ఆస్తులకు కూడా వర్తింపజేయాలని సర్కార్? నిర్ణయించింది. ఈ మేరకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం దీనికి సంబంధించిన మెమోను జారీ చేశారు.సెక్షన్ 22ఏకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రకటించారు. ఈ క్రమంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోని ఆస్తులు, సింగరేణి భూములతో పాటు ఎల్బీ నగర్ ప్రాంతంలోని ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఇప్పటికే ఆదేశాలు సైతం జారీ చేశారు. దీనికి కొనసాగింపుగా ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ఇతర స్థలాలు, చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ మిగులు భూముల వంటి తదితర సెక్షన్ 22ఏ(1)బి పరిధిలోకి వచ్చే ఆస్తులపై మరోసారి పరిశీలన చేయనున్నారు.

ఈ ప్రాంతాల్లోని వారికి మరింత ఉపశమనం

కోర్టు తీర్పులతో పాటు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సంస్థలు లేదా ఇతర స్థానిక అధికారుల నుంచి 22ఏ(1)బి ఆస్తులకు సంబంధించి అనుమతులు ఉన్నట్లయితే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్‌కు అర్హత కల్పించనున్నారు. ఇలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయాలని జిల్లా రిజిస్ట్రార్లు, సబ్? రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్? మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక మందికి ఉపశమనం కలిగిస్తుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 24వ తేదీ నుంచి ఈ తరహా రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ మినహాయింపులు వర్తిస్తాయని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 22ఏ నిషేధిత జాబితాలోని ఆస్తులపై సర్కారు మరింత ఉపశమనం కల్పించింది. సెక్షన్ 22ఏ(1)బి కింద ఉన్న ఆస్తులనూ రిజిస్ట్రేషన్లు చేసుకునేలా అవకాశం కల్పించింది. ఈనెల 24 నుంచే వీటికోసం దరఖాస్తు చేసుకున్నవారికి మినహాయింపులు వర్తించనున్నాయి.

## నేడు మంత్రివర్గ సమావేశం

తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితా నుంచి ఊరట కలిగించే అంశాలు, నూతన చేయూత పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్‌ఆర్‌ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపై కూడా చర్చ జరిగే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేయనున్నట్లు తెలుస్తోంది.

కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం

తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారం చాలా కాలంగా జరుగుతోంది. అయితే ఈ ఏడాది చివరి వరకు విస్తరణ ఉండే అవకాశం లేదని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నిక దాకా కూడా వెళ్లవచ్చని విశ్వసనీయవర్గాల సమాచారం. జరగబోయే కేబినెట్ విస్తరణ, మార్పులు, చేర్పులతో ఎన్నికల టీంగా ఉండాలనే అభిప్రాయంతో కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్‌లో మొదటి నుంచి రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ఖాళీల సంఖ్య మూడుకు పెరిగింది.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

భారత ప్రజాస్వామ్యం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి కన్నా ఎంతో గొప్పది. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని మేం చెప్పే మాటలు నిజమేనని ఇప్పుడు ప్రజలకు కూడా తెలిసింది. ఈ ప్రభుత్వ అవినీతిని వారే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పు ఒప్పుకొని, పదవికి రాజీనామా చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలగకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తాం' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి సమావేశంలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి

రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా. ఇటీవల సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్‌ఆర్వీయూఎన్‌ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారు" అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణి... అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7..8 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు.


తెలంగాణ ప్రభుత్వం

ఫారం-7

భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, కల్లూరు వారి రూఢీప్రకటన

(చూడుము సబ్ రూల్ 1 రూల్-25, సెక్షన్-19(1) చట్టము-30/2013)

జిల్లా గెజిట్ నెం.: A3/83/2026 తేది: 25.09.2026
కలెక్టర్ ఫైల్ నెం. జి1/75654/2024 తేది: 23.09.2026
భూ.సే అధికారి ఫైల్ నెం.: A/1437/2025 తేది: 18.09.2026

తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని, జిల్లా కలెక్టర్/పెనుబల్లి మండలములోని టేకులపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ. 8.04 1/4 గుం. నిమిత్తం అనగా॥ SRLIP (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని టేకులపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ. 8.04 1/4 గుం. గల భూమి యొక్క వివరములు రూఢీ, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, జారీ చేయనైనది (డిక్లరేషన్) ప్రకటన.

షెడ్యూలు

గ్రామం : టేకులపల్లి మండలం : పెనుబల్లి జిల్లా : ఖమ్మం

| క్ర.సం. | సర్వే నెంబరు | భూమి టైటిల్ | భూమి రకం | భూసేకరణలో పోవు చున్నభూమి ఏ.గుంటలలో | అనుభవదారు/పట్టేదారు యొక్క పేరు మరియు చిరునామా | హద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 63/2 | పట్టా | మెట్ట | 0.05 | మాలోత్ రాజ్య తండ్రి : బావుసింగ్ | 63/1 | 63/1 | 63/1 | 64/1 | వరి పంట |
| 2 | 63/2 | పట్టా | మెట్ట | 0.32 3/4 | మాలోత్ రేఖ్యా తండ్రి : దర్యా | 63/1 | 63/1 | 63/1 | 64/2 | వరి పంట కంచె స్తంభాలు-30 కంచె తీగ-అరకింటా, బోరుబావి-1 |
| 3 | 63/2 | పట్టా | మెట్ట | 0.03 | డొంక | 63/1 | 63/1 | 63/1 | 64/2 | - |
| మొత్తం | | | | 1.00 3/4 | | | | | | |
| 4 | 64/2 | పట్టా | మెట్ట | 0.05 1/2 | మాలోత్ రాజ్య తండ్రి : బావుసింగ్ | 64/1 | 63/2 | 64/1 | 65/2 | వరి |
| మొత్తం | | | | 0.05 1/2 | | | | | | |
| 5 | 65/2 | పట్టా | మెట్ట | 0.05 | పొన్నమోహన్ రావు & పొన్న శ్రీనివాసరావు తండ్రి కొండయ్య | 65/1 | 66/2 | 64/2 | 67/2 | పామ్ ఆయిల్ చెట్లు-11 వేపచెట్లు -2 |
| 6 | 65/2 | పట్టా | మెట్ట | 0.27 | గంట కృష్ణారావు తండ్రి వెంకటేశ్వరరావు | 65/1 | 66/2 | 64/2 | 67/2 | పామ్ ఆయిల్ చెట్లు-40 తేకు-2,వేప -2,మునగ చెట్లు-5,కొబ్బరిచెట్లు-10 కంచెస్తంభాలు -30,డ్రిప్‌పైపులు-40,కంచెతీగ-అరకింటా,మొక్కజొన్నపంట |
| 7 | 65/2 | పట్టా | మెట్ట | 0.08 1/4 | నాగబండి లక్ష్మి భర్త: శ్రీనివాసరావు | 65/1 | 66/2 | 64/2 | 67/2 | పామ్ ఆయిల్ చెట్లు-36 తేకుచెట్లు-1 వేప-2,కంచెస్తంభాలు-20, డ్రిప్‌పైపులు-6 కంచెతీగ-పావుకింటా |
| 8 | 65/2 | పట్టా | మెట్ట | 0.05 1/4 | మాలోత్ లాలిసింగ్ తండ్రి బావుసింగ్ | 65/1 | 66/2 | 64/2 | 67/2 | - |
| 9 | 65/2 | పట్టా | మెట్ట | 0.00 1/2 | మలోత్ రాజ్య తండ్రి బావుసింగ్ | 65/1 | 66/2 | 64/2 | 67/2 | - |
| మొత్తం | | | | 1.15 | | | | | | |
| 10 | 66/2 | పట్టా | మెట్ట | 0.21 | గంటకృష్ణారావు తండ్రి వెంకటేశ్వరరావు | 65/2 | 66/1 | 64/2 | 67/2 | పామ్ చెట్లు-30 |
| 11 | 66/2 | పట్టా | మెట్ట | 0.07 | నాగబండి రమాదేవి, భర్త ప్రభాకరరావు | 65/2 | 66/1 | 64/2 | 67/2 | పామ్‌ఆయిల్ చెట్లు-30 మామిడిచెట్టు -1,మొక్కజొన్న పంట,కంచె స్తంభాలు-20, జాలికంచె-1 |
| 12 | 66/2 | పట్టా | మెట్ట | 0.03 | మాలోత్ లాలిసింగ్ తండ్రి బావుసింగ్ | 65/2 | 66/1 | 64/2 | 67/2 | మొక్కజొన్న పంట,కంచె స్తంభాలు -10,కంచెతీగ -పావుకింటా |
| 13 | 66/2 | పట్టా | మెట్ట | 0.03 | మాలోత్ రాజ్య తండ్రి బావుసింగ్ | 65/2 | 66/1 | 64/2 | 67/2 | వరి |
| మొత్తం | | | | 0.34 | | | | | | |
| 14 | 67/2 | పట్టా | మెట్ట | 0.16 1/2 | ఉప్పల రాములమ్మ భర్త లింగయ్య | 67/3 | 67/1 | 66/2 | 68/1 | పామ్‌ఆయిల్ చెట్లు-24, కంచెస్తంభాలు -17 కంచెతీగ-పావుకింటా |
| 15 | 67/2 | పట్టా | మెట్ట | 0.14 | దంతాలపల్లి కృష్ణ తండ్రి రాములు | 67/3 | 67/1 | 66/2 | 68/1 | పామ్‌ఆయిల్ చెట్లు-25, కంచెస్తంభాలు -20 కంచెతీగ-పావుకింటా |
| 16 | 67/2 | పట్టా | మెట్ట | 0.18 | రావిశెట్టి కన్నయ్య నాగభూషణం | 67/3 | 67/1 | 66/2 | 68/1 | బోర్‌వెల్-1 మామిడిచెట్లు -2పామ్ ఆయిల్‌చెట్లు-50 ఫెన్సింగ్‌స్తంభాలు (వైర్‌తో)-40 |
| 17 | 67/2 | పట్టా | మెట్ట | 0.04 | డొంక | 67/3 | 67/1 | 66/2 | 68/1 | - |
| 18 | 67/2 | పట్టా | మెట్ట | 0.15 | ఆమిరినేని నాగేశ్వరరావు తండ్రి సుబ్బయ్య | 67/3 | 67/1 | 66/2 | 68/1 | పామ్‌ఆయిల్ చెట్లు-25, కంచెస్తంభాలు -20 కంచెతీగ-పావుకింటా |
| 19 | 67/2 | పట్టా | మెట్ట | 1.00 | సి.హెచ్.సాయి శివ రావు | 67/3 | 67/1 | 66/2 | 68/1 | - |
| 20 | 67/2 | పట్టా | మెట్ట | 0.02 | డొంక | 67/3 | 67/1 | 66/2 | 68/1 | - |
| 21 | 67/2 | పట్టా | మెట్ట | 0.20 | యారం చంద్రయ్య తండ్రి పెద్ద కొండయ్య | 67/3 | 67/1 | 66/2 | 68/1 | మామిడిచెట్లు -4 కంచె స్తంభాలు-15 కంచెతీగ-పావుకింటా |
| 22 | 67/2 | పట్టా | మెట్ట | 0.28 | వెలికాని సత్యనారాయణ తండ్రి రాఘవరావు | 67/3 | 67/1 | 66/2 | 68/1 | మామిడిచెట్లు -25 కంచె స్తంభాలు-30 కంచెతీగ-అరకింటా, మొక్కజొన్న పంటబోరు బావి-1,విద్యుత్‌స్తంభాలు-2 పైపులు-5 |
| 23 | 67/2 | పట్టా | మెట్ట | 0.23 | పంది ప్రసాద్ తండ్రి భిక్షమయ్య | 67/3 | 67/1 | 66/2 | 68/1 | పామ్‌ఆయిల్ చెట్లు-36,తేకుచెట్లు-1, వేప-2,కంచె స్తంభాలు-20 డ్రిప్‌పైపులు-6 కంచెతీగ-పావుకింటా |
| 24 | 67/2 | పట్టా | మెట్ట | 0.07 | పొన్న మోహన్ రావు & పొన్న శ్రీనివాసరావు తండ్రి కొండయ్య | 67/3 | 67/1 | 66/2 | 68/1 | పామ్‌ఆయిల్ చెట్లు-10 టాటివేప-23 వెదురుపొదలు కంచెస్తంభాలు -30,పైపులు10 కంచెతీగ-అరకింటా |
| 25 | 67/2 | పట్టా | మెట్ట | 0.01 1/2 | గంట కృష్ణారావు తండ్రి వెంకటేశ్వరరావు | 67/3 | 67/1 | 66/2 | - | పామ్ ఆయిల్ చెట్లు-26 |
| మొత్తం | | | | 4.29 | | | | | | |
| మొత్తం విస్తీర్ణం : | | | | 08.04 1/4 | | | | | | |

భూసేకరణ భూనిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం-2013 (నెం.30/2013)లోని 15 ప్రకారం పై భూసేకరణ పై ఎటువంటి అభ్యంతరములు నమోదు కాలేదు. కావున రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. భూసేకరణ కారణంగా ఎవరూ నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా, ఇనుము, కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని లేదివో స్వీకరించబడవు, స్వీకరించబడును.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పని వేళలో కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్/ఖమ్మం మరియు భూసేకరణ అధికారి, సబ్-కలెక్టర్-కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- సబ్ కలెక్టర్ కల్లూరు. సం/- అదనపు కలెక్టర్, ఖమ్మం జిల్లా. సం/- జిల్లా కలెక్టర్ ఖమ్మం.

DIPR RO.NO:936/LA/PP/Advt/Pub/2025-26


## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు

పరిష్కారానికి చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.1,789 కోట్ల అంచనా వ్యయంతో 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ' అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రియల్ టైమ్ ట్రాఫిక్ డేటా, అడాప్టివ్ సిగ్నల్స్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా ఢిల్లీలోని 42 కారిడార్లలో ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేలా ఈ ప్రాజెక్టు వీలు కల్పిస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు.135 గిగా వాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించుకునేలా విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.1.86 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3'కి కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాత నేర చట్టాల స్థానం లో బీఎన్‌ఎస్ అమల్లోకి వచ్చాక కేసుల విచారణ వేగవంత మైం దని.. ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో ఎనిమిది రోజుల్లోనే తీర్పు వచ్చిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలతో పాటు ఆయా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్నట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా రెండు దేశాలు సన్నిహిత సంబంధాలను కొనసాగించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, భద్రత పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు తెలిపారు.

# నైరుతి సీజన్ ముగిసింది

తర్వాత రాష్ట్రంలోకి ప్రవేశించాయి. కానీ ఎల్‌నినో ప్రభావంతో మేఘా లు తేలిపోయాయి. తెలంగాణలో సాధారణ వర్షపాతం 728.3 మి.మీ. కాగా కేవలం 601.8 మి.మీ. మాత్రమే కురిసింది. దీంతో సుమారు 17% లోటు వర్షపాతం నమోదైంది. కీలకమైన జూన్, జులై నెలల్లో వానలు పూర్తిగా మొహం చాటేశాయి.తర్వాత ఆగస్టు, సెప్టెంబ రులో కొంత ఫర్వాలేదు అనిపించినప్పటికీ వానకు, వానకు మధ్య అంతరాయం పెరగడంతో కురిసిన చినుకులు పంట అవసరాలకు మిగ లకుండా పోయాయి. చెరువులపై ఆధారపడి చేస్తున్న సాగు భూములు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు నిండకపోవడంతో ఈ సంవత్సరం సాగునీటి విడుదల చేయలేదు. పంట సాగులో జాప్యంఈ సంవత్సరం వానలు ఆలస్యం కావడం, వర్షాల మధ్య అంతరాల కారణంగా పంట సాగులో రైతులు భిన్నమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొన్నారు. తెలంగాణలోని అనేక జిల్లాల్లోని రైతులు నారు పోసి సుమారు నెలకు పైగా వేచి చూశారు. కొన్నిచోట్ల రెండు, మూడుసార్లు నార్లు పోసుకున్నారు. అనేక మందికి ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే ఆరుతడి పంటలు సాగు చేసుకున్న రైతులు మాత్రం కొంతమేర ఒడ్డున పడ్డారు.

**రాష్ట్రంలో జలాశయాల పరిస్థితి ఇలా**

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గోదావరి, కృష్ణ బేసిన్లలోని ప్రాజెక్టులు అరకొరగా నిండాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని చెరువులు, జలాశయాల నిల్వ సామర్థ్యం 1059.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 532.91 టీఎంసీలు అంటే 49.46% మాత్రమే ఉన్నాయని స్పష్టమవుతోంది. మరోవైపు చెరువులు వట్టిపోయాయి. రాష్ట్రంలోని మొత్తం చెరువుల సామర్థ్యం 253.8 టీఎంసీలు కాగా నిల్వ సామర్థ్యానికి 94.3 టీఎంసీలు (37.16%) మాత్రమే నిల్వలున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని 6,477 చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. 6,467 చెరువుల్లో 0% నుంచి 25% వరకు నీరుండగా, 4733 చెరువుల్లో కేవలం 25 నుంచి 50% మేర నీరుంది.

**327 మండలాల్లో డ్రైస్పెల్స్**

వానకు, వానకు మధ్య అంతరాన్ని డ్రైస్పెల్ అంటారు. కనిష్ఠంగా మూడు నుంచి నాలుగు వారాల పాటు వర్షపాతం నమోదు కాకపోతే ఒక డ్రైస్పెల్‌గా చెప్పవచ్చు. రాష్ట్రంలో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాలకు 16 డ్రైస్పెల్స్ నమోదయ్యాయి

## వినువీధిలో పైలెట్ల ఘర్షణ

మీదుగా తన గమ్యస్థానం నుంచి పక్కకు మళ్లింది. దాంతో విమానం అంతర్జాతీయ ఎమర్జెన్సీ కోడ్ 7700ను పంపింది. ఆ వెంటనే '7500' కో డ్‌ను ప్రసారం చేసినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానంలోకి ఎవరైనా చట్టవిరుద్ధంగా చొరబడినప్పుడు, హైజాక్ జరగొచ్చన్న పరిస్థితులు ఉన్నప్పుడు సిబ్బంది ఈ కోడ్‌ను రిలీజ్ చేస్తుంటారు. తమ దేశ ప్రయాణికులను హైజాక్ చేస్తారనే భయంతో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. అలాగే ప్రధాని నెతన్యాహు, రక్షణమంత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు.

విమానంలో అసలేం జరిగింది..?

దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానం టేకాఫ్ అయిన వెంటనే పైలట్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగిందని ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. కాక్‌పిట్‌లో ఘర్షణపడుతూనే హైజాక్ కోడ్‌ను ప్రసారం చేశారని, అయితే వారి గొడవకు గల కారణం తెలియాల్సి ఉందని పేర్కొన్నాయి. ఒక పైలట్ మరో పైలట్‌ను కత్తితో పొడిచారని ప్రయాణికులు చెప్పారు. విమానంలో గట్టిగా కేకలు వినిపించాయని తెలుస్తోంది. కాక్‌పిట్ డోర్ తెరవగానే రక్తం కనిపించిందని, ఇతర సిబ్బందితో కలిసి ఆ ఘర్షణను ఆపేందుకు ప్రయత్నించినట్లు పలువురు ప్రయాణికులు తెలిపారు. ఆ తర్వాత విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఎమర్జెన్సీ కోడ్ విడుదల చేసినప్పుడు విమానం 34వేల అడుగుల ఎత్తునుంచి ఒక్కసారిగా 16,600 అడుగుల ఎత్తుకు దిగొచ్చిందని మరికొన్ని కథనాలు తెలిపాయి.



## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపణ**

**టెల్‌అవీవ్(జనంసాక్షి):**

ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు. అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కో-పైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

## గ్రీన్‌కార్డు ఫీజులపై 'డబుల్' షాక్..

**భారతీయులపై తీవ్ర ప్రభావం**

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికాలో శాశ్వత నివాసం కోరుకునే వారికి కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న ట్రంప్ సర్కార్.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పెట్టుబడి ఆధారిత ఈబీ-5 గ్రీన్‌కార్డుల దరఖాస్తు ఫీజును భారీగా పెంచాలని నిర్ణయించింది. ఈ ప్రోగ్రామ్ కింద కొన్ని అప్లికేషన్ల ఫీజును ఏకంగా రెట్టింపు చేయడం గమనార్హం. ఈ మేరకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ దరఖాస్తు రుసుములను ఖరారు చేసింది. ఈ కొత్త నిబంధనలు నవంబరు 30 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది. ఈబీ-5 ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్ కింద.. అమెరికా (జూం) వాణిజ్య రంగంలో పెట్టుబడులు పెట్టి, అగ్రరాజ్య పౌరులకు ఉద్యోగాలు కల్పించే విదేశీ ఇన్వెస్టర్లకు గ్రీన్‌కార్డు లభించనుంది. ఇందులో పలు రకాల దరఖాస్తులున్నాయి. వీటి ఫీజులను ట్రంప్ సర్కార్ సవరించింది. దరఖాస్తుల సమీక్ష, బ్యాగ్రౌండ్ తనిఖీలు, అర్హత ధ్రువీకరణ, మోసాలను గుర్తించడం వంటి కార్యకలాపాల ఖర్చులను భరించేందుకు ఈ రుసుములను పెంచినట్లు జూఅమో ఓ ప్రకటనలో వెల్లడించింది.స్టాండ్‌ఎలోన్ ఇన్వెస్టర్లు ధరఖాస్తు చేసుకునే ఎ-526 ఫామ్ ఫీజును 3675 డాలర్ల నుంచి 7615 డాలర్లకు పెంచనున్నారు.గుర్తింపు పొందిన రీజినల్ సెంటర్ ద్వారా పెట్టుబడులు పెట్టే విదేశీయులు ఉపయోగించుకునే ఎ-526ఇ దరఖాస్తు రుసుము 3675 డాలర్ల నుంచి 7850 డాలర్లకు పెరగనుంది. దీనికి 75 డాలర్ల టెక్నాలజీ ఫీజు అదనం.తమ శాశ్వత నివాస హోదాపై ఉన్న షరతులను తొలగించాలని కోరుతూ పెట్టుబడిదారులు దాఖలు చేసే ఎ-829 దరఖాస్తు ఫీజును 3750 డాలర్ల నుంచి 5000 డాలర్లకు పెంచనున్నారు.అమెరికా వాణిజ్య సంస్థల్లో పెట్టుబడికి ఆమోదం కోరుతూ దరఖాస్తు చేసే ఎ-956ఈ ఫామ్ ఫీజు ధర 17,795 డాలర్ల నుంచి 42,675 డాలర్లకు పెరగనుంది.

# జనజాగృతి యువజన సంక్షేమ సంఘం గణపతి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కుంట్లూర్ (హరిజనవాడ) శ్రీరామ్‌నగర్ కాలనీలో శ్రీ జనజాగృతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) జనరల్ సెక్రటరీ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి నిమజ్జన శోభాయాత్రను ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు ప్రారంభించారు. భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించిన శ్రీ జనజాగృతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పవన్ , సాయినాథ్ సంఘం సభ్యులు, కాలనీ ప్రజలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు కృషి

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు**



**హనుమకొండ (జనంసాక్షి) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.వి. శ్రీనివాస్ రావును పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, సమాజంలోని ప్రతి వర్గానికి సేవలు చేరేలా సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తిని మరింత విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, రెడ్డి జాగృతి నాయకులు గుర్రం ప్రభాకర్ రెడ్డి, రెంటాల కేశవరెడ్డి తదితరులు పాల్గొని ఇ.వి. శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే పై ఐడిఓసి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ సర్వే పనులలో వేగం పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి , అన్ని మండలాల తహసిల్దార్ లు, డిప్యూటీ తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లు సజావుగా జరగాలి

- కపాస్ కిసాన్ యాప్ ద్వారా నే స్లాట్ బుక్ చేసుకోవాలి
- మిల్లుల యజమానులు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా, సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ రవి తో కలిసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా లో పత్తి సాగు,అంచనా దిగుబడి, మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మొదలగు అంశాల మీద కలెక్టర్ విస్తృతంగా అధికారులతో చర్చించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పనిచేసి పత్తి కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అన్నారు ఈ మార్కెటింగ్ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాకు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించిందన, పత్తిలో తేమ శాతం 8 నుండి 12 శాతం లోపు ఉండేలా చూసుకోవాలన్నారు ఈ సీజన్ కి 75747 ఎకరాల్లో పత్తి సాగు కాగా. 681723 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తోందని అంచనా వేయడం జరిగిందన్నారు రైతులకు ఇబ్బంది లేకుండా సీసీఐ అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల న్నారు. జిన్నింగ్ మిల్ లలో ఉన్న తూకం యంత్రాలను అలాగే వె బ్రిడ్జి లను లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాల న్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు ఆధార్ నెంబర్ తో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు జీన్నింగ్ మిల్లుల యాజ మాన్యం అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త లు తీసుకోవాల న్నారు. వ్యవసాయ, పంచాయతీ శాఖ అధికారులు గ్రామ స్థాయి లో స్లాట్ బుకింగ్, తేమ శాతం మొదలగు అంశాల మీద రైతులకు అవగాహన కల్పించాలన్నారుఈ సమావేశం లో డి ఎం ఓ అనురాధ,ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, జిన్నింగ్ మిల్లుల్లో యజమాన్యం పాల్గొన్నారు.

# ఆహార భద్రత చట్టం కఠినంగా అమలు చేయాలి

- అర్హులందరికీ రేషన్, పౌష్టికాహారం అందేలా చర్యలు
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం-2013ను పకడ్బందీగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, పౌష్టికాహారం, ఆహార భద్రత పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న గుడ్ల నాణ్యతను సమావేశంలో చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, రేషన్ దుకాణాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసి, సంబంధిత బాధ్యుల వివరాలు, ఫిర్యాదు చేసే విధానం, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాల హాస్టళ్లలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా భోజన వేళలు, మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, వంట సామగ్రి నిర్వహణ, అధికారుల పర్యవేక్షణలో కొన్ని లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో విద్యార్థుల సంక్షేమం కోసం పెద్దఎత్తున కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఫుడ్ కమిషన్ సభ్యులు ఒరగంటి ఆనంద్ మాట్లాడుతూ, ఆహార భద్రత చట్టం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం పొందే హక్కు కల్పించబడిందన్నారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, అవసరమైన వైద్య సేవలు, ప్రత్యేక సంరక్షణ అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లు, పాఠశాల విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉందన్నారు. ఆహార భద్రత హక్కుల అమలులో ఉల్లంఘనలు చోటుచేసుకున్నా, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై చర్యలు తీసుకునే అధికారం ఫుడ్ కమిషన్‌కు ఉందన్నారు. అవసరమైన సందర్భాల్లో నష్టపరిహారం చెల్లించేలా కూడా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలోని 2,566 రేషన్ దుకాణాల ద్వారా 2,27,477 రేషన్ కార్డులకు చెందిన 7,44,404 యూనిట్లకు ప్రతి నెల సుమారు 4,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 20 రేషన్ డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉట్నూర్, ఆదిలాబాద్ డివిజన్లలో చెరో 10 ఖాళీలు ఉన్నాయని వివరించారు. కొత్తగా జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేస్తున్నామని, రేషన్ పంపిణీ ప్రక్రియలో పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం, నిర్దేశిత మెనూను తప్పనిసరిగా అమలు చేయడం, కుక్స్, హెల్పర్లు, వార్డెన్లకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించడం, కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయడం, మెనూ, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లలో పోషకాహారం, పరిశుభ్రత, మౌలిక వసతుల పరిస్థితులను 'పోషణ్ చర్చ' యాప్ ద్వారా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక వికాసం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ కమిషన్ చైర్మన్, సభ్యులకు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్.చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, డీఆర్‌డీఓ రాథోడ్ రవీందర్, డీఎస్‌వో నందిని, డీఎం సుధారాణి, డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో సాధన, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు సోనియా, సునీత, సీడీపీవోలు, ఎంఈవోలు, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నెన్నెల, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు గదులు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ



కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఇతరులు పాల్గొన్నారు

# కమీషన్‌లు వస్తేనే పనులా!

- ఏడాది గడిచిన కాటారం మార్కెట్ చేయకపోవడం అవమానం
- 40ఏండ్లు అవకాశం ఇచ్చినా ప్రజలను పట్టించుకోని దుద్దిళ్ల కుటుంబం
- ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని కుట్రలు చేసిన ప్రజల పక్షాన పోరాటం చేస్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**కాటారం సెప్టెంబర్ 30( జనం సాక్షి):** మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు కమీషన్‌లు ముట్టితేనే అభివృద్ధి పనులు చేస్తాడని, లేకుంటే పనులు అర్ధాంతరంగానే ఆగిపోతాయని చెప్పడానికి కాటారం వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణామే నిదర్శనమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం కాటారం కేంద్రంలో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం మంత్రి శిలాఫలకం వేసి శంఖుస్థాపన చేశాడని తెలిపారు. ఏడాది గడిచినా ఈ పనులు పూర్తి చేయకపోవడం అవమానమని ఆయన అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాటారం మండల ప్రజలు మెజార్టీ ఇస్తారని, అలాంటి మండల ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. 40ఏండ్లుగా దుద్దిళ్ల కుటుంబానికి ప్రజలు అవకాశం ఇస్తున్నారని, ఎనిమిదిసార్లు అధికారం ఇస్తే పదవులు పొంది వేల కోట్లు సంపాదించుకున్నారే కానీ ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలతో ఓటు బంధం తప్ప ఆయనకు పేగు బంధం లేదనే విషయం అర్థం అయిందన్నారు. ఈ ప్రాంతంలో 80శాతంకు పైబడి బలహీనవర్గాలు ఉన్నారని, స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వారికి జరుగాల్సిన మేలు జరుగలేదని ప్రజాస్వామ్య పద్ధతిలో భారత రాజ్యాంగాన్ని అనుసరించనే ఆవేదన ఆందోళనతో మేము ప్రతి క్షణం అప్రమత్తం చేస్తా ఉన్నామని, మీరు పనిచేస్తే ఈ సమాజం బాగుపడుతదనే ఉద్దేశంతో అప్రమత్తం చేస్తా ఉన్నామని అన్నారు. చిన్న కాళేశ్వరం పూర్తి చేయకండి అని చెప్పడం లేదని, పని చేయాలని కోరుతున్నామని అన్నారు. ముఖ్యంగా కాటారం మండల ప్రజలు ఓట్లు ఎప్పుడు వస్తే అప్పుడు ఎనిమిది వేలు పదివేల మెజార్టీనిచ్చి అందలమెక్కిస్తే ఈ వెజిటబుల్ మార్కెట్ సంవత్సర కాలమైనా పూర్తి చేయలేకపోయారని, ఇది అవమానం కాదా అని ప్రశ్నించారు. కమిషన్లు ఎక్కడ వస్తే అక్కడ పనులు చేస్తా ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతంలో జరిగే ఒకటి రెండు పనులు కేవలం కమిషన్ కోసమే జరుగుతానయని ఆయన అన్నారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన కాళేశ్వర ఆలయాన్ని కూల్చివేయవద్దని చెప్పమని, కానీ ఆ పనుల్లో 20శాతం కమీషన్ వచ్చింది కనుకనే పనులు మొదలు పెట్టారని, అదే మార్కెట్‌కు ఎలాంటి కమీషన్ రాకపోవడంతో పనులు పూర్తి చేయడం లేదన్నారు. ఏడాది గడిచినా కాటారం మార్కెట్‌ను పూర్తి చేయని వాళ్లు ఇంత పెద్ద కాళేశ్వరం ఆలయాన్ని ఎలా పూర్తి చేస్తారనే ఆందోళన నెలకొందన్నారు. కాళేశ్వరం ఆలయ అభివృద్ధి కోసం కలెక్టర్ వద్ద వంద కోట్ల రూపాయలు తీసుకచ్చి పెట్టాలని చెప్పినా ఇప్పటి వరకు నిధులు తీసుకురాలేదన్నారు. వచ్చే ఏడాది గోదావరినది పుష్కరాలు ఉన్నాయని, ఈ పుష్కరాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పుష్కర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారని, ఆ సమయానికి ఆలయ నిర్మాణం పూర్తి కాకపోతే భక్తులకు స్వామివారి దర్శనం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తర్వాత మాసారే అని స్థానిక నాయకులు సంకలు కొట్టుకుంటూ సంబరపడుతున్నారని, ఈ సంతోషం చెవులకు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఈ నియోజకవర్గ ప్రజల కోసం నాలుగు ఐటీ కంపెనీలు ఒక ఇండస్ట్రీ కోసం ఇప్పటి వరకు కనీసం ప్రతిపాదన చేయలేదన్నారు.

# మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కొత్త ఉపాధి కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఉత్పత్తులకు వరంగల్ జిల్లా బ్రాండ్ గుర్తింపు తీసుకురావాలని సూచన




**వరంగల్ బ్యూరో , సెప్టెంబర్ 30 ( జనం సాక్షి) :** వరంగల్ జిల్లా డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో రాణి రుద్రమదేవి జిల్లా సమాఖ్య 12వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని మండల సమాఖ్య ను ఉద్దేశించి మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని 11 మండలాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొబైల్ సూపర్ మార్కెట్లు, జిరాక్స్ కేంద్రాలు, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు, పప్పు మిల్లులను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంజూరైన గ్రామ సంఘ భవనాల నిర్మాణాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, వాటికి వరంగల్ జిల్లా బ్రాండ్ గుర్తింపు తీసుకువచ్చేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వరంగల్ జిల్లా ప్రత్యేకతను ప్రతిబింబించే ఉత్పత్తులను తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా మార్కెటింగ్ చేసేలా మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటిం గ్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కే. నాగపద్మ మాట్లాడుతూ, మహిళా సంఘాలకు వివిధ జీవనోపాధి కార్యక్రమాలను ఏర్పాటు చేసేం దుకు అవసరమైన ఆర్థిక సహాయం అంది స్తామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచిం చారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి ఉమ, కోశాధికారి స్వప్న, పాలకవర్గ సభ్యులు, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎం అనిల్‌కుమార్, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



# చెట్లే కరెంట్ స్తంభాలు

- కుంటాల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**కుంటాల, సెప్టెంబర్ 30(జనం సాక్షి ) :** మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. కుంటాల – అంబకంటి వెళ్లే ఊరి మోటార్ కు వెళ్లే ప్రధాన విద్యుత్ లైన్ల తీగలు.. చెట్ల కొమ్మల మధ్య గుండా వెళ్తూ కరెంట్ స్తంభాలు దీని వల్ల వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య వేధిస్తుండటంతో ఊరి మోటార్ కాలిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి, వాన వస్తే ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతు న్నారు. కళ్ళముందే ఇంత నిర్లక్ష్యం కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితే దీనికి బాధ్యత ఎవరిది? అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చెట్ల కొమ్మలను తొలగించి, వదులుగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేసి వాల్టేజ్ హెచ్చు తగ్గులు సవరించాలి అని కోరుకుంటున్నారు

# 22 కేసుల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం

- రూ.1.30 లక్షల విలువైన 157.88 లీటర్లు నాశనం

**ఉట్నూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** వివిధ కేసుల్లో ఉట్నూర్ పోలీసులకు పట్టుబడిన మద్యాన్ని అధికారులు బుధవారం నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. ఉట్నూర్ ఏసీపీ రుత్విక్ సాయి, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఎస్ఐ విజయ్, ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్ బాలరాజు సమక్షంలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని 22 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 157.88 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 1,30,646 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ అధికారుల సమక్షంలో నిబంధనల మేరకు మధ్యాహ్నం సమయంలో మద్యం ధ్వంసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ రుత్విక్ సాయి పర్యవేక్షణలో పోలీస్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# లోటు వర్షం, లోతైన సవాలు

సంపాదకీయం

*భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. జీడీపీలో వాటా తగ్గినా, దేశ జనాభాలో సగానికి పైగా ఇప్పటికీ సాగు మీదే ఆధారపడి బతుకుతున్నారు. అందుకే నైరుతి రుతుపవనాలు కేవలం వాతావరణ వార్త కాదు; అవి కోట్లాది కుటుంబాల జీవన భద్రతకు సంబంధించిన అంశం. ఈ ఏడాది జూన్–సెప్టెంబర్ సీజన్ 13 శాతం లోటుతో ముగిసిందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. దీర్ఘకాలిక సగటులో 87 శాతం వర్షమే కురిసింది. 2001 తర్వాత నమోదైన నాలుగో అత్యల్ప వర్షపాతం ఇది. ఎల్‌నినో ప్రభావం, బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడకపోవడం, దేశంలో సగానికి పైగా ప్రాంతాలు పొడిగా మిగిలిపోవడం ఈ పరిస్థితికి కారణాలు. తెలంగాణలో 15 నుంచి 17 శాతం లోటు నమోదైంది; గత ఏడాదితో పోలిస్తే వర్షపాతం 38 శాతం పడిపోయింది. రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల పరిస్థితీ భిన్నం కాదు.*

దీని ప్రభావం ఒక్క సీజన్‌తో ఆగదు. ఖరీఫ్ పంటల దిగుబడి తగ్గడం ఇప్పటికే ఖాయమైంది. వరి, పత్తి, కంది, సోయాబీన్ వంటి పంటలు వేసిన రైతులు పెట్టుబడి కూడా వెనక్కి రాని స్థితిలో పడతారు. అప్పులు పెరుగుతాయి, వడ్డీ భారం మోపుతుంది, గ్రామీణ వినియోగం పడిపోతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన నూనె మిల్లులు, పత్తి జిన్నింగ్, బియ్యం మిల్లులు, పాడి, చక్కెర రంగాలు ముడిసరుకు కొరతతో ఇబ్బంది పడతాయి. ఇది ఉపాధిపై నేరుగా ప్రభావం చూపుతుంది. ధాన్యం, పప్పులు, కూరగాయల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్లు తలకిందులవుతాయి. ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్థిక వృద్ధికి కూడా అది అడ్డంకిగా మారుతుంది. ఇంతకంటే ఆందోళన కలిగించే అంశం భూగర్భ తేమ తగ్గిపోవడం. రబీ సాగుకు అవసరమైన నీటి లభ్యత లేకపోతే రెండో పంట కూడా ప్రశ్నార్థకమవుతుంది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం కూడా ఉంది.

ఇక్కడే ప్రభుత్వాల బాధ్యత మొదలవుతుంది. కరవు వచ్చాక స్పందించడం కాదు, ముందే సిద్ధపడటం ముఖ్యం. లోటు వర్షపాతం ఉన్న మండలాలను త్వరగా గుర్తించి, శాస్త్రీయంగా పంట నష్టం అంచనా వేయాలి. కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం నిందించుకోకుండా కరవు ప్రకటన, జాతీయ విపత్తు నిధుల విడుదల వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలి. పంటల బీమా పరిహారం నెలల తరబడి ఆలస్యం కాకుండా రైతుల ఖాతాల్లో సకాలంలో జమ కావాలి. రుణాల రీషెడ్యూలింగ్, వడ్డీ మినహాయింపు, కొత్త రుణాల మంజూరులో బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు అవసరం. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచి, చేతిలో డబ్బు లేని కూలీలకు ఆసరా కల్పించాలి. పశుగ్రాసం, తాగునీటి సరఫరాకు అత్యవసర ప్రణాళికలు రూపొందించాలి. రబీలో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించేందుకు విత్తనాలు, సూచనలు అందించాలి. ధరల నియంత్రణకు బఫర్ నిల్వలను వినియోగించడం, అవసరమైతే దిగుమతులు, ఎగుమతి నియంత్రణలపై సకాలంలో నిర్ణయం తీసుకోవడం కూడా అవసరం.

అయితే తాత్కాలిక సహాయం మాత్రమే సరిపోదు. వాతావరణ మార్పుల కాలంలో ఎల్ నినో వంటి పరిస్థితులు తరచూ పునరావృతమవుతాయి. కాబట్టి దీర్ఘకాలిక దృక్పథం కావాలి. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీచార్జ్, బిందు, తుంపర సేద్యం విస్తరణ, వాతావరణాన్ని తట్టుకునే వంగడాల అభివృద్ధి ఇక వాయిదా వేయలేని పనులు. వర్షాధార సాగుపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామస్థాయి రైతుకు అర్థమయ్యే భాషలో, సకాలంలో చేరవేసే వ్యవస్థ బలపడాలి. ఏ పంట వేయాలో, ఎప్పుడు వేయాలో సలహా ఇచ్చే విస్తరణ సేవలు పునరుజ్జీవం పొందాలి.

రైతు దేశానికి అన్నం పెడతాడు; ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు అతడిని ఒంటరిగా వదిలేయడం పాలకుల ధర్మం కాదు. ఈ లోటు వర్షం ఒక హెచ్చరిక. దీనికి ప్రభుత్వాలు చూపే స్పందనే రాబోయే నెలల్లో గ్రామీణ భారతం భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# మోహన్ భగవత్ ఉపదేశాలు – బీజేపీ స్వీకరిస్తుందా?



"అభివృద్ధి అంటే అంతరాలను తగ్గించడం. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందాలి. పేదలకు కూడు, గుడ్డ, గూడు మాత్రమే కాకుండా నాణ్యమైన విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం కూడా లభించాలి. ప్రకృతిని నాశనం చేయకుండా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి." ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవల చేసిన ఈ వ్యాఖ్యలు ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే ఇవి కేవలం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతపరమైన సూచనలా? లేక గత పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఆలస్యంగా చేసిన హెచ్చరికలా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

దీనికి సమాధానం ప్రసంగాల్లో కాదు, గణాంకాల్లో వెతకాలి. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ అంచనాల ప్రకారం 2022–23లో భారతదేశ సంపదలో పై ఒక శాతం వాటా 40.1 శాతం ఉండగా, దిగువ 50 శాతం వాటా కేవలం 6.4 శాతం. కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకరణను భగవత్ వ్యతిరేకిస్తున్నట్లయితే, గత దశాబ్దంలో ఇలాంటి సంపద కేంద్రీకరణకు దారితీసిన ఆర్థిక విధానాలను ఆర్ఎస్ఎస్ ఎందుకు ప్రశ్నించలేదు?

ఆకలి, మానవ అభివృద్ధి పరిస్థితులు కూడా ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. 2025 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 123 దేశాల్లో భారత్ 102వ స్థానంలో ఉంది. భారత స్కోరు 25.8గా ఉండి, "తీవ్రమైన" ఆకలి స్థాయిగా నమోదైంది. పిల్లల్లో స్టంటింగ్ 32.9 శాతం, వేస్టింగ్ 18.7 శాతంగా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం 2025 నివేదికలో 193 దేశాల్లో భారత్ 130వ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికీ మధ్యస్థ మానవ అభివృద్ధి వర్గంలోనే ఉంది. ఈ గణాంకాలు ఆర్థిక వృద్ధిని మాత్రమే అభివృద్ధికి ప్రమాణంగా చూడలేమని స్పష్టం చేస్తున్నాయి.

యువత ఉపాధి పరిస్థితి మరో తీవ్రమైన సవాలు. 2025 ఏప్రిల్––జూన్ మధ్య 15–29 ఏళ్ల యువతలో నిరుద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో 21 శాతం, బిహార్‌లో 16.7 శాతంగా నమోదైంది. 2025లో ఉపాధి, విద్య లేదా శిక్షణలో లేని భారత యువత వాటా 24.3 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. అందువల్ల నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, విద్యా వ్యవస్థపై అసంతృప్తితో యువతలో ఉద్భవిస్తున్న ఉద్యమాలను కేవలం సోషల్ మీడియా కార్యకలాపాలుగా కొట్టిపారేయడం సరికాదు.

ప్రజాస్వామ్య స్వేచ్ఛల విషయంలోనూ ప్రశ్నలు ఉన్నాయి. 2026 ఫ్రీడమ్ హౌస్ నివేదిక భారత్‌కు 100లో 62 స్కోరు ఇచ్చి "పాక్షిక స్వేచ్ఛ" ఉన్న దేశంగా పేర్కొంది. ముస్లింలపై వివక్ష, హింసకు సంబంధించిన ఆందోళనలను కూడా ప్రస్తావించింది. 2026 వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 180 దేశాల్లో భారత్ 157వ స్థానంలో ఉంది. యాక్సెస్ నౌ గణాంకాలను ఉటంకిస్తూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపిన ప్రకారం, 2025లో భారత్‌లో 65 ఇంటర్నెట్ షట్‌డౌన్లు నమోదయ్యాయి. సమానత్వం, గౌరవం ఆధారంగా సమాజాన్ని నిర్మించాలంటే ఈ గణాంకాలను కూడా పరిశీలించాల్సిందే.

మీడియా పరిస్థితిలోనూ ఇదే వైరుధ్యం కనిపిస్తోంది. "గోదీ మీడియా", "వాట్సాప్ యూనివర్సిటీ" వంటి పదాలు పక్షపాత మీడియా కథనాలపై ప్రజల్లో ఉన్న విమర్శలకు ప్రతిబింబంగా మారాయి. నిరుద్యోగం, రైతుల ఆందోళనలు, పరీక్షల లీకులు, దర్యాప్తు సంస్థల రాజకీయ దుర్వినియోగం ఆరోపణలు, సోషల్ మీడియా తప్పుడు సమాచార వ్యాప్తి వంటి అంశాలు ప్రధాన ప్రజా సమస్యలుగా మారుతున్న సమయంలో ఆర్ఎస్ఎస్ ఎందుకు మౌనంగా ఉంది? మీడియా పక్షపాతం ప్రజాస్వామ్యానికి నష్టం చేస్తే, దానిపై ముందుగానే ఎందుకు స్పందించలేదు?

రైతుల విషయంలో భగవత్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. 2020లో కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు భారీ రైతు ఉద్యమానికి దారితీశాయి. చివరకు 2021లో ఆ చట్టాలను రద్దు చేశారు. అయినప్పటికీ రైతుల అనేక డిమాండ్లు ఇంకా పరిష్కారం కాలేదు. అదేవిధంగా 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా సమీకరించడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. అయితే ఈ సంస్కరణల వల్ల వేతనాలు, సామాజిక భద్రత, కార్మికుల భద్రత మెరుగుపడతాయని ప్రభుత్వం చెబుతోంది అయినా ఆరెస్సెస్ నిజాలు తెలిసికూడా తెలివిగా ఈ విషయాల్లో కేంద్రాన్ని ప్రశ్నించ లేదు.

వైద్యం, పర్యావరణ రంగాల్లోని గణాంకాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం 2024లో సురక్షితంగా నిర్వహించబడిన తాగునీటి సేవలు 76.44 శాతం ప్రజలకు, సురక్షిత పారిశుధ్య సేవలు 62.79 శాతం ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2021–22లో ప్రభుత్వ ఆరోగ్య వ్యయం జీడీపీలో 1.8 శాతం కాగా, మొత్తం ఆరోగ్య వ్యయంలో కుటుంబాల వాటా 44.1 శాతంగా ఉంది. 2026 యేల్ పర్యావరణ పనితీరు సూచికలో 180 దేశాల్లో భారత్ 176వ స్థానంలో, గాలి నాణ్యతలో 175వ స్థానంలో ఉంది.

అయితే భగవత్ తాజా వ్యాఖ్యలను ఆర్ఎస్ఎస్, బీజేపీ మధ్య విభేదాలకు స్పష్టమైన సంకేతంగా చూడటం తొందరపాటు అవుతుంది. 2025లో భగవత్ స్వయంగా ఆర్ఎస్ఎస్, బీజేపీ మధ్య వివాదం లేదని, అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ లక్ష్యాలు ఒకటేనని చెప్పారు. 2024 ఎన్నికల తరువాత ఆయన రాజకీయాల్లో విభజనాత్మక భాషను కూడా విమర్శించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ లోక్‌సభ బలం 303 నుంచి 240 స్థానాలకు తగ్గింది. దీంతో ప్రభుత్వం మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఆ తరువాత భగవత్ వినయం, సేవాభావంపై చేసిన వ్యాఖ్యలను కొందరు విశ్లేషకులు మార్పు కోసం చేసిన సూచనలుగా చూశారు. అయితే వాటిని బీజేపీతో బహిరంగ విభేదంగా పరిగణించడానికి ఆధారం లేదు.

అసలు ప్రశ్న ఏమిటంటే, భగవత్ చెప్పిన మాటలు విధానాలుగా మారతాయా? ఆర్ఎస్ఎస్ నిజంగా అసమానతలను తగ్గించాలని కోరుకుంటే, ఆ మార్పు బడ్జెట్లలో, ఉపాధిలో, ప్రభుత్వ విద్యలో, వైద్యంలో, రైతుల ఆదాయంలో, మత సామరస్య సూచికల్లో, మీడియా స్వేచ్ఛలో, పర్యావరణ నాణ్యతలో, ఎన్నికల సంస్థలపై ప్రజల విశ్వాసంలో కనిపించాలి.

ప్రజలకు మరో నైతిక ఉపదేశం అవసరం లేదు. ఏ విధానాలు మారాలి? ఎన్ని నాణ్యమైన ఉద్యోగాలు సృష్టించాలి? రైతుల రుణభారం ఎలా తగ్గించాలి? ద్వేష ప్రసంగాలను ఎలా సమానంగా ఎదుర్కోవాలి? మీడియా, ఎన్నికల సంస్థలను బలోపేతం చేయడానికి ఎలాంటి సంస్థాగత రక్షణలు కల్పించాలి? అనే ప్రశ్నలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించి, కేంద్ర ప్రభుత్వం నుండి సరైన సమాధానాలు రాబట్టాలి. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారులు లేదా జీడీపీ వృద్ధి కాదు. ఎవరు వెనుకబడ్డారు? ఎందుకు వెనుకబడ్డారు? వారిని ముందుకు తీసుకురావడానికి అధికారంలో ఉన్నవారు ఏం చేస్తున్నారు? అన్నదే అసలు పరీక్ష. చివరికి భగవత్ మాటలను ఎంతవరకు బీజేపీ ప్రభుత్వం ఎంత వరకు ఆచరణలో పెట్టారో ప్రసంగాలు కాదు, కొలిచే గణాంకాల ఫలితాలే నిరూపించాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## కృత్రిమ మేధస్సు – రేపటి తరానికి ముప్పు!!

కోడింగ్ రాసిన కావ్యాల లోపల
జ్ఞానపు లోతులు తరిగిపోయే
కంటిపాపల స్వచ్ఛమైన సృజనను
సిలికాన్ చిప్పులు మింగేసే!
అక్షరాల వెనుక ఆత్మ లేదు
మెదడు నాడులు మొద్దుబారే
కంప్యూటర్ స్క్రీన్ల వెలుతురులో
నిజమైన మేధస్సు మంటకలిసే!
ప్రాణం లేని అల్గోరిథం వలలో
యువతరం ఆలోచన చిక్కుకుపోయే
పలకా బలపం పక్కన పడేసి
యంత్రాలకే బానిసగా మారే!
సహజమైన ఊహల లోకాన్ని
డిజిటల్ మాయాజాలం శాసించే
రెప్పల చాటున దాగిన ఆశలు
డేటా సర్వర్లలో బందీ ఆయే!
మనుషుల నడుమ బంధాలన్నీ
వర్చువల్ నీడలుగా మారిపోయే
ఈ రోబోల సామ్రాజ్యపు వేగంలో
మానవ మనుగడే శూన్యమయ్యే!
యంత్రం మనకు సేవకుడే కానీ
సృష్టిని శాసించే శక్తి కాకూడదు
మానవ సంకల్పపు వెలుగుల ముందర
సాంకేతిక ముప్పు ఎప్పుడూ గెలవలేదు!

-జాటావత్ రాజు
(యువ కవి, రచయిత)
తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.



## రో

అప్పులు చేయకు మనిషీ
తిప్పలు పడకు మనిషీ
మతిచెడకను బలే
గొప్పగ బతకగ వచ్చును
అప్పులు నిప్పు వలె నిన్ను
అంతము చేయున్
వడ్డికి వడ్డి పెరిగి నీ
నడ్డిని విరుచ నడివీధి
నగుబాటవదా
గుడ్డిగ అప్పును నమ్మకు
గడ్డు సమయమున గడపుము
గంజిగటకతో!

రేడియమ్
9291527757

# ఒక విప్లవకారుడి మేధో ప్రయాణం – చారిత్రక పత్రం

## భగత్‌సింగ్ రచనలు – ఒక పరిశీలన

భగత్‌సింగ్ జయంతి వచ్చిందంటే చాలు. దేశమంతా ఒక ముఖం మన కళ్లముందు నిలుస్తుంది. తలపై టోపీ. పల్చని మీసం. కళ్లలో మొండితనం కాదు, ఒక విచిత్రమైన ప్రశాంతత. చేతిలో పిస్టల్. ఆ తరువాత ఉరికంబం వైపు నవ్వుతూ నడిచిన యువకుడి చిత్రం. ఆ చిత్రానికి పూలమాలలు పడతాయి. సభల్లో నినాదాలు మార్మోగుతాయి. పాటలు పాడుతారు. దేశభక్తి గురించి మాట్లాడతారు. కానీ.. ఆ చిత్రానికి వెనుక నిలబడి ఉన్న మరో భగత్‌సింగ్ మాత్రం అంతగా కనిపించడు. పుస్తకం చేతిలో పట్టుకున్న భగత్‌సింగ్. తన నమ్మకాలనే తాను ప్రశ్నించుకున్న భగత్‌సింగ్. రాత్రింబవళు చదివిన భగత్‌సింగ్. జైలు గోడల మధ్య కూర్చొని మార్క్స్, లెనిన్, ట్రాట్స్కీ, బకునిన్, రూసో, వోల్టేర్, గోర్కీ, దొస్తోయెవ్‌స్కీ వంటి రచయితలతో మేధో సంభాషణ చేసిన భగత్‌సింగ్. దేవుడి ఉనికిని ప్రశ్నించినంత తీవ్రంగా తనలోని అహంకారాన్నీ ప్రశ్నించిన భగత్‌సింగ్. యువ రాజకీయ కార్యకర్తలకు చివరి రోజుల్లో సైతం రాజకీయ పాఠాలు చెప్పాలనుకున్న భగత్‌సింగ్. ఈ భగత్‌సింగ్‌ను మనం ఎంతగా చదివాం? ఏ మేరకు అర్థం చేసుకున్నం?

భగత్‌సింగ్‌ను ఒక వీరుడిగా గుర్తు చేసుకోవడం ఆయనకు జరిగిన చారిత్రక గౌరవం కావచ్చు. కేవలం వీరుడిగానే పరిమితం చేయడం మాత్రం ఆయనకు జరిగిన చారిత్రక అన్యాయం. ఎందుచేతనంటే భగత్‌సింగ్ తన జీవితంతో పాటు ఒక ఆలోచనా ప్రపంచాన్ని మనకు వదిలి వెళ్లాడు. ఆయన రచనలు చదివితే మనకు కనిపించేది బాంబు విసిరిన యువకుడు కాదు. తన కాలాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన ఒక యువ మేధావి. తన నమ్మకాలను పరీక్షించుకున్న ఒక హేతువాది. సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొంటూనే సమాజంలో ఉన్న దోపిడీ, అసమానతలను ప్రశ్నించిన ఒక విప్లవకారుడు. వ్యక్తిగత వీరత్వం నుంచి ప్రజా ఉద్యమం వైపు తన ఆలోచనను తీసుకెళ్లిన ఒక రాజకీయ కార్యకర్తగా కనిపిస్తారు. భగత్‌సింగ్ రచనలు ఆయన జీవితానికి అనుబంధం కావు. అవే ఆయన ఆలోచనా జీవితానికి ప్రధాన ఆధారాలుగా నిలిచాయి. ఆయన ఎప్పుడు ఏమి ఆలోచించాడు? ఎందుకు ఆలోచించాడు? తన పూర్వపు నమ్మకాల నుంచి ఎలా బయటపడ్డాడు? విప్లవం గురించి ఆయన అవగాహన ఎలా మారింది? మతం, దేవుడు, హేతువు గురించి ఆయన ఎందుకు ప్రశ్నించాడు? స్వాతంత్ర్యం అంటే ఆయనకు ఏమిటి? యువ రాజకీయ కార్యకర్త నుంచి ఆయన ఏమి ఆశించాడు? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆయన రచనల్లోనే దొరుకుతాయి. వాటిని వెతికే ధైర్యం మనకు కావాలి. వాటిని పరిశీలించాలి, అవగాహన చేసుకోవాలి. వీలైతే కార్యాచరణకు పూనుకోవాలి.

భగత్‌సింగ్ జీవించిన కాలం భారతదేశ చరిత్రలో ఒక అసాధారణమైన మలుపు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం తన అధికారాన్ని కొనసాగిస్తోంది. జాతీయోద్యమం విస్తరిస్తోంది. గాంధేయ రాజకీయాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. మరోవైపు.. విప్లవకారుల కార్యకలాపాలు యువతను ఆకర్షిస్తున్నాయి. కార్మిక – రైతు ఉద్యమాలు కొత్త రాజకీయ శక్తిగా ఎదుగుతున్నాయి. 1917 రష్యా విప్లవం ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రశ్నలను లేవనెత్తింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ విముక్తి మాత్రమేనా? లేక దోపిడీ లేని సమాజ నిర్మాణం కూడా విముక్తిలో భాగమా? అనే ప్రశ్న ప్రపంచ యువత ముందుకొచ్చింది. భారతదేశ యువత ఈ ప్రశ్నల నుంచి తప్పించుకోలేదు. భగత్‌సింగ్ ఆ చరిత్రలోనే పెరిగాడు. అతని బాల్యం దేశభక్తి వాతావరణంలో గడిచింది. కుటుంబంలోనే స్వాతంత్ర్యోద్యమం, బ్రిటిష్ వ్యతిరేక భావాలు ఉన్నాయి. కుటుంబ వారసత్వాన్ని యథాతథంగా మోసుకెళ్లిన వ్యక్తిగా అతన్ని చూడలేం. చదువు పెరిగేకొద్దీ ప్రశ్నలు పెరిగాయి. ప్రశ్నలు పెరిగేకొద్దీ పాత విశ్వాసాలపై సందేహం మొదలైంది. సందేహం అధ్యయనానికి దారితీసింది. అధ్యయనం ఆలోచనను మార్చింది. ఆలోచన రాజకీయ మార్గాన్ని మార్చింది. ఈ పరిణామాన్ని భగత్‌సింగ్ స్వయంగా అత్యంత నిజాయితీగా నమోదు చేసిన రచన 'నేను నాస్తికుడిని ఎందుకు?' అనే వ్యాసం. 1930 అక్టోబర్ 5 – 6 తేదీల్లో జైలులో రాసిన ఈ వ్యాసం తరువాత ద్రష్టవ్ గ్రావశీజూశ్రీవ పత్రిక 1931 సెప్టెంబర్ 27 సంచికలో ప్రచురితమైంది. అందుబాటులో ఉన్న అసలు ప్రచురిత పేజీల ఆధారంగా ఈ రచనను పునరుద్ధరించిన పాఠం కూడా ఉంది.



భగత్‌సింగ్ జైలు నోట్‌బుక్ ఆయన వారసత్వంలో ప్రత్యేకమైన పత్రం. అది సాధారణ డైరీ కాదు. తన బాధలను నమోదు చేసిన వ్యక్తిగత దినచర్య పుస్తకం కాదు. అది ఒక విప్లవకారుడి మేధో ప్రయోగశాల. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి అతను చదివిన గ్రంథాల నుంచి తీసుకున్న గమనికలు, ఆలోచనలు, ఉటంకణలు, ప్రశ్నలు అందులో ఉన్నాయి. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, ట్రాట్స్కీ, బకునిన్ వంటి విప్లవ సిద్ధాంతకర్తలతో పాటు రూసో, వోల్టేర్, మాక్యావెల్లీ, రస్సెల్, గోర్కీ, దొస్తోయెవ్‌స్కీ, విక్టర్ హ్యూగో తదితర రచయితలు, ఆలోచనాపరుల ఆనవాళ్లు అందులో కనిపిస్తాయి. భారతీయ ఆలోచనాపరులు, రచయితలు, రాజకీయ నాయకుల గురించిన గమనికలూ ఉన్నాయి. ఇక్కడ ఒక విషయం స్పష్టం అవుతుంది. భగత్‌సింగ్ ప్రపంచాన్ని ఒకే కిటికీ నుంచి చూడలేదు. తనకు నచ్చిన రచయితలనే చదవలేదు. విభిన్న భావజాలాలను చదివాడు. వాటితో వాదించాడు. ఏది స్వీకరించాలి? ఏది తిరస్కరించాలి? అనే విషయంపై ఆలోచించాడు. ఈ అర్థంలో జైలు నోట్‌బుక్ ఒక పుస్తకాల జాబితా మాత్రమే కాదు. అది ఒక యువ విప్లవకారుడి మేధో ప్రయాణానికి మ్యాప్. బ్రిటిష్ ప్రభుత్వం అతని శరీరాన్ని జైలులో బంధించినప్పుడు అతని ఆలోచన మాత్రం జైలు గోడలను దాటి ప్రపంచాన్ని చుట్టింది. ఉరికంబం ఎదురుగా కనిపిస్తున్నప్పటికీ అతని నోట్‌బుక్‌లో చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయాలు, సమాజం, మానవుడు గురించి ప్రశ్నలు కొనసాగుతున్నాయి.

1929 ఏప్రిల్ 8న భగత్‌సింగ్, బి.కె. దత్ కేంద్ర శాసనసభలో బాంబులు విసిరిన సంఘటనను మాత్రమే గుర్తు చేసుకుంటే ఆ చర్య వెనుక ఉన్న రాజకీయ ప్రకటనను మరిచిపోతాం. 'The Red Pamphletµతో పాటు కోర్టు ప్రకటనలు చూస్తే వారి ఉద్దేశం తమ చర్యను ప్రజలకు రాజకీయ సందేశంగా మార్చడం అని అర్థమవుతుంది. కోర్టు వారి మీద తీర్పు చెప్పే స్థలం మాత్రమే కాదు. ప్రజల ముందు తమ రాజకీయ ఆలోచనలను ఉంచే వేదికగా కూడా మారింది. ఇక్కడే భగత్‌సింగ్ రాజకీయ వ్యూహంలోని ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. పాలకుడు తనకు ఇచ్చిన వేదికను కూడా ప్రజా రాజకీయ వేదికగా మార్చుకోవడం. జైలు ఒక నిర్బంధ స్థలం. దానిని అధ్యయన స్థలంగా మార్చుకున్నాడు. కోర్టు ఒక న్యాయస్థానం. దానిని రాజకీయ ప్రచార వేదికగా ఉపయోగించాడు.

అతని నాస్తికత్వాన్ని అందుకే కేవలం దేవుడి నిరాకరణగా చదవడం సరిపోదు. అది మనిషి తన బుద్ధిపై, తన సామూహిక శక్తిపై ఆధారపడాలనే భావనతో ముడిపడి ఉంది. ప్రకృతి, సమాజం, మానవ జీవితం గురించి కారణబద్ధమైన వివరణను వెతకడం అతనికి ముఖ్యం. దేవుడి పేరుతో అన్యాయాన్ని సమర్థించడం అతని ఆలోచనకు విరుద్ధం. భగత్‌సింగ్ మతాన్ని కేవలం వ్యక్తిగత విశ్వాసంగా మాత్రమే చూడలేదు. మత సంస్థలు, మతపరమైన అధికారాలు, సామాజిక శక్తి నిర్మాణాలతో వాటి సంబంధాన్ని పరిశీలించాడు. ప్రజలు ఎందుకు దేవుడిని నమ్ముతారు? భయం, బలహీనత, అజ్ఞానం, భవిష్యత్తుపై అనిశ్చితి వంటి మానవ పరిస్థితులు విశ్వాసాల నిర్మాణంలో ఎలా పాత్ర పోషిస్తాయి? అనే ప్రశ్నలను లేవనెత్తాడు. అతని సమాధానాలతో మనం ఏకీభవించాలా లేదా అన్నది వేరే విషయం. కానీ ప్రశ్నించే పద్ధతి మాత్రం ఆయన రచనకు ప్రత్యేకత. భగత్‌సింగ్ రచనలలో సామ్రాజ్యవాద వ్యతిరేకత కేవలం విదేశీ పాలకుడిని తరిమేయాలనే కోపంగా కనిపించదు. దోపిడీ నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలనే ప్రయత్నంగా కనిపిస్తుంది. బ్రిటిష్ పాలన ఎందుకు కొనసాగుతోంది? దాని వెనుక కేవలం ఆయుధ బలం ఉందా? లేక భారతీయ సమాజంలోని అంతర్గత బలహీనతలు, ఆర్థిక సంబంధాలు, వర్గ ప్రయోజనాలు కూడా దానికి ఆధారమా? అనే ప్రశ్నల దిశగా ఆయన ఆలోచన సాగింది. అందుకే ఆయనకు జాతీయ విముక్తి మరియు సామాజిక విముక్తి వేర్వేరు విషయాలు కావు. బ్రిటిష్ పాలకుడు వెళ్లిపోయిన తరువాత కూడా పేద రైతు పేదగానే ఉంటే? కార్మికుడు దోపిడీకి గురవుతూనే ఉంటే? సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైతే? కులం, మతం, సామాజిక అసమానతలు కొనసాగితే? అప్పుడు స్వాతంత్ర్యం సాధారణ ప్రజల జీవితాల్లో ఎంతవరకు అర్థవంతమవుతుంది? ఈ ప్రశ్న భగత్‌సింగ్ రాజకీయ ఆలోచనలో అంతర్భాగంగా మారింది.

సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజలతో సంబంధం పెంచుకోవాలి. చరిత్రను చదవాలి. రాజకీయ పరిస్థితులను విశ్లేషించాలి. సంస్థాగతంగా పనిచేయాలి. వ్యక్తిగత వీరత్వం కంటే ప్రజా ఉద్యమానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ భావన భగత్‌సింగ్ ఆలోచనలో జరిగిన పరిణామానికి ఒక చారిత్రక ముద్ర. భగత్‌సింగ్ నుంచి నేటి యువత నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఒకటి ఉంది. అది 'ధైర్యం' కంటే ముందు 'చదువు'. నినాదం కంటే ముందు 'అర్థం'. పోరాటం కంటే ముందు 'లక్ష్యం'. వ్యక్తిగత త్యాగం కంటే ముందు 'సామూహిక ప్రయోజనం'. భావోద్వేగం కంటే ముందు 'విశ్లేషణ'.

విప్లవాలను పోల్చుతున్నాడు. మానవ సమాజం గురించి ఆలోచిస్తున్నాడు. భగత్‌సింగ్ జైలు నోట్‌బుక్‌కు సంబంధించిన పత్రాలు, ప్రచురణలు దాని ప్రామాణికతను చారిత్రకంగా అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతున్నాయి. నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆధారాలతో సంబంధం ఉన్న ప్రచురణలు, పరిశోధనా వివరాలు ఈ నోట్‌బుక్ ఆయన అధ్యయన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కీలకమైన మూలంగా గుర్తిస్తున్నాయి. ఇది భగత్‌సింగ్ రచనలను కేవలం జ్ఞాపక సాహిత్యంగా కాకుండా ప్రాథమిక చారిత్రక ఆధారాలుగా చదవాల్సిన అవసరాన్ని బలపరుస్తుంది. భగత్‌సింగ్ రచనలను చదివేటప్పుడు మరో జాగ్రత్త అవసరం. ఆయన జీవితంలోని ప్రతి దశను ఒకే రాజకీయ స్థితిగా చూడకూడదు. 1923 లో రాసిన యువ రచయిత, 1928లో ఉన్న విప్లవకారుడు, 1929 లో జైలు నిరాహార దీక్షలో ఉన్న రాజకీయ ఖైదీ, 1930లో నాస్తికత్వాన్ని వివరిస్తున్న ఆలోచనాపరుడు, 1931లో యువ రాజకీయ కార్యకర్తలకు రాస్తున్న విప్లవకారుడు. ఇవన్నీ ఒకే వ్యక్తి అయినప్పటికీ, ఒకే ఆలోచనా దశ కాదు. అతని రచనలను కాలక్రమంలో చదివితేనే ఆ పరిణామం అర్థమవుతుంది. భగత్‌సింగ్‌ను ఒక సిద్ధంగా తయారైన సిద్ధాంతపు విగ్రహంగా నిలబెట్టడం కన్నా, పరిణామంలో ఉన్న ఆలోచనాపరుడిగా చూడటం చారిత్రకంగా మరింత సార్థకం. అతను తన కాలాన్ని ప్రశ్నించాడు. తనను తాను ప్రశ్నించాడు. తన సహచరుల ఆలోచనలను ప్రశ్నించాడు. తన పూర్వపు విశ్వాసాలను ప్రశ్నించాడు. చివరికి సమాజాన్ని మార్చే మార్గం గురించి కూడా నిరంతరం ఆలోచించాడు.

భగత్‌సింగ్ రచనల్లో మానవత్వం కూడా అంతే ముఖ్యమైన అంశం. అతని రాజకీయ భాషలో 'మనిషి' కేంద్రస్థానంలో ఉన్నాడు. ఆకలితో ఉన్న మనిషి. దోపిడీకి గురవుతున్న కార్మికుడు. పేద రైతు. సామాజికంగా అణచివేయబడుతున్న ప్రజలు. వీరి జీవితాల్లో మార్పు లేకుండా రాజకీయ స్వాతంత్ర్యం పూర్తి కాదనే దిశలో అతని ఆలోచన సాగింది. ఈ కారణంగానే అతని విప్లవ భావన ఒక జాతీయ పతాకంతో ఆగిపోదు, సమాజ నిర్మాణాన్ని ప్రశ్నిస్తుంది. ఇదే సందర్భంలో భగత్‌సింగ్‌ను వివిధ రాజకీయ శక్తులు తమ తమ అవసరాలకు అనుగుణంగా స్వంతం చేసుకోవాలనే ప్రయత్నాలను కూడా చారిత్రకంగా పరిశీలించాలి. అతని టోపీని ఎవరైనా ధరించవచ్చు. అతని చిత్రాన్ని ఎవరైనా తమ కార్యాలయంలో పెట్టుకోవచ్చు. అతని పేరు మీద ఎవరైనా సభ నిర్వహించవచ్చు. ఒక వ్యక్తి వారసత్వాన్ని స్వంతం చేసుకోవడం అంటే అతని చిత్రాన్ని స్వంతం చేసుకోవడం కాదు. అతని ఆలోచనలతో సంభాషించాలి. అతని రచనలను చదవాలి. అతను ఏం చెప్పాడో చూడాలి. ఏం చదివాడో తెలుసుకోవాలి. ఏ రాజకీయ విలువలను ముందుకు తెచ్చాడో పరిశీలించాలి. భగత్‌సింగ్‌ను కేవలం 'దేశభక్తుడు' అనే ఒక పదంలో బంధించడం కూడా అంతే పరిమితమైనది. దేశభక్తి అతని జీవితంలో ఉంది. దానిని సామాజిక సమానత్వం, సామ్రాజ్యవాద వ్యతిరేకత, హేతువాదం, సోషలిజం, ప్రజా విముక్తి వంటి ప్రశ్నలతో కలిపి చూడాలి. లేకపోతే భగత్‌సింగ్ ఒక పోస్టర్‌గా మిగిలిపోతాడు. ఒక ఆలోచనగా జీవించడు. అతని రచనలు చదివితే మరో విషయం తెలుస్తుంది. భగత్‌సింగ్ 'త్యాగం'ను కూడా ఒక రాజకీయ భాషగా ఉపయోగించాడు. తన మరణాన్ని వ్యక్తిగత విషాదంగా చూడలేదు. తన జీవితం ప్రజలకు ఒక రాజకీయ సందేశంగా మారాలని కోరుకున్నాడు. అదే సమయంలో వ్యక్తిగత త్యాగమే విప్లవానికి అంతిమ లక్ష్యం కాదని అతని ఆలోచన పరిణామం చెబుతుంది. ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఉద్యమం బలపడాలి. సామాజిక మార్పు కోసం ప్రజా శక్తి నిర్మాణం కావాలి.

ఆయన జయంతి సందర్భంగా భగత్‌సింగ్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదు. ముందుగా ఆయనను తిరిగి చదవాలి. చిత్రం నుంచి పుస్తకంలోకి, నినాదం నుంచి ఆలోచనలోకి, వీరగాథ నుంచి చరిత్రలోకి, చరిత్ర నుంచి వర్తమాన ప్రశ్నల్లోకి.. ఈ క్రమంలో భగత్‌సింగ్ మళ్లీ మనతో మాట్లాడటం మొదలుపెడతాడు. అదే ఆయన రచనల అసలు శక్తి. అదే ఆయనకు ఇవ్వగలిగే సార్థకమైన జయంతి నివాళి.



- మామిండ్ల రమేష్ రాజా
78932 30218

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యభద్రతకు సిఎంసి ప్రాధాన్యత




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ప్రతినిత్యం సిఎంసి పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని శుభ్రపరచడం ద్వారా సామాజిక ఆరోగ్యం, భద్రతకు ముందుకు సాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తగిన ప్రాధాన్యతను కల్పిస్తుందని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి సృజన పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవ - 2026 నువ్వు భాగంగా సీఎంసి పరిధిలోని సఫాయిమిత్ర సురక్షేమం సన్ శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు వారి కుటుంబాల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం వంటి అంశాలను జోడిస్తూ ఈ శిబిరాలను నిర్వహించడం జరిగిందని అధికారులు తెలియజేశారు. ఆయా సర్కిళ్ల పరిధిలో అంకితభావంతో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి సిఎంసి కమిషనర్ పర్యవేక్షణలో వారిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా సఫారీ మిత్రులు మరియు వారి కుటుంబ సభ్యులకు సింగిల్ విండో ఆరోగ్య పరీక్షలు, పిఎంఏవై, ఆయుష్మాన్ భారత్, పీఎం జీవన్ జ్యోతి బీమా వంటి సంక్షేమ పథకాలలో ప్రాధాన్యతను కల్పిస్తూ వారు పని చేస్తున్న సమయంలో తగిన భద్రత కోసం పిపిఈ కిట్లను పంపిణీ చేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సంబంధిత అధికారులు తగిన గౌరవంతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని, వారి సంక్షేమమే సిఎంసి ప్రధాన లక్ష్యమని కమిషనర్ మరోసారి పునరుద్ఘాటించారు.

# మట్టి మాఫియాపై ఉక్కుపాదం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సీరియస్ హెచ్చరికలు!
- రోడ్డెక్కితే టిప్పర్ల సీజ్
- చట్టపరమైన చర్యలు తప్పవు
- రెవెన్యూ, పోలీసు అధికారులపై ఆగ్రహం
- మండల జనరల్ బాడీ సమావేశంలో ఉద్రిక్తత
- కదిలిన అధికార యంత్రాంగం
- 'జనం సాక్షి' కథనంతో వెలుగులోకి అక్రమాలు

**రంగారెడ్డి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ప్రకృతి సంపదను దోచుకుంటూ, అక్రమ మట్టి దందాతో ఇబ్రహీంపట్నం ప్రాంతాన్ని శాసిస్తున్న మట్టి మాఫియా కోరలపై ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే ఉక్కుపాదం మోపారు. రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ సామాన్యుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న మట్టి టిప్పర్లపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే, ఇకపై ఏ ఒక్క వాహనం రోడ్డు మీద కనిపించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ పరిణామంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది.

**జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర నిలదీత..**

ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) వాడీవేడిగా సాగింది. సమావేశంలో ప్రధానంగా మట్టి మాఫియా అక్రమాలపైనే సభ్యులు తీవ్రంగా చర్చించారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తడంతో, ప్రజాప్రతినిధులు రెవెన్యూ, పోలీసు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, ఇష్టానుసారంగా రోడ్లను ధ్వంసం చేస్తూ, అనుమతులు లేకుండా తరలిస్తున్న మట్టి లారీలపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను నిలదీశారు.

**'జనం సాక్షి' కథనంతో కదిలిన యంత్రాంగం..**

ఇబ్రహీంపట్నంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా ఆగడాలపై ప్రముఖ దినపత్రిక 'జనం సాక్షి' ప్రచురించిన "మట్టి కొట్టి కొల్లగొట్టి" అనే శీర్షికన వచ్చిన సంచలన కథనం స్థానిక రాజకీయ వర్గాలతో పాటు అధికారుల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. మట్టి మాఫియా దందాలు, రాత్రి వేళల్లో సాగే అక్రమ రవాణా వివరాలను కళ్లకు కట్టినట్లు కథనం ప్రచురించడంతో.. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ కథనమే ఈ తక్షణ చర్యలకు ప్రధాన ప్రేరేపకంగా నిలిచింది.

**పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశాలు..**

సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. ప్రజల సంక్షేమానికి, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ మాఫియాను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మట్టి టిప్పర్లు రోడ్డు మీద



కనిపిస్తే తక్షణమే సీజ్ చేయాలని, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను స్పష్టంగా ఆదేశించారు. మాఫియా వెనుక ఎవరున్నా సహించేది లేదని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా సరే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..**

ఎమ్మెల్యే తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం, పోలీసుల దాడులపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం టిప్పర్ల దుమ్ము, ధూళి, ప్రమాదాలతో సతమతమవుతున్న తమకు ఈ నిర్ణయంతో ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు ఇకనైనా నిరంతరం నిఘా ఉంచి మట్టి మాఫియా మూలాలను పూర్తిగా ఏరివేయాలని కోరుతున్నారు.

## విద్యార్థులకు పూర్తిస్థాయి విద్య, మౌలిక వసతులు కల్పించాలి

- బిఆర్ఎస్వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు



**తాండూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** విద్యార్థులకు పూర్తిస్థాయి విద్య, మౌలిక వసతులు కల్పించాలని బిఆర్ఎస్ వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు పేర్కొన్నారు.తాండూర్ పట్టణంలోని వార్డ్ నెంబర్ 3లో ఉన్నత ఉర్దూ పాఠశాలను బుధవారం బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో సందర్శించి, విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా బిఆర్ఎస్ వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వార్డ్ పర్యటన సందర్భంగా పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నప్పటికీ, సమస్యలు పరిష్కారం అయ్యాయా లేదా అనేది అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం పాఠశాలను సందర్శించి వెళ్లిపోవడం కాకుండా, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మ్యాథ్స్, సోషల్, ఫిజిక్స్ తదితర ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుంది? వెంటనే అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతపై విద్యార్థులు సమస్యలను వెల్లడించారు. ప్రతిరోజూ గుడ్డు అందడం లేదని, భోజనంలో సరైన నాణ్యత లేదని విద్యార్థులు తెలిపారు. ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేసి, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలి.పాఠశాలలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్ సౌకర్యాలు కూడా లేవని గుర్తించాం. విద్యార్థుల ప్రాథమిక అవసరాలను కూడా తీర్చలేని పరిస్థితుల్లో పాఠశాలలో నాణ్యమైన విద్య ఎలా అందిస్తారని బిఆర్ఎస్వి ప్రశ్నిస్తోంది. అదేవిధంగా ఒకే గదిలో హెడ్‌మాస్టర్ కార్యాలయంతో పాటు బియ్యం, ఇతర సామగ్రి, పెయింట్ డబ్బాలు, కంప్యూటర్లు తదితర వస్తువులను ఉంచడంతో గది చాలా ఇరుకుగా మారిందని గుర్తించాం. విద్యార్థులు, సిబ్బందికి ఇబ్బంది కలగకుండా పాఠశాలలో తగిన గదులు, నిల్వ సౌకర్యాలు కల్పించాలి. పాఠశాలలో ఉన్న సమస్యలన్నింటినీ జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ వి నిరంతరం పోరాటం చేస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులు కల్పించే వరకు బిఆర్ఎస్ వి ప్రశ్నిస్తూనే ఉంటుంది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, బిఆర్ఎస్ వి నాయకులు వినోద్ కుమార్, కొర్ర సందీప్ నాయక్, మహేశ్వర్ రెడ్డి, అబ్దుల్ అశ్వక్, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## నిద్రిస్తున్న భర్తపై గొడ్డలితో దాడి..

- భార్య, కుమారుడి అరెస్టు
- షేర్ మార్కెట్ నష్టాల నేపథ్యంలో కుటుంబ కలహాలు




**అల్వాల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** షేర్ మార్కెట్ లావాదేవీల్లో నష్టాలు, కుటుంబ ఆర్థిక సమస్యల నేపథ్యంలో జరిగిన వివాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ ఠాణా పరిధిలో సెప్టెంబర్ 28న చోటుచేసుకుంది. నిద్రిస్తున్న సమయంలో బొడ్డు శ్రీనివాస్ (51)పై ఆయన భార్య రామాదేవి గొడ్డలితో దాడి చేసినట్లు, కుమారుడు నిఖిల్ (24) సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి కేసు వివరాలను వెల్లడించారు. మచ్చబొల్లారం పెద్ద ఫార్మా రెడ్డి కాలనీలో నివసించే శ్రీనివాస్ షేర్ మార్కెట్ లావాదేవీలు చేసేవారు. గతంలో బాలానగర్‌లో వ్యాపారం చేసిన ఆయన.. కొన్నేళ్లుగా షేర్ మార్కెట్‌లో నష్టపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కారణంగా ఇంట్లో తరచూ వివాదాలు జరిగేవని పేర్కొన్నారు. శ్రీనివాస్‌కు భార్య రామాదేవితో పాటు కుమారుడు నిఖిల్, కుమార్తె నిఖిత (22) ఉన్నారు. గతంలోనూ కుటుంబ వివాదాల నేపథ్యంలో రామాదేవి పోలీసులను, న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పెద్దల జోక్యంతో సమస్య పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న రాత్రి ఆర్థిక విషయాలపై శ్రీనివాస్, కుటుంబ సభ్యుల మధ్య మరోసారి వివాదం జరిగినట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ నిద్రించేందుకు వెళ్లారు. సెప్టెంబర్ 28న తెల్లవారుజామున శ్రీనివాస్ నిద్రిస్తున్న సమయంలో రామాదేవి, నిఖిల్ బెడ్‌రూంలోకి వెళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. రామాదేవి గొడ్డలితో శ్రీనివాస్‌పై దాడి చేయగా.. నిఖిల్ ఆయనను కదలకుండా పట్టుకునేందుకు సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 28న ఉదయం సుమారు 10.30 గంటలకు మృతుడి తండ్రి బొడ్డు కృష్ణ (78) పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అల్వాల్ పోలీసులు క్రైం నంబర్ 954/2026గా బీఎన్ఎస్ 103(1) రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా రామాదేవి, నిఖిల్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఎ. ప్రశాంత్ నేతృత్వంలోని పోలీసు బృందం సెప్టెంబర్ 30న ఇద్దరినీ అరెస్టు చేసింది. నిందితులు వెల్లడించిన సమాచారం ఆధారంగా ఘటనకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఆయుధం, రక్తపు మరకలున్న దుస్తులను సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసులో ఫోరెన్సిక్, వైద్య, సాంకేతిక, ఇతర ఆధారాల సేకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

## ఆహార భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా ఆదేశాలు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో 'ఈట్ రైట్ స్కూల్' కార్యక్ర మాన్ని సమగ్రంగా అమలు చేసి, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారపు అలవా ట్లపై అవగాహన కల్పించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా ఆదేశించారు. బుధవా రం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. గత త్రైమాసికంలో చేపట్టిన లైసెన్సింగ్, రిజిస్ట్రే షన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సర్వైలెన్స్ చర్యలతో పాటు ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, పెండింగ్, పరి ష్కరించిన కేసుల వివరాలను కలెక్టర్ సమీక్షిం చారు.నగరంలోని ఆహార విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేసి, తీవ్రమైన ఉల్లంఘనల సందర్భంలో లైసెన్సు లు సస్పెండ్ చేస్తున్నట్లు వివరించారు.గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయాన్ని గుర్తించేం దుకు డార్క్ స్టోర్లలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ, రెసిడెన్షియల్ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుప త్రుల్లో ఆహార తయారీలో పాల్గొనే సిబ్బందికి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫోస్టాక్ శిక్షణను క్రమం తప్పకుం డా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పరిశు భ్రత, పారిశుధ్యం, ముడి పదార్థాల నాణ్యత, ఆహారం రుచి, నాణ్యత, కల్తీ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం సిబ్బందికి ఫుడ్ సేఫ్టీ కిట్లు పంపిణీ చేయాలని, ప్రభుత్వ సంస్థల వంటశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని తెలిపారు.తదుపరి త్రైమా సికానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, స్వీక రించిన కేసులు, తీసుకున్న చర్యలు,




పరిష్కరించి న, పెండింగ్ కేసుల వివరాలతో నివేదిక సమర్పిం చాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మూర్తి రాజు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ దైవ నిధి, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శామ్యూ ల్ రాజు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం



**చేవెళ్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని కౌన్సిలర్ కరికె మీనాక్షీసత్యనారాయణ అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతియే ప్రభుత్వ లక్ష్యం

- కొలువుదీరిన తట్టేపల్లి పీఏసీఎస్ నూతన కార్యవర్గం
- హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**పెద్దేముల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మండల పరిధిలోని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా పిన్నెముల మహిపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతి, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు సహకార సంఘం ద్వారా అందాల్సిన సేవలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి, సర్పంచ్ నారాయణ గౌడ్,ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు, సీఈఓ రాజమౌళి, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు, మండల ప్రధాన కార్యదర్శి కే.నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు నల్ల ఎల్లారెడ్డి,సాయిని నారాయణ రెడ్డి,ఉప్పరి మల్లేశం,సాయిని శ్రీనివాస్ రెడ్డి,శోభారాణి,నసీర్,రియాజ్,లాల్ రెడ్డి,డీలర్ అంజయ్య,రాము నాయక్, వడ్ల ఆనందం,హన్మంత్, సొసైటీ సిబ్బంది జగదీష్,మల్లేష్ వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో పుట్టగొడుగుల్లా అక్రమ షెడ్లు

- ఆవాస ప్రాంతాల్లో వాణిజ్య కట్టడాలపై సర్వత్రా విమర్శలు...
- అధికారుల ఉదాసీన వైఖరి పై కట్టలు తెగుతున్న శేరిలింగంపల్లి సర్కిల్ ప్రజల ఆగ్రహం...!

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి సర్కిల్ అంటేనే అక్రమాలకు అడ్డాగా మారిన వైనం ప్రజల హృదయాలలో తీరని అసహనాన్ని మేల్కొల్పుతుంటే మరోవైపు దానిని దిద్దుకోవాల్సిన అధికారులు మాత్రం రోజుకు కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తూ అక్రమం అంటేనే తమ పరిపాలన విధానం అన్న నానుడిని నిజం చేస్తుండడం ఆలోచించాల్సిన విషయం. దశాబ్దాలుగా చోటుచేసుకుంటున్న అపవాదులు ఏ ఒక్కరోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల నుండి దూరం కాకపోగా అవి అంతకంతకు బలపడుతూ వాతావరణ పరిభాషలో తీవ్ర వాయుగుండాన్ని తలపిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.

**శేరిలింగంపల్లి సర్కిల్‌లో పుట్టగొడుగులై పుట్టుకొస్తున్న అక్రమ షెడ్లు**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఎప్పుడైనా ఒక నిజాయితీ అధికారి విధుల్లో కొనసాగుతుంటే అది ఆశ్చర్య పడాల్సిన విషయం అవుతుందేమో కానీ అవినీతి పాలనకు మాత్రం గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తూ దశాబ్దాలుగా అవినీతి మకిలీని వంట పట్టించుకోని తిరుగులేని అక్రమ సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్న వైనం ఎన్నో సందర్భాలలో రూఢీ అవుతూ శేరిలింగంపల్లి సర్కిల్లో ప్రజల హృదయాలలో అభిమానానికి ఆమడ దూరంలో నిలుస్తున్నారనేది జగమెరిగిన సత్యం. తవ్విన కొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాల పరంపరలో ఈ మధ్యకాలంలో వెలుగు చూస్తున్న మరో అంశం అక్రమ షెడ్లు. గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, రాయదుర్గం, కొండాపూర్ తదితర కీలక డివిజన్లో పరిధిలో వేల గజాల స్థలాలను స్వాధీనంలోకి తీసుకుంటున్న కొంతమంది అక్రమార్కులు మున్సిపల్ అధికారులకు అంతే స్థాయిలో ముడుపులను సమర్పించుకుని ఎలాంటి అనుమతులు లేకుండానే 500 నుండి మొదలుకొని 6 వందలు, 8 వందలు, వెయ్యి, 2000 గజాలలో భారీ అక్రమ షెడ్లను నిర్మిస్తూ దాంట్లో భారీ వాణిజ్య వ్యాపారాలను నిర్వహిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం శేరిలింగంపల్లి పరిధిలో ఇలాంటి అక్రమ భారీ షెడ్లు కనీసం 8 ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా సంబంధిత పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు పరోక్షంగా సంపూర్ణ సహకారం అందిస్తున్నారనే వాదనలు మరింత ఆందోళనను కలిగిస్తున్నాయి. ప్రధాన ప్రాంతాలలోనే ఇంత భారీ స్థాయిలో అక్రమ షెడ్ల వ్యవహారం వెలుగు చూస్తుంటే ఇతర ప్రాంతాలలో ప్రజల దృష్టికి రానివి ఇంకెంత స్థాయిలో కొనసాగుతున్నాయో ఊహించవచ్చు.

**ఆవాస ప్రాంతాలలో కమర్షియల్ షెడ్ల నిర్మాణం ఏంటి ప్రశ్నిస్తున్న స్థానికులు**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలైన గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాలలో అడ్డగోలుగా భారీ అక్రమ షెడ్ల నిర్మాణం నయా ట్రెండ్ గా మారిన ప్రస్తుత తరుణంలో అధికారుల పాత్ర పై ఆయా ప్రాంతాలలో తీవ్ర అగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. సదరు ప్రాంతాలన్నీ మంచి జనావాసాలుగా ప్రాచుర్యం పొందడంతో నివాసాల మధ్య కమర్షియల్ షెడ్లు నిర్మించడంలోని ఆంతర్యం



ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆవాస ప్రాంతాలను కేవలం ప్రజా జీవన విధానానికి, డైలీ లైఫ్ కి ఇబ్బంది కలగని రీతిలో ఏవైనా నిర్మాణాలు, కార్యక్రమాలను చేపడితే తమకు అభ్యంతరం లేదని, కానీ ఇలా వేల గజాలలో అక్రమ షెడ్ల రూపంలో భారీ నిర్మాణాలను చేపట్టడం ఎంతవరకు సమంజసం అని నిలదీస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణాల వ్యవహార శైలి ఒకరకంగా ఉంటే... వాటిని నిరోధించాల్సిన అధికారుల తీరుతెన్నులు మరింత వివాదాస్పదంగా గోచరిస్తుండడంపట్ల స్థానికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వాణిజ్య నిర్మాణాలవల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఒరగడం లేదని, అయితే గియితే కేవలం మున్సిపల్ అధికారులకు వొనగూరే ప్రయోజనం మాత్రమే కనిపిస్తుందని పలువురు సామాజికవేత్తలు విమర్శిస్తున్నారు. ఎవరు ఎంత మొత్తుకున్నా... తాము అవినీతి అగ్నికి ఆజ్యం పోస్తూనే ఉంటామన్న తీరుగా ఉంటున్న అధికారుల తీరు మారాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా నియోజకవర్గం పరిధిలోని అక్రమ షెడ్లను పూర్తిగా తొలగించాల్సిన అవసరాన్ని శేరిలింగంపల్లి వాసులు ముక్తకంఠంతో ఎత్తిచూపుతున్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే రీ సర్వే లక్ష్యం

- అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థల పరిశీలన
- పాఠశాలను సందర్శించినజిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**బిజినేపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** మండలంపరిధిలోని ఖానాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి రీ సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, భూముల హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల స్పష్టత తదితర అంశాలపై రైతులతో కలెక్టర్ చర్చించారు. సర్వే ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా, రైతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రైతులు తమ భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉందని, భూముల రీ సర్వే ప్రక్రియపై సానుకూలంగా స్పందించారు. ఖానాపూర్ గ్రామ పరిధిలో మొత్తం 2,525 ఎకరాల 15 గుంటల భూములను రీ సర్వే ప్రక్రియలోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భూముల హద్దులను గుర్తించి నమోదు చేయడం మ్యాపులను ఆన్లైన్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. భూముల హద్దులు స్పష్టంగా ఉండటం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు, హద్దుల విషయంలో తలెత్తే సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. భూ రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఏమైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఖానాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, తరగతుల వారీగా ఉన్న వివరాలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 124 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు అవసరమని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ ఇందిరా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, సంబంధిత అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## త్వరలో కేటీదొడ్డి యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభం




**కేటీదొడ్డి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యంతో ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ధరూర్ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఆయన.. త్వరలో కేటీదొడ్డి మండలంలో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హుసేనప్ప, రాజశేఖర్, డీఆర్ విజయ్, శ్రీనివాస్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధునాతన వసతులు, డిజిటల్ తరగతి గదులతో ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.కాలేజీలో కొత్తగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు కళాశాల యాజమాన్యం పూర్తి సహకారం అందించాలని కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని వినతి




**బిజినేపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల గాంధీ పార్క్ పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించి, మద్యం సేవించడం, గుట్కా/పాన్ పరాగ్ వినియోగం ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలనినేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు మంగి ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కథలప్పకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మంగి ఆంజనేయులు మాట్లాడుతూ. మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ పార్క్ , దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందని, కుక్కలు,పందులు ప్రైవేటు వాహనాలు అదేవిధంగా కొంతమంది అక్కడ గంజాయి,మద్యం సేవించడం, గుట్కా, పాన్ పరాగ్ వంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించడం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని దీని వలన పార్క్‌కు వచ్చే ప్రజలు, మహిళలు, పిల్లలు మరియు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయ పరిసరాల్లో ఇటువంటి పరిస్థితులు ఉండటం వల్ల ప్రజలకు అసౌకర్యంతో పాటు పారిశుధ్య సమస్యలు కూడా ఏర్పడుతున్నాయన్నారు.మండల అభివృద్ధి అధికారి చర్యలు తీసుకుని చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి పార్క్ పరిసరాలను క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ బోనాసిరాజు, రాజేష్, భాస్కర్, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# చెంచుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తాం

- 15 రోజుల్లో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి
- స్పందించకుంటే 2 లక్షల మందితో రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్

**అచ్చంపేట, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** నల్లమల చెంచులతో పాటు రాష్ట్రంలోని ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం 15 రోజుల్లో పరిష్కరించాలని, లేనిపక్షంలో రెండు లక్షల మందితో ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని రాష్ట్ర ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. మన్ననూరు ఐటీడీఏను చెంచుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసినప్పటికీ, అవసరమైన సిబ్బంది, అధికారులను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో బుధవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో చెంచులు, తొమ్మిది ఆదివాసీ తెగల ప్రతినిధులు, ఆదివాసీ హక్కుల సంఘాల నాయకులు భారీ ఆందోళన నిర్వహించారు. మన్ననూరులోని వివేకానంద విగ్రహం నుంచి విల్లంబులతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఐటీడీఏ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించి, కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ అధికారి జాఫర్‌కు అందజేశారు. డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐదో షెడ్యూల్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీలకు కనీస మౌలిక వసతులు, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రశ్నించే హక్కును అణచివేయవద్దని, హక్కుల కోసం ప్రశ్నించే ఆదివాసీలను అధికారులు వేధిస్తే న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

జీవో 60 ప్రకారం మన్ననూరు ఐటీడీఏ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెంచుల కోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జీవో నంబర్ 60 ప్రకారం మన్ననూరు ఐటీడీఏను ఏర్పాటు చేశారని డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. అయితే ఐటీడీఏకు అవసరమైన సిబ్బంది, అధికారులను పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో చెంచులకు ప్రయోజనాలు అందడం లేదని ఆరోపించారు.

నల్లమలలోని మారుమూల ప్రాంతాల్లో చెంచులు తీవ్ర వైద్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈర్లపెంట వంటి ప్రాంతాల్లో అనారోగ్యానికి గురైన వారు వైద్యం కోసం సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని మన్ననూరుకు రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. మారుమూల గూడేల్లో వైద్యం, విద్య, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.

### అటవీశాఖ తీరుపై ఆగ్రహం

నల్లమలలో అటవీశాఖ వ్యవహరిస్తున్న తీరును ఐటీడీఏ, ప్రభుత్వం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ హక్కులు, రాజ్యాంగ హక్కులను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే లక్షలాది మందితో నల్లమలను ముట్టడిస్తామని హెచ్చరించారు.




ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ నల్లమల ఆదివాసీలను తరలించే ప్రయత్నాలను నిలిపివేయాలని, వంట చెరకు వంటి కనీస అవసరాల కోసం అడవికి వెళ్లిన వారిపై కేసులు నమోదు చేస్తున్న అటవీశాఖ తీరును నియంత్రించాలని కోరారు. ఐటీడీఏలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచ్ మల్లికార్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది ఆదివాసీ తెగలు ఏకమై తమ హక్కుల కోసం పోరాడుతున్నాయని తెలిపారు. పీసా చట్టాన్ని అమలు చేసి ఆదివాసీలకు స్వయం ప్రతిపత్తి పాలన కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేక చాలామంది ఆదివాసీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. ఆదివాసీల భూములకు సంబంధించిన పట్టాలను వారి పేర్లపై ఇవ్వాలని కోరారు.

చెంచుల అభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమలలోని వివిధ చెంచు గూడేలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీలతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- నాగిరెడ్డిగూడెంలో పోషణ మాసం కార్యక్రమం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం "మన అంగన్వాడీ - మన బాధ్యత" అనే థీమ్‌తో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం, దాని ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి, ఒక పూట భోజనం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గడ్డం లావణ్య గోవర్ధన్‌రెడ్డి సూచించారు. అంగన్వాడీ టీచర్ అనిత, సహాయకురాలు స్వప్న కూరగాయలు, ఆకుకూరలతో బతుకమ్మను తయారు చేసి ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రయోజనాలను వివరించారు. చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు వంటి సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం విఠల్‌రెడ్డి, గ్రామ పెద్ద గడ్డం జంగారెడ్డి, వార్డు సభ్యులు జి. లక్ష్మి, జి. జ్యోతి, బి. మల్లేష్, కె. రాజు, వి. మంజుల, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, ప్రీ-స్కూల్ చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే ధ్యేయం




**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, ఆత్మగౌరవం మరియు వారి హక్కులపై సమాజంలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం (అక్టోబర్ 1) పురస్కరించుకుని ఈరోజు భారీ వాకథాన్ (ర్యాలీ) నిర్వహించారు. స్థానిక స్టేడియం గ్రౌండ్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుండి ప్రారంభమైన ఈ వాకథాన్ బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. అక్కడ "వృద్ధులు సమాజ హితకులు, వారిని గౌరవించాలి" అని ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల పాత్ర అపారమైనదని, వారి అనుభవం రాబోయే తరాలకు మార్గదర్శకమని అన్నారు. వయోవృద్ధులకు సమాజంలో తగిన గౌరవం, భద్రత, మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను, చట్టపరమైన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు ఎ.రాజసింహుడు, కార్యదర్శి నాగభూషణం, కోటేశ్వర రెడ్డి, టి.బుచ్చన్న, నాగేంద్ర స్వామీ, బాలయ్య, జిల్లా శాఖల అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యువకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## మత సామరస్యానికి ప్రతీక ఉర్స్-ఎ-ఇర్ఫానీ ఉత్సవాలు

- భక్తుల కోరికలు తీర్చే ఉర్స్-ఎ-ఇర్ఫానీ దర్గా
- కుల, మతాలకు అతీతంగా ఉత్సవాలు
- నేటి నుండి సంగారెడ్డిలో ఉత్సవాలు ప్రారంభం
- హాజరుకానున్న ప్రముఖులు..



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** సంగారెడ్డి లోని చావుష్ బాగ్ లోని ఉర్స్-ఎ-ఇర్ఫానీ దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. సంగారెడ్డి పట్టణ చావుష్ బాగ్ లోని ఉర్స్-ఎ-ఇర్ఫానీ దర్గాలో భక్తుల సందడి రోజురోజుకు పెరుగుతున్నది. ఈ దర్గా ముస్లింలకే కాకుండా అన్ని మతాల వారికి ఆరాధ్య దైవంగా నిలుస్తోంది. ఫలితంగా ప్రతి ఒక్కరూ దర్గా ముందు నుంచి వెళితే చాలు చేతులెత్తి దర్గాను మొక్కి వెళ్లటం ఆనవాయితీగా మారింది.

### 24వ ఉర్స్-ఎ-ఇర్ఫానీ వేడుకలు

అక్టోబర్ 1, 2 తేదీల్లో సంగారెడ్డిలో ఉర్స్-ఎ-ఇర్ఫానీ ఖాన్ఖా-ఎ-ఇర్ఫానీ ఆధ్వర్యంలో 24వ ఉర్స్-ఎ-ఇర్ఫానీ వేడుకలను సంగారెడ్డిలో నిర్వహించనున్నారు. సంగారెడ్డికి చెందిన పీర్-ఎ-తరీకత్ షేక్-ఉల్-ఇర్ఫాన్ షాహిన్‌షా-ఎ-హిక్మత్ హజ్రత్ మౌలానా అల్హాజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఒమర్ అలియాస్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షా బందా నవాజీ చిష్తీ సాహెబ్ ఆర్.ఎ. ఉర్స్ సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ హబీబ్ ఫైజ్ అల్ షా ఇర్ఫానీ బందనవాజీ (సజ్జాదా నషీన్) పర్యవేక్షణలో వేడుకలు జరగనున్నాయి. కార్యక్రమాలకు జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు, అధికారులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి
- సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాల తనిఖీ
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలనీ ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డితో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఆస్తులను కోర్టులో సమర్పించే వరకు భద్రంగా ఉంచాలని సూచించారు.



ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు, స్టేషన్ రికార్డుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సీసీటీఎన్ఎస్ 2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సీఈఐఆర్ తదితర సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. అనుమానితులు, హిస్టరీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, గ్రామ పోలీస్ అధికారులు గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కలిగి శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం కంగ్టీ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులు, మిస్సింగ్, నాన్ బెయిలబుల్ వారెంట్ కేసుల వివరాలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, సాగుపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాబాలు, పెట్రోల్ బంకులతో పాటు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టీ సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, రికార్డుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్న ఎస్పీ, అధికారులు, సిబ్బందిని అభినందించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

# గిరిజన సమస్యలను పరిష్కరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు వినతి
- దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జైటోత్ హుస్సేన్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలసిన దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్ జిల్లా వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం రవి నాయక్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు అదనపు సౌకర్యాలు కల్పించడంతో పాటు కేంద్ర నిధులు కేటాయించి పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు.అలాగే గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను ప్రతి తండాలో ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో గిరిజన భవనాలు నిర్మించాలని, గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను కోరినట్లు రవి నాయక్ తెలిపారు.

# గిన్నీస్ బుక్ రికార్డు విజేతలుగా మాస్టర్ బాలు కుమార్, రమేష్



**పాలకుర్తి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ఇటీవల హైద్రాబాద్‌లో కరాటే విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ. ఇంటర్నేషనల్ థైకాండో ఆకాడమీ ఆద్వర్యంలో ప్రపంచ గిన్నీస్ బుక్ రికార్డును నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు వివిధ దేశాల నుండి దాదాపు 2 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెడ్ స్టార్ కుంగ్ ఫూ, సుమాన్ షోటోకాన్ అకాడమీ బ్లాక్ బెల్ట్ క్రీడాకారులు గ్రాండ్ మాస్టర్ వెంకట్ బాబు, సుమాన్ షాటో ఖాన్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ జిల్లాల శ్రీనివాస్, సినీ హీరో సుమాన్ ఆధ్వర్యంలో కరాటేను నేర్చుకున్న జనగామ జిల్లా పాలకుర్తి నియోజక వర్గానికి చెందిన బానోత్ బాలు కుమార్, రమేష్‌లు పటాస్ విభాగంలో పాల్గొని ప్రపంచ గిన్నేష్ బుక్ రికార్డును సాధించి విజేతలుగా నిలిచారు. గిన్నీస్ బుక్ రికార్డు సాధించిన కరాటే క్రీడాకారులు బాలు నాయక్ రమేష్‌లను స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గిరిజన తండాలో జన్మించిన బాలు నాయక్ రమేష్ లు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో పాల్గొని పాలకుర్తి నియోజకవర్గ పేరు ప్రఖ్యాతలు తెచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, ఎండి మదర్, బక్క పుల్లయ్య, ఏలూరి యాకన్న, మారజోడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- బాల్ వివాహ్ ముక్త్ భారత్' పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా



**మావల, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో 'బాల్య వివాహ రహిత గ్రామం' అంశాన్ని ఎజెండాలో చేర్చాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన నిబంధనలు, బాల్య వివాహాల నివారణలో గ్రామ పంచాయతీలు, ప్రజలు, సమాజం పాత్రపై గ్రామసభల్లో విస్తృతంగా చర్చించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, నీతి ఆయోగ్ చైల్డ్ రైట్స్ అసోసియేట్ దేవిశ్రీ, ఐసీపీఎస్ అసిస్టెంట్ కమ్ డీఈవో ప్రేమ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టైగర్ జోన్ రద్దు చేయాలి

- జన్నారంలో ప్రశాంతంగా ముగిసిన బంద్



**జన్నారం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, అలాగే ఎకో సెన్సిటివ్ జోన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు జన్నారం మండల కేంద్రంలో బంద్ విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా సామాజిక పోరాట సమితి మండల కన్వీనర్ శ్రీరాముల భూమాచారి నాయకత్వంలో స్థానిక వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. బంద్ ప్రభావంతో మండల కేంద్రంలోని కిరాణా షాపులు, జనరల్ స్టోర్స్, ఆటోమొబైల్ దుకాణాలు, పాన్ షాపులు, ఇతర వాణిజ్య సముదాయాలన్నీ మూతపడ్డాయి. టైగర్ జోన్ వల్ల స్థానిక ప్రజలు, రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 30, (జనంసాక్షి) :** సాధారణంగా సాగుచేసే వరి, పత్తి, మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమార్, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్ ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్లు ఆర్ సత్యయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డితో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి, పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవసాయం, మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమంగా వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సమర్థంగా కొనసాగించడానికి సెప్టెంబర్ 30వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డీఎస్పీ,ఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. రానున్న పండుగల నేపథ్యంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కొలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వేలేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**వేలేరు సెప్టెంబర్ 30(జనం సాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం రోజున హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపి సేవలకు సంబంధించిన రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు, ఎంతమంది విధులకు హాజరయ్యారని అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్ లో నమోదు చేసిన అటెండెన్స్ ని కలెక్టర్ పరిశీలించారు. మీ ప్రమాణం యాప్ లో ఏయే వివరాలు నమోదు చేస్తున్నారని అడిగారు. లాబొరేటరీ రూమును పరిశీలించి ఏ ఏ పరీక్షలు చేస్తున్నారని వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ కలెక్టర్ సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న పేషంట్లతో వైద్య సేవలు గురించి ఆరా తీశారు. వారి ఆరోగ్య సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేఘన, తహసిల్దార్ కోమి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. మల్లికుదుర్ల గ్రామంలో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంతమంది రైతుల భూములను రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉందనే వివరాలను సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతంలో ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు.

వేలేరులోని రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ గురుకుల పాఠశాలలో పరిశుభ్రత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. వేలేరు మండల కేంద్రం లోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి ఈరోజు ఎం బ్రేక్ ఫాస్ట్ ఇచ్చారు.. వంటలు ఎలా ఉంటున్నాయి, టీచర్లు అందరూ వస్తున్నారా అని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో, కళాశాలలోని తరగతి గదులు, డార్మేట్రీ వసతులను కలెక్టర్ పరిశీలించారు. అన్నీ గదుల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఫ్యాన్ లు ఉన్నాయా అని ఆరా తీశారు. దోమలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు డార్మేట్రి, టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తున్నారా, టైం టేబుల్ ప్రకారం అన్నీ తరగతులు జరుగుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. వంట గదిని సందర్శించి వంట పదార్థాలు ఎలా ఉన్నాయని తనిఖీ చేశారు.

# రెండు పంటలకు సాగు నీరు అందించడమే లక్ష్యం

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- లిఫ్ట్-1 పనులు 70శాతం పూర్తి అయ్యాయి
- పంప్ హౌస్ నిర్మాణ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలి



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 30 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి గండి రామా రం లిఫ్ట్-1 అత్యంత ప్రాముఖ్యమైనదని ఎట్టి పరి స్థితుల్లో జనవరి లో ప్రారంభించి రెండో పంటకు సాగు నీరు అందించాలని అధికారులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామ శివారులోని గండి రామారం ఎత్తిపోతల పథకం లిఫ్ట్ -1 పంప్ హౌస్ నిర్మాణ పనులను నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎత్తయిన ప్రాంతాలైన వేలేరు, చిల్పూర్ మండలాలకు సాగు నీరు అందించాలని 104 కోట్లతో గండి రామారం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఎత్తిపోత ల పథకంలో 3లిఫ్ట్ లు ఉన్నాయని,అందులో గత పాలకులు లిఫ్ట్ -2 పనులను మాత్రం పూర్తి చేసు కొని స్వంత భూములకు నీళ్లు తెచ్చుకున్నారని విమర్శించారు. చిల్పూర్, వేలేరు రెండు మండలా ల రైతులకు ఉపయోగపడే లిఫ్ట్-1,3లను మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నత్తనడకన నడుస్తున్న లిఫ్ట్ -1పనులను అధికారులు, కాంట్రాక్టర్లు వెంట పడి పనులు చేయిస్తున్నానని అన్నారు. లిఫ్ట్ - 1 పను లు ఇప్పటికి 70శాతం పూర్తి అయ్యాయని, మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసి రెండో పంటకు రైతులకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్న ట్లు వెల్లడించారు. పంప్ హౌస్ వద్ద ఏ పనులు ఎవరు చేయాలో, పంపు హౌస్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తారో లేదో అనే విషయాలు అధికారు లకే స్పష్టత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పనుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులలో పంపు హౌస్ నిర్మాణాన్ని పూర్తిచేస్తారో స్పష్టంగా చెప్పాల ని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ సిఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, ఈఈ ప్రవీణ్, చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి,చిల్పూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిర్ర నాగరాజు, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు,పోలేపల్లి రంజిత్ రెడ్డి,మల్లా రెడ్డి, గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్, సర్పంచ్‌లు డి. రవిందర్, రూప్లా నాయక్,రంగు రమేష్, ఎన్న కూస కుమార్, సంజీవ,జక్కుల రాజయ్య, వెంకటేష్,మూడు మండలాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుకు గురైన ధర్మ తండా గ్రామ సర్పంచ్

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 30 ( జనం సాక్షి):** గ్రామ సర్పంచ్ పాముకాటుకు గురైన సంఘటన మండలంలోని ధర్మ తండా గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.... ధర్మ తండా గ్రామ సర్పంచ్ బోడ రవి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అతన్ని పాము కాటు వేసింది. వెంటనే గమనించిన అతను వ్యవసాయ పొలం వద్ద నుండి గ్రామంలోకి వచ్చి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి ఎలాంటి ప్రమాదం లేదని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మోగిలి వెంకట్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న సర్పంచ్ బోడ రవిని పరామర్శించి అతని ఆరోగ్య యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన యశ్వంత్ యాదవ్



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** సౌత్ జోన్ జూనియర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యు యశ్వంత్ యాదవ్ బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించి 4X100 మీటర్ల రిలే పరుగు పందెంలో ఈ ఘనత సాధించినట్లు తెలియజేశారు. ఈ పోటీలు పాండిచ్చేరి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాండిచ్చేరిలో ఈనెల 16 నుంచి 18 వరకు ఈ పోటీలు జరిగాయని తెలిపారు. యశ్వంత్ ప్రస్తుతం కళాశాలలో బిఎ ప్రథమ సంవత్సరం చదువుచున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన యు యశ్వంత్ యాదవ్ ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తో పాటు కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ వినయ్ కుమార్ చైర్మన్ ప్రొఫెసర్ భాగ్య నారాయణ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. ప్రభాకర్, గేమ్స్ కమిటీ సభ్యులు ఎన్వీ రమణారెడ్డి, డాక్టర్ ఎ రాఘవేందర్, డాక్టర్ కే సుధాకర్, వి మధుకర్ రావు, ఎం పావని అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## స్వర్ణ చెరువులో పడి మహిళ మృతి

**సారంగాపూర్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** సారంగాపూర్ మండలం కౌట్ల బి గ్రామానికి చెందిన దేవి చిన్నమ్మ (70) ఎస్సీ కులానికి చెందిన వారుగా గుర్తించారు. మనస్తాపం చెంది స్వర్ణ చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

## రిమ్స్ ఎస్ఎన్‌సియూ ఘటన అనంతరం శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

- డిశ్చార్జ్ అయిన శిశువులకు ప్రత్యేక ఫాలోఅప్
- రిమ్స్‌లో 34 పడకల ఎంఎన్‌సియూ సేవలు అందుబాటులోకి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన ఎస్.ఎన్.సి.యూ ఘటన అనంతరం ప్రభావితమైన శిశువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఘటన అనంతరం మొత్తం 27 మంది శిశువులను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి రిమ్స్‌తో పాటు హైదరాబాద్‌లోని వివిధ ఆసుపత్రులకు మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు తెలిపారు. వీరిలో 5 మంది శిశువులు మృతి చెందగా, 13 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 8 మంది శిశువులు హైదరాబాద్‌లోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో ఒక శిశువు రిమ్స్, ఆదిలాబాద్‌లో చికిత్స పొందుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న శిశువుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వారికి అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. సంబంధిత ఆసుపత్రులతో నిరంతరం సమన్వయం చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. డిశ్చార్జ్ అయిన 13 మంది శిశువుల్లో 7 మంది మహారాష్ట్ర, 6 మంది ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారని అని కలెక్టర్ తెలిపారు.మహారాష్ట్రకు చెందిన శిశువుల వివరాలను నాందేడ్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు అందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితిపై నిరంతర ఫాలోఅప్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 6 మంది శిశువుల ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యాధికారులు, ఆశా, ఏఎన్ఎం సిబ్బంది ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. డిశ్చార్జ్ అనంతరం శిశువులకు అవసరమైన వైద్య సలహాలు, చికిత్స, ఫాలోఅప్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నవజాత శిశువులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్ ఆదిలాబాద్‌లో 34 పడకల మదర్ అండ్ న్యూబార్న్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ను ఏర్పాటు చేసి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఎం.ఎన్.ఐ.సి.యూ లో 11 ఆక్సిజన్ సౌకర్యం కలిగిన పడకలు, 7 ఆక్సిజన్ సౌకర్యం లేని పడకలు అందుబాటులో ఉన్నా యని తెలిపారు. అదనంగా స్టెప్‌డౌన్ యూనిట్‌లో 12 ఆక్సిజన్ సౌకర్యం కలిగిన పడకలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం ఎంఎన్ఐసియూలో 18, స్టెప్‌డౌన్ యూనిట్‌లో 12 కలిపి మొత్తం 30 పడకల సామర్థ్యం అందుబాటులో ఉందని, తదుపరి దశలో మరో 4 పడకలను ఏర్పాటు చేయడంతో మొత్తం సామర్థ్యం 34 పడకలకు పెరగనుందని తెలిపారు. ఎం.ఎన్.ఐ.సి.యూతో పాటు స్టెప్‌డౌన్ యూనిట్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అవసరమైన నవజాత శిశువులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించేందుకు మరింత అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఎన్‌సియూ ఘటనకు సంబంధించి ప్రభావితమైన ప్రతి శిశువు ఆరోగ్య పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందుతున్న శిశువులకు అవసరమైన వైద్య సేవలు అందేలా సంబంధిత ఆసుపత్రులతో సమన్వయం చేస్తున్నామని, డిశ్చార్జ్ అయిన శిశువులకు నిరంతర వైద్య ఫాలోఅప్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శిశువుల కుటుంబాలకు అవసరమైన వైద్య సహాయం, ఫాలోఅప్ సేవలు, ఇతర సహాయ సహకారాలను అందిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి ) :** జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితిక పంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, రహదారులపై పశువుల సంచారం లేకుండా పశువుల యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధాన రహదారులు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో పశువులు, కుక్కలు వాహనాలకు అడ్డం రావడంతో ప్రమాదాలు పోటు చేసుకుంటున్నాయని, ఈ అంశంపై దృష్టి సారించాలని తెలిపారు. రహదారులు భవనాలు, పంచాయితీ రాజు రహదారులపై గుంతల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని, కళాశాలలు, పాఠశాలలలో రహదారి నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు, వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా, ప్రతి వాహనదారుడు హెల్మెట్/ సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపకుండా తనిఖీలు చేపట్టాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించే విధంగా అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, రహదారి ప్రమాదాలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ డి ఎస్ పి లు అశోక్, వహీదుద్దీన్, జిల్లా పంచాయితీ అధికారి భిక్షపతి, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ ఈ.ఈ. ధర్మేందర్, జిల్లా రవాణా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లితో పర్యాటక అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** చేనేత కళ, స్థానిక సంస్కృతి, ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేసేలా 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమాన్ని రూపొందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం పోచంపల్లి టూరిజం పార్క్‌ను సందర్శించిన ఆయన టూరిజం గైడ్స్, చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. ఇక్కత్ వస్త్రాల తయారీ, చేనేత కార్మికుల నైపుణ్యం, స్థానిక ఆహారం, సంస్కృతి, జీవన విధానం, ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేయాలని సూచించారు. స్థానిక యువతకు ఉపాధి, చేనేత ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం చేనేత కార్మికుల కోసం నిర్వహించిన ఆరోగ్య శిబిరాల్లో కంటి సమస్యలు గుర్తించిన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మనోహర్, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ, చేనేత, జౌళి శాఖ సిబ్బంది, టూరిజం గైడ్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఉప్పలచిలుక యుపిఎస్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- వాంతులతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు



**పెనుబల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లాపెనుబల్లి మండలం ఉప్పల చిలుక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన సంఘటన బుధవారం జరిగింది. మధ్యాహ్నం భోజనం తరువాత వాంతులు అవడంతో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొమ్మకంటి నవీన్, ఏనుముల మనోజ్ కుమార్, చెక్కిలాల చెన్నకేశవ, ఓరుగంటి నవీన్, ఏనుముల శ్రవంతిక, బొమ్మకంటి ఉదయశ్రీ లు అస్వస్థత కు గురవ్వగా పాఠశాల సిబ్బంది విద్యార్థులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లంకాసాగర్ పి హెచ్ సి వైద్యులు డాక్టర్ కిరణ్, సిబ్బంది బాణోత్ నాగేశ్వరావులు చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యసిబ్బంది తెలిపారు.

## కోదాడ ఆర్టీసీ బస్సులో భారీ బంగారం చోరీ

- సొత్తు 15 తులాలు, 25 లక్షల విలువ గల బంగారం



**కోదాడ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** సూర్యాపేట జిల్లా కోదాడలో ఆర్టీసీ బస్సులో భారీ చోరీ జరిగింది. బుధవారం ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని గుర్తు తెలియని దొంగలు 15 తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం బంగారం విలువ రూ. 25 లక్షలు ఉంటుందని తెలిపారు. హుజూర్‌నగర్‌కు చెందిన తోలునూరి పద్మావతి, సూర్యప్రకాష్ దంపతులు కోదాడ నుండి హుజూర్‌నగర్ వెళ్లడానికి కోదాడ రంగా థియేటర్ వద్ద మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. దీనిని గమనించిన దొంగలు అత్యంత చాకచక్యంగా ఎవరికీ అనుమానం రాకుండా దంపతుల వద్ద ఉన్న బ్యాగును టార్గెట్ చేసి, అందులోని 15 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## రోడ్ల మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వలన డ్యామేజ్ అయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డితో కలిసి 14వ వార్డు వినాయక నగర్, కృష్ణ నగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో రోడ్లను తనిఖీ చేశారు. వినాయక నగర్ మెయిన్ రోడ్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వలన డ్యామేజ్ అయిన రోడ్లను పరిశీలించి నాణ్యతతో త్వరితగతిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కృష్ణానగర్ కాలనీ పార్కును సందర్శించి పార్కు అభివృద్ధి గురించి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఈఈ తో చర్చించారు. వార్డులో ఉన్న ఓపెన్ ప్లాట్లలో చెత్త పేరుకుపోయినందువలన వెంటనే అక్కడ చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. వర్షాకాలం దోమలు వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువలన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల మీద నీళ్లు నిలువ ఉండకుండా చూడాలని, డ్రైనేజీ కాలువలలో పేరుకుపోయిన చెత్తను క్లీన్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కిరణ్ కుమార్, పబ్లిక్ హెల్త్, డిఈ రమాదేవి, ఎస్సీ వెంకటేశ్వర్లు, ఏఈ అనిల్, వార్డ్ కౌన్సిలర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి చాటాలి

- క్రీడాకారుల ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అండగా ఉంటా
- ప్రముఖ సంఘ సేవకులు గంజి శ్రీనివాస్ పతక విజేతలను ఘనంగా సన్మానం



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను బుధవారం ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త గంజి శ్రీనివాస్ గుప్తా కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మెదక్ జిల్లాకు చెందిన విద్యార్థులు క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మెదక్ ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయితో పాటు ప్రపంచస్థాయికి చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలరని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ప్రతిభావంతుడైన విద్యార్థి క్రీడలకు దూరం కాకూడదని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన మేరకు ఆర్థిక సహాయం, ఇతర సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు కష్టపడి సాధన చేసి మెదక్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. మెదక్ జిల్లాలో క్రీడా ప్రతిభకు కొదవ లేదని, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వస్తున్నారని గంజి శ్రీనివాస్ అన్నారు. వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవసరమైన సహకారం లభిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటే అవకాశం ఉందన్నారు. మెదక్ విద్యార్థులు పతకాలు సాధించడం గర్వకారణమని ఈ విజయాలు ఇక్కడితో ఆగకూడదన్నారు. రాష్ట్రం, దేశం దాటి ప్రపంచస్థాయిలో మెదక్ పేరు మార్మోగేలా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ఐదు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి కళాశాల కీర్తిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింపజేశారన్నారు.

### విజేతలను అభినందించిన కళాశాల అధ్యాపక బృందం

విజేత లను కళాశాల ఆవరణలో కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధించడం అభినందనీయమని అధ్యాపకులు పేర్కొంటున్నారు. విద్యార్థుల విజయాలకు అధ్యాపకులు, క్రీడా విభాగం అందిస్తున్న ప్రోత్సాహం ఎంతోదోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్ గౌడ్, గేమ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ హరిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని పతక విజేతలను అభినందించారు.

## జర్నలిస్టు హిల్ కాలనీలో మౌలిక వసతులపై అధికారుల పరిశీలన

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించింది. అప్పటి హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మల్కాజిగిరి, అల్వాల్, జవహర్‌నగర్, శామీర్ పేట్ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులతో పాటు శామీర్‌పేట్‌లోని నిరుపేదలకు కూడా స్థల పట్టాలు అందజేశారు. శామీర్‌పేట్‌లో కేటాయించిన జర్నలిస్టుల స్థలాలు దాదాపు 18 ఏళ్లుగా ఎలాంటి మౌలిక వసతుల అభివృద్ధికి నోచుకోక నిర్మానుష్యంగానే ఉండిపోయాయి. 2019లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



హనుమంతరావు అందించిన ఆర్థిక సహకారంతో గుట్టలు, బండరాళ్లతో ఉన్న ప్రాంతాన్ని చదును చేసి నివాస యోగ్యంగా మార్చుకునేందుకు జర్నలిస్టులు స్వయంగా కృషి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు హిల్ కాలనీకి మౌలిక వసతులు కల్పించేందుకు కదలిక మొదలైంది. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ సభ్యులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**ఖమ్మం టౌన్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదై న పోక్సో కేసులో. నిందితుడికి గౌరవ న్యాయస్థానం 3సంవత్సరాల జైలు శిక్ష తో. పాటు రూ.5000 జరిమానా విధించింది ప్రేమపేరుతో.మైనర్ యువతిని వేధించిన ఖమ్మం నగరానికి చెందిన చేకూరి శ్రీకాంత్ 20సం పై ఖమ్మం వన్ టౌన్ పోలిస్టేషన్మొదటి అదనపు క్రైమ్.నెంబర్82/2023.ఎ నెంబర్ 33/2023లో అజూఎ సెక్షన్లు 354(ఊ)354(ణ) మరియు పోక్సో చట్టం8.కింద.నమోదైన కేసును విచారించ న మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్. కోర్టు ఖమ్మం గౌరవ న్యాయమూర్తి డా. పుల్లా భట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడికి 3సం జైలు శిక్ష 5000రూపాయల. జరిమానా విధించారు కేసు దర్యాప్తు ను ఖమ్మం వన్ టౌన్ ఎస్ ఐ ఎస్ శ్రీకాంత్ నిర్వహించారు కేసు దర్యాప్తు లో సమర్థవంతంగా పని చేసిన సిబ్బంది నీ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## తుమ్మల చెరువు ఆయకట్టుకు గోదావరి జలాలు

**అశ్వాపురం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మొరెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు తరలించి, పంట పొలాలకు సాగునీటిని అందించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని తుమ్మల చెరువు తూముల లాకులను స్వయంగా తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. మొరెళ్లపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువులోకి ఎత్తిపోసిన అనంతరం, చెరువు నుంచి తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు చేరేలా నీటి విడుదలను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులకు సాగునీరు అందించడంలో భాగంగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. మొరెళ్లపాడు లిఫ్ట్



ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు అందుబాటులోకి తీసుకురావడంతో పంటల సాగుకు నీటి భరోసా ఏర్పడుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. సాగునీటి విడుదలతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, రెవిన్యూ, శాఖ అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో తండ్రిపై దాడి చేసిన కుమారులు, భార్య

**చేర్యాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** కుటుంబ కలహాల కారణంగా తండ్రిపై ఇద్దరు కుమారులు దాడి చేసిన ఘటన చేర్యాల పట్టణంలో చోటుచేసుకుంది. చేర్యాల పట్టణ వడ్డెర కులానికి చెందిన బోదాసు రవి (40) భార్యను తరచూ తాగి వచ్చి తిట్టడం, గతంలో ఒకసారి వేరేవారితో మాట్లాడిన దాని గురుంచి గొడవలు పడుతూ తల్లి బాధపడి ఏడవడం భరించలేక మంగళవారం రాత్రి అతని కుమారులు, భార్య కలిసి గొడ్డలితో దాడి చేయడంతో భుజం, మోకాలిపై తీవ్ర గాయాలు అయ్యాయి. రవి తండ్రి మల్లయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అపూర్వ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలలో తెలిపారు.

# అట్టహాసంగా 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

- పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు..
- జిల్లా జట్టుకు ఎంపిక

**మోటకొండూరు, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మోటకొండూరు మండలం మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్, ఎంపిక పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ క్రీడా సంబురాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చిన బాలబాలికల జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. క్రీడాకారుల పోరాటపటిమ, వేగం, వ్యూహరచన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సెలెక్షన్స్‌లో క్రీడాకారుల ప్రతిభ, ఫిట్‌నెస్, నైపుణ్యం, క్రమశిక్షణ, జట్టు సమన్వయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరంతా తదుపరి స్థాయి పోటీల్లో జిల్లా కీర్తిని చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే ధైర్యం ఆటలతోనే వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి



ఎస్‌జీఎఫ్ పోటీలు గొప్ప వేదికగా నిలుస్తున్నాయని ఆయన కొనియాడారు. ముగింపు కార్యక్రమంలో విజేతలు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ బొల్లారం భిక్షపతి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె. దశరథ్ రెడ్డి, ఎంఈఓ రఘురాం రెడ్డి, ఎస్సై కుమార స్వామి, మాటురు సర్పంచ్ జెన్నే సిద్ధులు, తుమ్మల కీర్తివర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మధార్ గౌడ్, వంగపల్లి పిఎసిఎస్ చైర్మన్ నిమ్మ ని సుబ్రమణ్యం, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాస్కరుణీ రఘునాథరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాతి మల్లేష్ ,ఉప సర్పంచ్ బైరపాక రాములు,పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు, రిఫరీలు, వైద్య, పోలీస్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే కరెంటు కష్టాలు

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు వెల్లడి

**కనగల్లు, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యంతో అన్నదాతలకు కరెంటు కష్టాలు ఏర్పడ్డాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ . రామచంద్రరావు అన్నా రు. బుధవారం మండల పరిధిలోని తొరగల్లు గ్రామంలో కరెంటు కోతలతో ఎండిపోయిన తంగేళ్ల పుష్పలత, తంగెళ కొండల్ రెడ్డి, మేడ బోయిన సుజాత, మాకే బోయిన యాదగిరి యాదయ్య చంద్రమోహన్, రైతుల పొలాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలన చేశారు. అనంతరం చిన్న మాదారం గ్రామంలో రైతులతో రామచంద్ర రావుముఖాముఖి గా మాట్లాడుతూ ముఖ్యమంత్రికి మంత్రులకు మధ్య సమయం లోపించి ప్రభుత్వంలో జవాబిదారి తనం కరువైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరాను కాంగ్రెస్ ప్రభుత్వం 12 గంటలకు కుదించి ఇచ్చే కరెంటును కూడా గృహ అవసరాలకు, వ్యవసాయ రంగానికి సమయపాలన లేకుండా కోతలు విధించి ఇవ్వడంతో ఎన్నో ఆశలతో వేసిన పచ్చనివరి పొలాలు కళ్ళ ముందే ఎండిపోయి దర్శనమిస్తున్నాయని గుర్తు



చేశారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలు ఏలినీవో ప్రభావంతో వచ్చినవి కావని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్తిమ కోతలని పాలకులపై అగ్రహం వ్యక్తం చేశారు. చిన్న మాదారం సబ్ స్టేషన్కు వెళ్లి విద్యుత్ సరఫరా విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫసల్ బీమా యోజన పథకం దానివలన రైతులకు జరిగే ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. ఫసల్ బీమా పథకం అంటే ఏందో మాకు ఇప్పటివరకు తెలియదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో పథకంపై అవగాహన కల్పించడంలో అధికారులు, పార్టీ నాయకులు విఫలమైనట్టు ఆయన ఆలోచనలు అర్థమైనట్లు తెలిసింది. చిన్న మాదారం గ్రామంలో ఎక్కువగా వరి బత్తాయి పత్తి మరియు కూరగాయలకు ప్రాధాన్యత ఇస్తామని రైతులు తెలిపారు. రైతులపై విద్యుత్తు అధికారులు ప్రవర్తిస్తున్న తీరును ఆయన దృష్టికి తెగ రైతుల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మీనరసయ్య, జిల్లా ఇన్చార్జ్ ఉదయ్ ప్రతాప్, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధగోని శ్రీనివాస్ గౌడ్, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక సాంబయ్య, పిల్లి రామరాజు, మండల పార్టీ నాయకులు పిండి పాపిరెడ్డి, మాలె వెంకట్ రెడ్డి, దాసరి వెంకన్న, పంతంగి సైదులు గౌడ్, టీ కనకయ్య, ఆదిమల్ల దేవేందర్, నీలకంఠ వెంకన్న, భిక్షమాచారి, వీరయ్య, జే యాదయ్య, పార్టీలో వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.







## రూ.1,499కే జియో భారత్ ఫోన్.. 6 నెలలు ఫ్రీ రీఛార్జ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ టెలికాం కంపెనీ జియో తన 10వ వార్షికోత్సవం సందర్భంగా జియో భారత్ ఫోన్లపై ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆఫర్‌లో భాగంగా ఈ ఫోన్‌ను రూ.1499కే అందిస్తోంది. దీంతో పాటు ఆరు నెలల ఉచిత రీఛార్జ్ సదుపాయం కూడా కల్పిస్తోంది. ఈ ఫోన్లలో జియో టీవీ ద్వారా 500+ ఛానెల్స్‌ను వీక్షించొచ్చు. హాట్‌స్టార్, జియో పే ద్వారా యూపీఐ పేమెంట్స్ కూడా చేయొచ్చు. సాధారణంగా 2ఉ వినియోగదారులు 6 నెలల రీఛార్జ్ కోసం సుమారు రూ.1,200 పైగా ఖర్చు చేస్తారని, ఆ లెక్కన రూ.1,499 ప్యాకేజీలో 6 నెలల ప్లాన్ తీసివేస్తే.. ఈ ఫోన్ ఆఫర్ ధర కేవలం రూ.299 మాత్రమేనని జియో ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతి నెలా 14 జీబీ డేటా+ అన్‌లిమిటెడ్ హెచ్‌డీ వాయిస్ కాల్స్ లభిస్తాయి. అయితే, జియో భారత్‌లోని ఏ1, బీ2, బీ3 సిరీస్ ఫోన్లపై మాత్రమే ఆ ఆఫర్ వర్తిస్తుంది. వీ4కు ఈ ఆఫర్ వర్తించదని జియో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

## ఐసీఐసీఐ బ్యాంక్ సేవల్లో సాంకేతిక అంతరాయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రైవేట్‌రంగ బ్యాంక్ ఐసీఐసీఐ సేవల్లో సాంకేతిక అంతరాయం ఏర్పడింది. బ్యాంకింగ్ సేవలను వినియోగించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలువురు యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. ప్రధానంగా ఐసీఐసీఐ మొబైల్ యాప్, లాగిన్, మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ పేర్కొంది. బుధవారం మధ్యాహ్నం నుంచి యూజర్ల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపింది. లాగిన్ కోసం ప్రయత్నిస్తుంటే కస్టమర్ కేర్‌ను సంప్రదించాలంటూ సందేశం వస్తున్నట్లుగా కొందరు యూజర్లు పేర్కొంటున్నారు. దీనిపై ఇంకా ఐసీఐసీఐ బ్యాంక్ స్పందించలేదు.



# నష్టాల్లో ముగిసిన సూచీలు

**దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర ఒడుదొడుకులు ఎదు ర్కొని చివరికి స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 650 పాయింట్లు పతనమైంది. క్రూడాయిల్ ధరలు అధిక స్థాయుల్లో కొనసాగుతుండడం, విదేశీ మదుపర్ల విక్రయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.సెన్సెక్స్ ఉద యం 72,441.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,529.07) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ.. ఇంట్రాడేలో 73,062.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 48.78 పాయింట్ల 72,480.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 95.75 పాయింట్ల నష్టంతో 22,620.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, సన్‌ఫార్మా, టైటాన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.**



## ఇంటర్నెట్ లేకుండానే.. మొబైల్‌లో లైవ్ టీవీ ఛానల్స్!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇప్పటివరకూ ఏదైనా వీడియోను మొబైల్‌లో చూడాలంటే కచ్చితంగా ఇంటర్నెట్ సదుపా యం ఉండాల్సిందే. ఇకపై వైఫై, డేటా అవసరం లేకుం డానే ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్‌ను చూడబోతున్నాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రసార భారతి సిద్ధమవుతోంది. త్వరలోనే డైరెక్ట్ టు మొబైల్ టెక్నాలజీని తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. కమర్షియల్‌గా అమలు చేసేందుకు అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేయనున్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్‌పై ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి ప్రసార భారతి పనిచేస్తోంది. ఈ టెక్నాలజీకి అవసరమైన ట్రయల్స్ కూడా పూర్తయ్యాయి. 470-582 స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ప్రసారాలు ఉంటాయని పరిశోధనల్లో తేలింది. దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఫోన్లు కూడా వేడెక్కవని స్పష్టమైంది. దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ప్రస్తుతం ఆ2ఓ టెక్నాలజీపై ట్రయల్స్ జరుగుతున్నాయి.ఇంటర్నెట్, వైఫై, సిమ్ కార్డు సాయం లేకుండానే ప్రజలకు లైవ్ టీవీ, ఇంటర్నెట్, కాల్స్ అందించే సరికొత్త టెక్నాలజీ ఈ డీ2ఎమ్. ముఖ్యంగా గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో నివసించే ప్రజలకు ఈ సాంకేతికత ద్వారా తయారైన ఫోన్, ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

## 2047 నాటికి 600 మి.టన్నుల ఉక్కు సామర్థ్యమే లక్ష్యం

### ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్

దిల్లీ: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి.. దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని 600 మిలియన్ టన్నులకు చేర్చడం, పరిశ్రమలో పోటీతత్వాన్ని పెంపొందించడం, చౌక దిగుమతుల సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా సరికొత్త 'జాతీయ ఉక్కు విధానం 2047'ను రూపొందిస్తున్నట్లు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ వెల్లడించారు. సీఐఐ నిర్వహించిన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కాన్ఫ్లూయెన్స్ 2026 సదస్సులో ఆయన మాట్లాడారు. 2017లో తీసుకొచ్చిన ఉక్కు విధానం ప్రకారం.. 2030 నాటికి దేశీయ సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం 220 మి.టన్నులుగా ఇది ఉంది. కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ఉక్కు వినియోగం, ఉత్పత్తిలో వేగంగా దూసుకెళ్తున్న దేశంలో భారత్ నిలిచింది. కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, అత్యాధునిక సాంకేతిక మార్పులు, డీకార్బనైజేషన్ వంటి కొత్త ప్రాధాన్యతలు పెరగడంతో, 2017 నాటి విధానాన్ని పునఃసమీక్షించి, రాబోయే రెండు దశాబ్దాల కోసం దీర్ఘకాలిక



ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సందీప్ వివరించారు. వారం రోజుల్లో ముసాయిదా: పరిశ్రమ వర్గాలు, నిపుణుల సలహాలు, సూచనల కోసం కొత్త ఉక్కు విధానం ముసాయిదాను మరో వారం రోజుల్లో విడుదల చేయనున్నారు. ఇందులో వాల్యూ-యాడెడ్, స్పెషల్ స్టీల్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ రంగంలోని చిన్న తరహా ఉక్కు ఉత్పత్తిదారులను ఆదుకునేందుకు రూ.5000 కోట్ల కేటాయింపులతో వికసిత్ భారత్ ఇస్పాత్ పథకాన్ని ప్రభుత్వం తీసుకురానుంది. త్వరలోనే దీనికి తుది ఆమోదం లభించనుంది. ఉత్పాదకతతో పాటు కర్బన ఉద్గారాల తగ్గింపు ఆధారంగా చిన్న పరిశ్రమలకు ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి. పెద్ద ఉక్కు తయారీ సంస్థల కోసం త్వరలోనే కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ పథకం నిబంధనలను నోటిఫై చేయనున్నారు.చైనా వంటి దేశాల నుంచే వచ్చే చౌక, నాణ్యత లేని దిగుమతులను నిరోధించేందుకు సేఫ్‌గార్డ్, దిగుమతి నిరోధం సుంకాలను విధించేలా కొత్త విధానాన్ని తీర్చిదిద్దుతున్నారు.

## భారత మార్కెట్‌లోకి గూగుల్ ఫిట్‌బిట్ ఎయిర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ దేశీయ మార్కెట్‌లోకి తన తొలి స్క్రీన్‌లెస్ ఫిట్‌నెస్ ట్రాకర్ ఫిట్‌బిట్‌ఎయిర్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.13,999గా నిర్ణయించింది. అక్టోబర్ 2 నుంచి విక్రయానికి రానుంది. ఎంపిక చేసిన గ్లోబల్ మార్కెట్స్‌లో ఈ ఏడాది మే నెలలో దీన్ని గూగుల్ విడుదల చేసింది. భారత్‌లో నిర్వహించిన 'మేడ్ బై గూగుల్' ఈవెంట్‌లో దీన్ని తొలిసారి ప్రదర్శించింది. తాజాగా అందుబాటులోకి తెచ్చింది.ఫిట్‌బిట్ ఎయిర్‌లో స్క్రీన్ ఉండదు. కాబట్టి నోటిఫికేషన్లు కనిపించవు. మీ చేతికి ఓ బ్యాండ్‌లా దీన్ని ధరించుకోవాల్సి ఉంటుంది. మీ ఫోన్ యాప్‌లో మొత్తం డేటా దర్శనమిస్తుంది. ఫిట్‌బిట్ ఎయిర్ సాయంతో 24/7 హార్ట్‌రేట్, ఎస్‌పీఓ2, ఆటో యాక్టివిటీ డిటెక్షన్, స్లీప్ స్టేజెస్, స్లీప్ డ్యూరేషన్ వంటివి తెలుసుకోవచ్చు. ఒకసారి బ్యాటరీ ఛార్జింగ్ చేస్తే ఏడు రోజుల పాటు పనిచేస్తుంది. కేవలం ఐదు నిమిషాల ఛార్జింగ్‌తో రోజంతా వినియోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది. గూగుల్ హెల్త్‌కోచ్‌ను వినియోగించుకోవడానికి వీలుగా 3 నెలల గూగుల్ హెల్త్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌తో వస్తోంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ కార్డులతో కొనుగోళ్లపై రూ.1000 క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. గూగుల్ స్టోర్, ఫ్లిప్‌కార్ట్, క్రోమా, రిలయన్స్ డిజిటల్, విజయ్ సేల్స్‌లో ఫిట్‌బిట్ ఎయిర్‌ను కొనుగోలు చేయొచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,58,793 (22 క్యారెట్లు) | ₹ 1,73,236 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,45,000

# 'యాపిల్ పే' వచ్చేసింది

### పిన్/ఓటీపీ లేకుండానే పేమెంట్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
అమెరికా టెక్ దిగ్గజం యాపిల్.. భారత డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో అడుగుపెట్టింది. మన దేశంలో 'యాపిల్ పే' సేవలను ప్రారంభించింది. యాక్సిస్ బ్యాంక్ సహకారంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ బుధవారం వెల్లడించింది. ఐఫోన్, ఐపాడ్, యాపిల్ వాచ్ వంటి వాటిల్లో యాపిల్ యూజర్లు ఈ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపింది."డిజిటల్ పరిజ్ఞానం ఉన్న జనాభాకు భారత్ నిలయం. గోప్యతా, భద్రతా ప్రమాణాలు పాటిస్తూనే నగదు రహిత చెల్లింపుల వ్యవస్థలో ఈ దేశం వేగంగా ముందుకెళ్తోంది. ఇక్కడి యూజర్లకు 'యాపిల్ పే సేవలను అందుబాటులోకి తీసుకురావడం పట్ల ఆనందంగా ఉంది" అని యాపిల్ పే- యాపిల్ వ్యాలెట్ విభాగ వైస్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ బైలీ వెల్లడించారు.

**పిన్/ఓటీపీ లేకుండానే..**

యాపిల్ డివైజ్ యూజర్లు ఇకపై ఎలాంటి పిన్ గానీ, ఓటీపీ గానీ లేకుండానే స్టోర్లు, యాప్‌లు, వెబ్‌సైట్లలో




ట్యాప్ అండ్ పే విధానంలో సులభంగా చెల్లింపులు చేయొచ్చని కంపెనీ ఈ సందర్భంగా వెల్లడించింది. "యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డులు కలిగిన కస్టమర్లు తమ కార్డుల వివరాలను 'యాపిల్ పే'కు యాడ్ చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ మర్చంట్లు, స్టోర్లలో యాపిల్ పేను వినియోగించుకోవచ్చు" అని కంపెనీ తమ ప్రకటనలో పేర్కొంది.

**డేటా భద్రత..**

"యాపిల్ పేతో కస్టమర్లు తమ క్రెడిట్/డెబిట్ కార్డులను వినియోగించినప్పుడు.. ఆ కార్డు వివరాలు యాపిల్ డివైజ్‌లలో గానీ, మా సర్వర్లలో గానీ స్టోర్ అవ్వవు. వాటిని మర్చంట్లతో షేర్ చేసుకోబోం. దానికి బదులుగా కస్టమర్లకు ఎన్‌క్రిప్ట్ చేసిన యునిక్ డివైజ్ అకౌంట్ నంబరును కేటాయిస్తాం. ఈ వివరాలను సెక్యూర్ ఎలిమెంట్ అనే చిప్‌లో భద్రంగా స్టోర్ చేస్తాం. లావాదేవీల వివరాలు కూడా యాపిల్ వద్ద ఉండవు" అని కంపెనీ వివరించింది.ప్రస్తుతం ఈ యాపిల్ పేతో యాపిల్ స్టోర్లతో పాటు బ్లింకిట్, క్రోమా, రిలయన్స్ బ్రాండ్స్, కామెట్, ఇంటర్‌ఫ్లోరా, జొమాటో.. ఇలా వేలాది మర్చంట్ యాప్‌ల్లో చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సేవలను మరింత విస్తరించేందుకు భారత్‌లోని పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లతోనూ యాపిల్ సంప్రదింపులు జరుపుతోంది. 'యాపిల్ పే'.. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో అందుబాటులో ఉంది.

**తన పరిశోధకులు లేవనెత్తిన భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ) కొత్త మోడల్ విడుదలను వాయిదా వేస్తున్నట్లు ఏఐ దిగ్గజ సంస్థ ఓపెన్‌ఏఐ పేర్కొంది. ఈ సాంకేతికత పురోగతి వేగాన్ని మందగింపజేయాలని పరిశ్రమ వ్యాప్తంగా వస్తున్న ఒత్తిడి ఇందుకు కారణం. దీంతో జీపీటీ-6.1 అస్త్ర మోడల్ విడుదల విషయంలో తన నిర్ణయాన్ని కంపెనీ వెనక్కి తీసుకున్నట్లయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఏఐ ఎగ్జిక్యూటివ్‌ల సమావేశానికి ముందు రోజు ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. తమ మోడళ్ల దుర్వినియోగానికి బాధ్యత వహించాలన్న కొత్త ఒత్తిడి ఏఐ కంపెనీలకు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. నిర్ణయం వాయిదా మాత్రమే పడిందని, ఆవిష్కరణ జరిగే తీరుతుందని ఓపెన్‌ఏఐ హెడ్ ఆఫ్ సేఫ్టీ సిస్టమ్స్ సాచీ జైన్ పేర్కొన్నారు. ఏఐ మోడళ్ల అనధికారిక ప్రవర్తన విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇటీవలి కాలంలో ఏఐ ఏజెంట్లు కంపెనీల ఆదేశాలను మీరి, ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి అనధికారికంగా చొరబడిన సంగతి తెలిసిందే.**



## అధిక మైలేజీతో మీ ఫ్యూచర్ కారు..

దిల్లీ: ప్రయాణికుల వాహనాల్లో ఇంధన సామర్థ్యం మెరుగుపరచడం, కర్బన ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ నిబంధనలు తీసుకొచ్చింది. 2027 ఏప్రిల్ 1 నుంచి 2032 మార్చి 31 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉండనున్నాయి. హ్యాచ్‌బ్యాక్‌లు, సెడాన్లు, ఎస్‌యూవీలు, ఎంపీవీలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయి. డ్రైవర్ సీటు మినహా 8 మంది వరకు ప్రయణించేలా సీటింగ్ కెపాసిటీ కలిగిన వాహనాలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయి. నిర్ణీత తేదీ తర్వాత దేశీయంగా తయారయ్యే, దేశంలోకి దిగుమతయ్యే వాహనాలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయని కేంద్రం తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.వాస్తవానికి ముసాయిదా నిబంధనల్లో చిన్న కార్లకు మినహాయింపు ఇచ్చారు. వీటి ధరలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో 909 కిలోల కంటే తక్కువ బరువు కలిగిన పెట్రోల్ కార్లకు ప్రయోజనం కల్పించారు. తుది నోటిఫికేషన్‌లో ఆ ప్రయోజనాన్ని తొలగించారు. తయారీదారులు బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్, రేంజ్ ఎక్స్‌టెండెడ్ వెహికల్స్, ప్లగ్ ఇన్ హైబ్రిడ్ వెహికల్స్, స్ట్రాంగ్ హైబ్రిడ్ వెహికల్స్‌ను తయారు చేసేలా ప్రోత్సహించేందుకు 'సూపర్ క్రెడిట్స్' విధానాన్ని తీసుకొచ్చారు. అంటే కంపెనీలు విక్రయించే మొత్తం వాహనాల సగటు ఉద్గారాలను లెక్కించేటప్పుడు, పర్యావరణానికి మేలు చేసే స్వచ్ఛమైన ఇంధన వాహనాలకు అదనపు విలువను కేటాయిస్తారు. దీంతో సంప్రదాయ ఇంధనంతో నడిచే వాహన విలువతో భర్తీ చేస్తారు. తద్వారా కేవలం పెట్రోల్, డీజిల్ కార్లనే కాకుండా, ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లను కూడా కంపెనీలు తయారు చేసి విక్రయించేలా ఈ విధానం ప్రోత్సహిస్తుంది.కార్లకు ఇంధన సామర్థ్యానికి బెంచ్ మార్క్‌ను కూడా కేంద్రం నిర్దేశించింది. 2027-28లో ప్రతి 100 కిలోమీటర్లకు 3.996 లీటర్లుగా బెంచ్ మార్క్‌గా పేర్కొంది. 2031-32 నాటికి దీన్ని 3.327/100ఎఎ ఉండాలని తెలిపింది. ఈ బెంచ్ మార్క్ వల్ల కంపెనీలు రాబోయే ఐదేళ్లలో ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టిసారించనున్నాయి. దేశీయంగా చమురు దిగుమతులను తగ్గించడం కోసం కొత్త ఆవిష్కరణలకు, సాంకేతికతలకు కంపెనీలు పెద్దపీట వేస్తాయని కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది.

# సిమెంట్ ధరా మండుతుందా?

### బస్తాకు సగటున రూ.5-20 పెంచే వీలు

### సెంట్రమ్ బ్రోకింగ్ తాజా నివేదిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వర్షాకాలం ముగిసి, నిర్మాణాలు ఊపందుకునే సమయంలో సిమెంటు ధరలు పెంచేందుకు కంపెనీలు సన్నాహాలు చేస్తున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో దేశంలోని పలు మార్కెట్లలో డిమాండ్ పరిమిత స్థాయిలో ఉన్నందున, సిమెంటు ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. సెప్టెంబరులో మాత్రం కొన్ని మార్కెట్లలో అధిక వర్షపాతం నిర్మాణ కార్యకలాపాలను ప్రభావితం చేయగా, తక్కువ వర్షపాతం ఉన్న ఇతర ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు సాగాయి. ఫలితంగానే సిమెంటు బస్తా ధరను సగటున రూ.7 చొప్పున పెంచి రూ.356కు కంపెనీలు చేర్చాయి. ఈనెలలో సిమెంట్ బస్తా ధర దక్షిణ భారతదేశంలో రూ.11, పశ్చిమ ప్రాంతంలో రూ.9; మధ్య, తూర్పు, ఉత్తర భారతావనిలో రూ.5 చొప్పున పెరిగాయి. అక్టోబరులోనూ బస్తాకు రూ.5-20 మేర పెంచాలని కంపెనీలు యోచిస్తున్నాయి. అయితే మార్కెట్‌లో గిరాకీ ఎంతవరకు పుంజుకుంటుందనే అంశంపై ఆధారపడి, 'అక్టోబరు పెంపు' నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు. 'అక్టోబరులో ధరల పెంపు ప్రతిపాదనను డీలర్లు అంగీకరిస్తారా లేదా అనేదీ కీలకమేనని' సెంట్రమ్ బ్రోకింగ్ తాజా నివేదికలో పేర్కొంది. ఇటీవల కాలంలో ఇంధన ధరలు గణనీయంగా పెరిగాయి. సిమెంటు తయారీలో ఇంధన ధరల వాటా 30-40% ఉంటుంది. అందువల్ల సిమెంటు కంపెనీలు ఉత్పత్తుల ధరలు పెంచి, తమపై ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. అయితే విపణిలో పోటీ తీవ్రంగా ఉండటం, ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో.. సిమెంటు ధర పెంచితే,




అమ్మకాలపై ప్రభావాన్ని అంచనా వేసుకున్నాకే ముందడుగు వేయాలని భావిస్తున్నట్లు నివేదిక వివరించింది. పలు మార్కెట్లలో కంపెనీలు సిమెంటు ధరలు పెంచినట్లు ప్రకటించినా, ఆ మేరకు బిల్లింగ్ చేయలేకపోయినట్లు నివేదిక పేర్కొంది. జులై-సెప్టెంబరు త్రైమాసికం ముగిసే సమయంలో, పరిమాణం రీత్యా అమ్మకం లక్ష్యాలను చేరుకోవడానికి డీలర్లు.. గతంలో ఉన్న ధరలకే సిమెంట్‌ను విక్రయించారని తెలిపింది. వర్షాలు లేనందున, పలు మార్కెట్లలో నిర్మాణ కార్యకలాపాలు ఇప్పుడు మొదలయినందునే.. అక్టోబరులో సిమెంటు కంపెనీలు ధరల పెంపు ప్రయత్నాలు చేయొచ్చని నివేదిక అంచనా వేసింది.

**వచ్చే ఏడాది మార్చి 16-18 తేదీల్లో దిల్లీలో జరగనున్న 'రూట్స్ ఆసియా 2027' సదస్సులో 115కి పైగా ప్రముఖ విమానయాన సంస్థలు, 55కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2,500కు పైగా ముఖాముఖి సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో విమానయాన రంగ వృద్ధిపై ఆసక్తి ఉన్న విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు, పర్యాటక ప్రాంతాలు, సంబంధిత రంగాల ఉన్నతాధికార్లను ఈ సదస్సు ఒకచోటకు చేర్చనుంది. రూట్స్ ఆసియా 2027 సదస్సు ప్రారంభానికి సంబంధించి ముందస్తు కార్యక్రమంలో మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పరస్పరం అనుసంధానం కావడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో, ఈ సదస్సు అత్యంత కీలక అంతర్జాతీయ విమానయాన రంగ కార్యక్రమమని పేర్కొన్నారు. భారత్‌ను ప్రపంచంలోని మూడో అతిపెద్ద విమానయాన విపణిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ఇందుకోసం 2047 నాటికి విమాన ప్రయాణికుల సంఖ్యను ప్రస్తుత 24 కోట్ల నుంచి 130 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.**

## వినోద్ అదానీపై ఆరోపణలు కొట్టివేసిన సెబీ

**ముంబయి:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీపై ఉన్న విదేశీ నిధుల నియంత్రణ, కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ (ఎంపీఎస్) ఆరోపణలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ కొట్టివేసింది. అదానీ గ్రూప్‌లోని 4 కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన రెండు ఆఫ్‌షోర్ ఫండ్‌లను ఆయన నియంత్రించారని నిర్ధారించలేకపోయామని పేర్కొంది. అందువల్ల అతనిపై, నోటీసులు అందుకున్న మరో 11 మందిపై ఉన్న కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్, మోసం ఆరోపణలను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది. మోసపూరిత, అక్రమ వ్యాపార పద్ధతుల ఆరోపణలనూ ఎత్తివేసింది. అయితే సరైన, పూర్తి సమాచారం అందించడంలో విఫలమైనందుకు నాసర్ అలీ




షబన్ అహ్లీ, చాంగ్ చుంగ్ లింగ్‌లపై చెరో రూ.20 లక్షల జరిమానాను విధించింది. ఉత్తర్వులు అందుకున్న 45 రోజుల్లోపు ఈ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. సెబీ పూర్తి కాల సభ్యులు కమలేశ్ చంద్ర వర్ష్నే ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్స్ (ఈఐఎఫ్ఎఫ్), ఈఎం రిసర్జెంట్ ఫండ్ (ఈఎంఆర్) వంటి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడి సంస్థల నిర్ణయాలను వినోద్ అదానీ నియంత్రించినట్లు తమ పరిశోధనలో ఎలాంటి ఆధారాలూ లభించలేదని సెబీ పేర్కొంది. నాసర్ అలీ షబన్ అహ్లీ, చాంగ్ చుంగ్ లింగ్‌లతో వినోద్ అదానీకి ఉన్న సాధారణ వ్యాపార లేదా ఆర్థిక సంబంధాల ఆధారంగా విదేశీ నిధులను ఆయన నియంత్రించారని చెప్పలేమని సెబీ తన 81 పేజీల తుది నివేదికలో స్పష్టం చేసింది. అయితే విచారణ సమయంలో సరైన సమాచారాన్ని అందించనందుకు నసీర్, చాంగ్‌లపై రూ.20 లక్షల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపింది.అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్‌నకు చెందిన 4 నమోదిత కంపెనీలు (అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ పోర్ట్స్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్) వివాదాలను పరిష్కరించుకోవడానికి రూ.1.48 కోట్ల సెటిల్‌మెంట్ మొత్తాన్ని చెల్లించాయి. ఈ సెటిల్‌మెంటును ఆరోపణలను అంగీకరించినట్లుగా లేదా తిరస్కరించినట్లుగా భావించలేమని సెబీ ఉత్తర్వుల్లో పేర్కొంది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
1 అక్టోబర్ 2026

# రైతు సంక్షేమం.. ప్రజాసేవలకు ప్రాధాన్యం

- కిసాన్ మేళాలో ఆధునిక సాగుపై అవగాహన
- 42 ప్రదర్శన శాలల్లో వ్యవసాయ సాంకేతికత
- ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల పరిశీలన
- భూసేకరణ, పెండింగ్ దస్త్రాలపై ఆదేశాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** కామారెడ్డి కళాభారతిలో వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026ను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు అందుతున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ నూతన సాంకేతికతతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంచుకోవాలని సూచించారు. మేళాలో 42 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి పంటల సాగు, వ్యవసాయ పరికరాలు, సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. అనంతరం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, దస్త్రాలు, రిజిస్టర్లను పరిశీలించారు. పెండింగ్ దస్త్రాలను గడువులోగా పరిష్కరించి ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. డివిజన్‌లో కొనసాగుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో రైతులకు ప్రయోజనం

- లక్కంపల్లి సెజ్‌లో అనువైన స్థలాల పరిశీలన
- 17 వేల ఎకరాల్లో సాగు.. మరో 5 వేల ఎకరాలకు అవకాశం
- రైస్‌బ్రాన్ ఆయిల్, సోయా పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఇతర అధికారులతో కలిసి బుధవారం నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ పరిసరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే 17 వేల ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ సాగు ఉండగా, మరో 5 వేల ఎకరాల వరకు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. భవిష్యత్తులో రిఫైనరీ ఏర్పాటుకు కూడా స్థలం అందుబాటులో ఉండటం అనుకూలమని తెలిపారు. సమగ్ర నివేదిక సమర్పించాలని సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థలం ఖరారైన వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. లక్కంపల్లి సెజ్‌లో రైస్‌బ్రాన్ ఆయిల్, సోయా పరిశ్రమల ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని చెప్పారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.

# మురికికాల్వ పక్కన పసికందు మృతదేహం

*మట్టిలో కప్పి వదిలిన వైనం..శునకాలు బయటకు లాగడంతో వెలుగులోకి*

- 3 రోజుల శిశువుగా అనుమానం
- పోలీసుల దర్యాప్తు.. పోస్టుమార్టానికి తరలింపు

**శంకరపట్నం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** కన్నతల్లి ఒడిలో ఉండాల్సిన పసికందు మృతదేహం మురికికాల్వ పక్కన మట్టిలో లభ్యమైన ఘటన శంకరపట్నం మండలం కేశవపట్నంలో కలకలం రేపింది. హైస్కూల్‌కు వెళ్లే దారిలో మురికికాల్వ పక్కన మట్టిలో పూడ్చిన శిశువు మృతదేహాన్ని శునకాలు బయటకు లాగడంతో వాహనదారుల దృష్టికి వచ్చింది. స్థానికులు పరిశీలించగా మానవ శిశువు మృతదేహంగా గుర్తించారు. సుమారు మూడు రోజుల వయసు ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏఎస్సై సంపత్ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. శిశువు మృతి, మృతదేహాన్ని అక్కడికి తీసుకొచ్చిన వారి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలకు రూ.14.77 కోట్లు

- అర్సపల్లి ఆర్‌ఓబీకి రూ.8.48 కోట్లు
- మాధవ్‌నగర్ ఆర్‌ఓబీకి రూ.2.24 కోట్లు
- బైపాస్ రోడ్డులో ఆర్‌ఓబీకి రూ.4.04 కోట్లు
- నాలుగు వరుసల రహదారుల అభివృద్ధికి మార్గం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** నిజామాబాద్ జిల్లాలో మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు (ఆర్‌ఓబీ), అనుసంధాన నాలుగు వరుసల రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14.77 కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. అర్సపల్లి ఆర్‌ఓబీకి రూ.8,48,65,952, మన్మాడ్-సికింద్రాబాద్ రైల్వే లైన్ నిజామాబాద్ బైపాస్ రోడ్డు వద్ద ఆర్‌ఓబీకి రూ.4,04,53,437, హైదరాబాద్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై డిచ్‌పల్లి శివారు మాధవ్‌నగర్ వద్ద ఆర్‌ఓబీకి రూ.2,24,67,543 మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే రైల్వే గేట్ల వద్ద వాహనాల నిరీక్షణ తగ్గి రాకపోకలు సులభతరం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలిపింది. నిధుల విడుదలపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి పనులకు సహకరించాలని, జిల్లాకు రావాల్సిన కేంద్ర నిధుల కోసం బీజేపీ ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

# మహిళా అభివృద్ధి సంక్షేమంపై అవగాహన

**జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ కన్సల్టెన్సీ ఆశాలత**



**ముస్తాబాద్ సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** మహిళా అభివృద్ధి సంక్షేమం పై గ్రామాల్లో మహిళలను చైతన్యం పరుచుటకు జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై అవగాహనతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండలంలోని గూడూరు రావడం జరిగిందని పిఆర్‌ఆర్‌డి కన్సల్టెన్సీ ఆశాలత పేర్కొంది. గత జనవరిలో గ్రామాల్లో నూతనంగా సర్పంచ్లను ఎన్నుకున్న వారిలో 40 మంది మహిళా సర్పంచులను ఎంపిక చేసి హైదరాబాదులోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్పంచ్ వీధిలో అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు దీనిలో భాగంగా గ్రామములో జరుగుతున్న మహిళా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాభివృద్ధితో పాటు పలు విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు పరిశీలన అనంతరము గ్రామాలలో జరిగిన కార్యక్రమాలను జాతీయస్థాయి అధికారులు మొదటి రెండవ మూడవ భాగాలుగా విభజించి మొదట నిలిచిన గ్రామాలకు కోటి రూపాయల బహుమతి అందించడం జరుగుతుందన్నారు గ్రామాల్లో మహిళా చైతన్యంతో పాటు గ్రామాల అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకొని మహిళా సర్పంచులు ముందుండే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీటీ సునీత నర్సింగారావు అంగన్వాడి టీచర్ ఆశా వర్కర్ మహిళా సంఘం నాయకులు వీజీ రాంజీ శాఖ సిబ్బంది ఆనంద్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రతి మహిళకు 2-3రకాల ఆదాయ వనరులు ఉండాలి
- చిగురుమామిడిలో వీఓ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరైన డీఆర్‌డీఓ మచ్చ గీత



**చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మహిళల ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని,సంఘాల్లో లేని మహిళలు అందరినీ చేర్పించాలని డిఆర్ డిఓ మచ్చ గీత పిలుపునిచ్చారు.బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని ఉదయలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వీఓ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ముక్కుల్ఫ్ ఎంసిఎల్ఎఫ్,లోకోస్ యాప్, ఎస్ హెచ్ జి,వివో,ఎమ్ ఎస్,గ్రేడింగ్‌లపై నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మచ్చ గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఓ గీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్క మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే,వీఓలకు సొంత భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని,సంఘాల ద్వారా తీసుకున్న అప్పుల రికవరీ 100శాతం ఉండాలని అధికారులకు, ప్రతినిధులకు సూచించారు.మహిళలు కేవలం సంఘాలకే పరిమితం కాకుండా, సొంతంగా కుటీర,చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి మహిళా సభ్యురాలికి ఇంట్లోనే 2నుంచి 3రకాల ఆదాయాలు వచ్చేలా వినూత్న ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ,నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్క మహిళ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు,పొలాల్లో ఫార్మ్ పాండ్స్ నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం కరుణాకర్,ఏపీఎం రజిత,మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభారాణి,సీసీలు సత్యనారాయణ, రవీందర్, రమేష్,రంజిత్ పాల్గొన్నారు. వీరితో పాటు అన్ని గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, మండల సమాఖ్య సిబ్బంది శైలజ,శివకృష్ణ,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ ఉషు పోటీలకు సాన్వి విద్యార్థి ఎంపిక

**రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు పతకాలు : సాన్వి కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్**

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** 70వ జాతీయ స్కూల్ గేమ్స్ ఎస్జిఎఫ్ అండర్ 17 ఉషు క్రీడల్లో భాగంగా హైదరాబాద్ నాంపల్లి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించిన ఉషూ రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన సాన్వి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పథకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. గడ్డం చిన్నబాబు స్వర్ణ పథకం, ఏనుగు విగ్నేశ్వర్ సిల్వర్ మెడల్, గుండేటి లక్ష్మీ ప్రసన్న సిల్వర్ మెడల్ సాధించారని సాన్వి కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ తెలిపారు. 65కేజీల విభాగంలో గడ్డం చిన్నబాబు అక్టోబర్ 15 నుంచి 19వ తేదీ లలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్లో జరిగే జాతీయస్థాయి ఉషూ పోటీలకు తెలంగాణ నుంచి ఎంపికైనట్లు ఎస్జిఎఫ్ కరీంనగర్ సెక్రటరీ జి. బస్సీలాల్ తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ బస్సీలాల్, సాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్, కోచ్ లు శ్రీనివాస్, స్వర్ణ, లక్ష్మణరావు, డీన్ మోహన్, ప్రిన్సిపాల్ రత్నాకర్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

# మాట ఇచ్చి.. 15 రోజుల్లో సీసీ రోడ్డు పూర్తి

- రూ.12 లక్షలతో రహదారి నిర్మాణం
- 1,100 మంది విద్యార్థులతో జిల్లాలో ప్రథమ స్థానం
- నూతన తరగతి గదులకు నిధుల హామీ
- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం 15 రోజుల్లో పూర్తయింది. ఇటీవల కళాశాలను సందర్శించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు విద్యార్థులు, అధ్యాపకులు రహదారి సమస్యను వివరించగా, స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు అందుబాటులోకి రావడంతో కళాశాలకు రాకపోకలు సులభతరమయ్యాయి. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు. 1,100 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి కళాశాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు యూనిఫాంలు, షూస్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతికతతో ఐటీఐల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.75 వేల లంచం.. ఇద్దరు అధికారుల అరెస్టు

**ఏసీబీ వలలో మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్**

**మొయినాబాద్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.75 వేల లంచం తీసుకుంటున్న మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి, సీనియర్ అసిస్టెంట్ ఎలమోని సుదర్శన్‌ను ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వాణి రూ.75 వేలు డిమాండ్ చేశారు. ఆమె సూచనతో సుదర్శన్ నగదు స్వీకరిస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అతడి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

- సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లాలో సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అత్యవసర వైద్య సేవల సన్నద్ధతను బుధవారం సమీక్షించారు. ఆసుపత్రిలోని డయాలసిస్, ఎమర్జెన్సీ రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం, మౌలిక వసతులు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పార్కింగ్ సమస్యలు, రూఫ్ లీకేజీలు, ధోబీ రూమ్, కిచెన్ తదితర సమస్యలను వైద్యులు, అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాబోయే నెల రోజుల్లోగా పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఎస్పీ, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఆరోగ్యశ్రీ నమోదు సంఖ్యను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరడంతో పాటు వైద్యులకు అందే ఇన్సెంటివ్‌లకు కూడా ఇది తోడ్పడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, టెర్రస్ ప్రాంతాల్లో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్నా మెడికల్ కాలేజ్ పనులను పరిశీలించారు. దాదాపు పనులు పూర్తి కాగా మిగతా పనులు పూర్తి చేసి నెల రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వైద్య విద్యార్థులకు కావలసిన వసతులు కల్పించాలని, లైబ్రరీ, స్టడీ రూమ్, కిచెన్ రూమ్ లను పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్, వైద్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల దినోత్సవంలో రసాభాస

- అంటరానితనం నిర్మూలనపై అవగాహన కల్పించాల్సిన వేళ సహపంక్తి భోజనంపై వివాదం
- అధికారుల దృష్టికి గ్రామ సమస్యలు
- ఎన్‌హెచ్-563 అండర్‌పాస్‌పై వినతి
- జోక్యం చేసుకున్న అధికారులు




**శంకరపట్నం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్ష నిర్మూలనతో పాటు సమాన హక్కులపై అవగాహన కల్పించాల్సిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం రసాభాసగా మారింది. శంకరపట్నం మండలం చింతగుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సహపంక్తి భోజనం ఏర్పాటుపై జరిగిన చర్చ వాగ్వాదానికి దారితీసింది.

**సమస్యలపై అధికారులను నిలదీసిన గ్రామస్తులు**

ఎస్సీ కాలనీ ప్రజలు తమ సమస్యలను అధికారుల ముందుంచారు. జాతీయ రహదారి-563 నిర్మాణంతో గ్రామం నుంచి మండల కేంద్రానికి రాకపోకలకు సరైన అండర్‌పాస్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆడెపు నరసయ్య మాట్లాడుతూ.. దళిత కుటుంబాలకు ఉన్న కొద్దిపాటి భూములు లావణి పట్టా భూములు కావడంతో వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రైతు భరోసా, ఎరువులు తదితర వ్యవసాయ ప్రయోజనాల పథకాల్లో అర్హుల వివరాలను చేర్చి సహాయం అందించాలని కోరారు.

**సహపంక్తి భోజనంపై వాగ్వాదం**

అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించాల్సిన కార్యక్రమంలో సహపంక్తి భోజనం కోసం వంటలను గ్రామ సర్పంచ్ కర్క చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద తయారు చేసి తీసుకురావడంపై నరసయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించే రోజునే ఇలాంటి ఏర్పాటు చేయడం సముచితమేనా అని ప్రశ్నించారు. దీనిపై గ్రామ ఉపసర్పంచ్ ఆడెపు సుధాకర్ స్పందిస్తూ.. గ్రామంలో ఎలాంటి కులవివక్ష లేదని, కార్యక్రమం జరిగే ప్రదేశంలో వంటకు సౌకర్యాలు లేకపోవడంతో సర్పంచ్ ఇంటి వద్ద తయారు చేసి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. ఇందులో సర్పంచ్ తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొనగా అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. రాములు, మండల సూపరఇండెంట్ రాఘవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దివ్యాంజలి, ఏఈఓ ఆరతి, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బస్సు కోసం కంట్రోలర్ కాళ్లు పట్టుకున్న ప్రయాణికుడు

- స్పీకర్ సీఎం ఇలాఖలో దుస్థితి
- గంటల తరబడి బస్సుల రాక కోసం పడిగాపులు
- పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం
- రోజు ప్రయాణికులు విద్యార్థులు ఇక్కట్లు
- ఆర్టీసీ అధికారులతో వాగ్వివాదం



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అనే నినాదం బస్సుపై తాటికాయంత అక్షరాలతో కల్పిస్తుంది. కానీ ఆర్టీసీ బస్సు ప్రయాణం నిత్య నరకం. బస్సుల రాక కోసం ప్రయాణికులు పడిగాపులు. ఆలస్యంగా వచ్చిన బస్సులో ప్రయాణించడానికి సీటు కోసం జుట్లు పట్టుకొని కొట్టుకోవడం సర్వసాధారణమైంది. దీనిని ఆర్టీసీ యాజమాన్యం ఈజీగా తీసుకున్న సమయానికి బస్సు సౌకర్యం కల్పించండి ప్రబో అంటూ ఓ ప్రయాణికుడు కంట్రోలర్ కాళ్లు పట్టుకున్న సంఘటన ఇప్పుడు ప్రయాణికులను మరింత ఆవేదనకు గురిచేసింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో బుధవారం చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు విద్యార్థులు రోజు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వికారాబాద్ చేవెళ్ల మీదుగా హైదరాబాద్ కు ప్రయాణికులు ఉద్యోగస్తులు విద్యార్థులు నిత్యం భారీ సంఖ్యలో ప్రయాణిస్తారు. కానీ ఈ ప్రాంతానికి వెళ్లడానికి వికారాబాద్ తాండూర్ డిపోలకు చెందిన బస్సులు తగినన్ని లేకపోవడంతో వీరంతా రోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు గంటల తరబడి బస్సుల రాక కోసం ఎదురు చూసి స్థానికంగా ఉండే ఆర్టీసీ సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. ఇది నిత్య కృత్యమైంది. గంటల తరబడి బస్సు రాకపోవడంతో ఒక ప్రయాణికుడు వికారాబాద్ కంట్రోలర్ కాళ్లు పట్టుకొని బస్సు పంపించండి ప్ర బో అంటూ నిరసన వ్యక్తం చేయడంతో తోటి ప్రయాణికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదిలా ఉంటే పరిగి వికారాబాద్ తాండూర్ రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు రోజు గొడవ పడుతున్నారు. సకాలంలో బస్సు లేని కారణంగా వచ్చిన బస్సులో సీటు రిజర్వ్ చేసుకోవడం కోసం బస్సులో జుట్టు పట్టుకొని కొట్టుకోవడం సర్వసాధారణమైంది. అంతేకాకుండా మహిళలకు ఉచిత ప్రయాణమైతే పురుషులు టిక్కెట్ కొనుగోలు చేసి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. వారికి సీట్లు దొరకక దూర ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో తగినన్ని బస్సులు లేకపోవడం దురదృష్టకరమని ఓ సీనియర్ సిటిజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం వివిధ రూట్లల్లో బస్సులను నడపాలని ఆయన కోరారు. ఈ సంఘటనతో ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల డిమాండ్ కు తగ్గట్టు బస్సులు నడుపుతారని ఆశిద్దాం....



## భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

### కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కొందుర్గు, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కందూరి చంద్రరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ సెక్షన్లను సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం భూ భారతి దరఖాస్తుల పెండెన్సీపై తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పెండెన్సీని సున్నాకు తీసుకురావాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శక సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుషాయిగూడ డంపింగ్ యార్డులో భారీ అగ్నిప్రమాదం

**కాప్రా, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్‌లోని వాసవినగర్ సమీప డంపింగ్ యార్డులో బుధ వారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి చెట్లు, చెత్త దగ్ధమయ్యాయి. డంపింగ్ యార్డుకు సమీపంలో ఇంటింటి చెత్త సేకరణ చేసే సుమారు 100 కుటుంబాలు గుడిసెల్లో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తు న్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎన్నికల కమిషన్ చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

**హయత్ నగర్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ చర్యలకు వ్యతిరేకంగా మన్సూరాబాద్ రింగ్‌రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కొత్త నిబంధనల పేరుతో పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించారని, ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు, పేదలు తదితర వర్గాలకు చెందిన ఓటర్లపై ప్రభావం పడే విధంగా చర్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ గ్యానేశ్వర్ తక్షణమే రాజీనామా చేయాలని చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసే చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని ఆయన అన్నారు. ఓటు హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. 2023లో తీసుకొచ్చిన కొత్త ఎన్నికల కమిషన్ విధానాలు, నిబంధనలను పునః పరిశీలించాలని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను రూపొందించాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్ చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.




సీపీఎం జిల్లా కార్యదర్శి బోడ సామెల్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల వ్యవస్థ వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పొరుగు తెలుగు రాష్ట్రంలో పోలింగ్ శాతం, పోలింగ్ ముగిసిన తర్వాత వెల్లడైన గణాంకాల మధ్య తేడాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి బోడ సామెల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, రవీంద్ర శర్మ, సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్. వెంకన్న, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు కొత్త గణేష్ గౌడ్, ఎం. వీరయ్య, భీమనపల్లి కనకయ్య, తిరుమల సంధ్య, ముషం నరహరి, బిట్రా మూర్తి, సుందర్, కాశయ్య, అంజి నాయక్, గోపి నాయక్, కే. రాములు, కృష్ణమూర్తి, రాధమ్మ, భీమనపల్లి రాణి, లక్ష్మణ్ నాయక్, రెడ్డమ్మ, కలమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మూసి భూసేకరణపై రైతులతో ఆర్డీఓ వెంకట్ రెడ్డి సమావేశం

- ఎకరానికి 1800 గజాలు ఇవ్వాలని వినతి
- కన్వర్షన్,రిజిస్ట్రేషన్ ఫీజులు మాఫీ చేయాలని రైతుల విజ్ఞప్తి
- రైతులకు న్యాయం చేయాలని మాజీ మేయర్ అమర్ సింగ్ డిమాండ్

**బోడుప్పల్-జనంసాక్షి :** మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ లిమిటెడ్ పరిధిలో ప్రతిపాదిత భూసేకరణ, భూ మార్పిడి అంశాలపై బుధవారం పీర్జాదిగూడలోని మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.వెంకట నరసింహ రెడ్డి,రెవెన్యూ అధికారులు,ప్రభావిత రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎకరానికి 1400 గజాల స్థలాన్ని ఇవ్వాలని ప్రతిపాదించగా రైతులు మాత్రం ప్రస్తుత భూముల మార్కెట్ విలువలను దృష్టిలో ఉంచుకుని ఎకరానికి 1800 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.నగర విస్తరణతో పరివాహక ప్రాంతాల్లో భూముల విలువ గణనీయంగా పెరిగిందని అందువల్ల తమకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు.అలాగే భూముల కన్వర్షన్‌ను ఉచితంగా చేపట్టడంతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజులను పూర్తిగా మాఫీ చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో భూములను మల్టీపర్పస్ వినియోగానికి అనుమతించేలా స్పష్టమైన హామీలు ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ



సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ మూసి అభివృద్ధి ప్రాజెక్టు నగరాభివృద్ధికి కీలకమైనదేనని అయితే రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం గజం స్థలం లక్షల రూపాయల విలువ పలుకుతున్న నేపథ్యంలో రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.ప్రజా ప్రభుత్వంలో ప్రతి వర్గానికీ సంక్షేమం అందుతున్నట్లే భూములు కోల్పోతున్న రైతులకు కూడా పూర్తి న్యాయం జరగాలని అన్నారు.రైతుల అభిప్రాయాలు సూచనలను అధికారులు నమోదు చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బొమ్మల శ్రీరాములు, బద్దం జంగారెడ్డి, నరహరి, యాసారం శ్రీనివాస్, కుమ్మరి నర్సింహ, పరతం కృష్ణ,బొమ్మల రంగ నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

**షాబాద్, సెప్టెంబర్ 30(జనం సాక్షి);** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చేవెళ్ల మండలం చన్వెల్లికి చెందిన పల్లె రాజమల్లయ్య షాబాద్ నుండి స్వగ్రామమైన చన్వెల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో మల్లారెడ్డి గూడ నుండి రాంగ్ రూట్ లో వస్తున్న అస్సాం కు చెందిన బినయ్ సింగ్ తన ద్విచక్ర వాహనంతో సంకేపల్లి గూడ గేటు వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టుకోగా ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలు కాగా బినయ్ సింగ్ తలకు బలమైన గాయాలతో రక్తస్రావం కావడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు, తీవ్రంగా గాయపడిన పల్లె రాజమల్లయ్య ను కుటుంబ సభ్యులు, స్థానికులు 108 అంబులెన్స్ లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మేడిపల్లిలో దొంగ ఆట కట్!

- ఒక్కడే 9 చోరీలు.. రూ.2.50 లక్షల సొత్తు రికవరీ
- నిందితుడి అరెస్ట్.. 4 ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం



**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న దొంగతనాలకు పోలీసులు చెక్ పెట్టారు. ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి సుమారు రూ.2.50 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి ప్రమేయం ఉన్న 9 దొంగతనం కేసులను ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం గిరిడిహ్ జిల్లా దావథాన్ గ్రామానికి చెందిన బబ్లు పాశ్వాన్ (45) ప్రస్తుతం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 9 దొంగతనం కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. అతడి వద్ద నుంచి 4 ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వరుస దొంగతనం కేసులను ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

## పట్టభద్రుల సమస్యలపై పోరాడాలి

- ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి : ఎమ్మెల్సీ సురభి వాణిదేవి
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- ఉద్యోగాలు, విద్య, ఉపాధిపై దృష్టి సారించాలి



**ముషీరాబాద్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఉద్యోగాలు, విద్య, ఉపాధి వంటి అంశాలపై పట్టభద్రులతో విస్తృతంగా చర్చించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ మాట్లాడుతూ తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## వ్యర్థాలే వనరులు.. ఎస్‌బీఎంయూ పనులు వేగవంతం చేయాలి

### ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

### గేటెడ్ కమ్యూనిటీల్లో కంపోస్టర్లు.. హాస్టళ్లు, బల్క్ వేస్ట్ యూనిట్లలో బయోగ్యాస్ ప్లాంట్లు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో ఎస్‌బీఎంయూ 2.0 ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను వనరులుగా మార్చే దిశగా గేటెడ్ కమ్యూనిటీల్లో కంపోస్టర్లు, బల్క్ వేస్ట్ జనరేటర్లు, ప్రైవేట్ హాస్టళ్లలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంఎంసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ ఎస్‌బీఎంయూ 2.0 ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తడి వ్యర్థాలను మూలస్థాయిలోనే ప్రాసెస్ చేసేలా అన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో ఏరోబిన్ కంపోస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి వారి ప్రాంగణాల్లో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహించాలని, ప్రైవేట్ హాస్టళ్లలో ఉత్పత్తి అయ్యే సేంద్రియ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కొబ్బరి బొండాల వ్యర్థాలను కోయిర్ పరిశ్రమలకు అనుసంధానం చేయడంతో పాటు పూల వ్యర్థాలతో ధూప్‌స్టిక్స్, అగరుబత్తీల తయారీలో మహిళా సంఘాలకు శిక్షణ అందించాలని సూచించారు.
వ్యర్థాలను స్థానికంగానే ప్రాసెస్ చేసి పునర్వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి వినియోగించే విధానాన్ని మరింత బలోపేతం చేయాలని కమిషనర్ తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్), చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎస్‌బీఎం-పీఐయూ బృందం, రామ్‌కీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మాంసం, గోమాంసం విక్రయశాలలు మూసివేత

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసీ) పరిధిలోని గొర్రెలు, మేకలు, పశువుల వధశాలలతో పాటు మాంసం, గోమాంసం విక్ర యశాలలను మూసివేయాలని జిహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. మహాత్మా గాంధీ జయంతి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని స్టాండింగ్ కమిటీ తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. మూసివేత ఆదేశాల అమ లులో మున్సిపల్ అధికారులకు సహకరించాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను కోరారు.

## గాంధీ జయంతి ఏర్పాట్లను వేగవంతం చేయాలి

### హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా



**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు.బుధవారం బాపూఘాట్, బాపూ మ్యూజియం హాల్‌లో ఏర్పాట్లను ఆమె పరిశీలించి, గోల్కొండ జోన్ డీసీపీ రాఘవేందర్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ కాజోల్, ఆర్డీవో రామకృష్ణతో కలిసి సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా అప్పగించిన పనులను నిర్ణీత గడు వులో పూర్తి చేయాలని, అధికారులు సమన్వయం తో పనిచేయాలని కోరారు.నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పూల అలంకరణ, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అక్టోబర్ 2న రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు బాపూఘాట్, మ్యూజియంను సందర్శించనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బాపూఘాట్‌కు వచ్చే నాలుగు పాఠశాలల విద్యార్థులకు అవస రమైన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు అల్పా హారం, స్నాక్స్ అందించాలని విద్యాశాఖ అధికా రులను ఆదేశించారు. విద్యుత్, విద్య, జీహెచ్ ఎంసీ, ఆర్అండ్‌బీ, సమాచార, ఉద్యానవన, అగ్ని మాపక, పోలీసు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, పర్యా టక శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో ఏసీపీ ఫయా జ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జానీ భాష, పర్యాటక శాఖ జీఎం నాథును, ఏజీఎం పి.జాన య్య, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్, ఏడీఎఫ్ఓ వి.భాను ప్రతాప్, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

### 'వన్ వార్డు ఎవ్రీడే' కార్యక్రమం ద్వారా పరిష్కారం.. చెత్త, పెండింగ్ పనులపై వాట్సాప్‌లో ఫిర్యాదులు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో నిర్వహిస్తున్న 'వన్ వార్డు ఎవ్రీడే' కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాల్లో సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వార్డుల్లో ఉన్న పౌర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ పనులు, చెత్తాచెదారం తదితర సమస్యలను 9063421347 వాట్సాప్ నంబర్‌కు సమస్య వివరాలు, ఖచ్చితమైన లొకేషన్, ఫొటోలు లేదా వీడియోలతో పంపించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

## యాచారాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం

- నిధుల బాధ్యత నాది.. అభివృద్ధి ప్రజలకు చేర్చే బాధ్యత మీది
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**యాచారం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** యాచారం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. గత సమావేశం తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమావేశానికి పలువురు అధికారులు హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్య ధోరణి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. "నిధుల బాధ్యత నాది.. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చేర్చే బాధ్యత మీదే. కార్యాలయాలకే పరిమితం కాకుండా అంకితభావంతో పనిచేయాలి" అని సూచించారు. పాలనలో జవాబుదారీతనం ఉండాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి యాచారాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే అన్నారు.

## 71 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేత

**ఉప్పల్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** ఉప్పల్ మండలానికి చెందిన 71 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను బుధవారం ఉప్పల్ ఎంఆర్ఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల చెక్కుల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1,00,116 ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందించే అంశాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎంఆర్ఓ పూల్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్‌పై సమీక్ష

- పెండింగ్ ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి : చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డి

**చేవెళ్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని చేవెళ్ల ఆర్డీఓ, ఈఆర్వో పార్థసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్, పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఎస్ఐఆర్ పురోగతి, నోటీసుల జారీ, హియరింగ్స్, ఓటర్ల వివరాల ధ్రువీకరణపై సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని 298 పోలింగ్ స్టేషన్లలో 2,18,274 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 58,523 నోటీసులు జనరేట్ చేసి, 57,166 నోటీసులు డెలివరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 43,886 హియరింగ్స్ పూర్తికాగా, మరో 14,636 హియరింగ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ విచారణలు, ఆన్‌లైన్ హియరింగ్స్, ఇతర సంబంధిత ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందిన ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులను ఏఈఆర్వో లాగిన్‌లో పరిశీలించి, సంబంధిత బీఎల్‌ఓలకు కేటాయించి తదుపరి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బీఎల్ఓ, బీఎల్ఓ సూపర్‌వైజర్ తమ పరిధిలోని ప్రతి 30 ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల వివరాలు, సంబంధిత రికార్డులను ధ్రువీకరించి, అవసరమైన వివరాలను బీఎల్ఓ యాప్‌లో నమోదు



చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా డి-నోవో తయారీ, దరఖాస్తు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ కోరారు. గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలో టం టం ద్వారా పట్టభద్రుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 5, 2026 చివరి తేదీగా తెలిపారు. ఎస్ఐఆర్, పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఆర్డీఓ, ఈఆర్వో పార్థసింహారెడ్డి కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు పాండు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ విస్తృత కార్యాచరణ

- అర్హులైన పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలి
- డివిజన్, వార్డు, బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలి
- ఫామ్-18 ద్వారా ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలని సూచన
- వికారాబాద్‌లోనూ నాయకులతో మెతుకు ఆనంద్ సమావేశం

**కుత్బుల్లాపూర్/వికారాబాద్ సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, డివిజన్లు, వార్డుల్లో అర్హులైన పట్టభద్రు లను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని సూచించారు. సాధారణ అసెంబ్లీ ఓటరుగా ఉన్నప్పటికీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ప్రత్యేకంగా పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ఫామ్-18 ద్వారా దరఖాస్తు చేసుకోవా లని, అవసరమైన విద్యార్హత, ఓటరు వివరాలు, ధ్రువపత్రాలను సమర్పించా లని వివరించారు. ఎన్నికల సంఘం నిర్వహించే ఓటరు సేవల ద్వారా నమోదు, దరఖాస్తు స్థితి తదితర వివరాలను కూడా తెలుసుకోవచ్చని అధికారిక సమాచారం చెబుతోంది.
అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన



కల్పించి, బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులను కోరారు. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగాలు, విద్య, ఉపాధి అంశాలపై వారితో చర్చించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, అర్హులైన వారు తమ వివరాలను సరిచూసుకుని ఓటరు జాబితాలో పేరు నమోదైందో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు.
ఇదే అంశంపై వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటు నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు విశ్వాసం .. భరోసా కల్పించాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : నూతన కలెక్టరేట్ భవనం పేద ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించే విధంగా పనిచేసే పరిపాలనా కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు. పాత కలెక్టరేట్ దాదాపు 45 సంవత్సరాల పాటు జిల్లా ప్రజలకు పాలన అందించిందని, అనేకమంది జిల్లా కలెక్టర్లు అక్కడి నుంచి అత్యుత్తమ సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారని పేర్కొన్నారు. పాత కలెక్టరేట్ ఎన్నో పోరాటాలు ఆందోళనలకు వేదికగా నిలిచిందని అదే స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలోను కీలకంగా పని చేసిందని పేర్కొన్నారు. పాత కలెక్టరేట్ భవనంలోనే నామినేషన్లు వేసి రెండుసార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా అయ్యానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజల సమస్యల పరిష్కారానికి చక్కగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, చిట్టచివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ఆర్థికపరంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేసి పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఫలాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ భవన సముదాయం పేదల సమస్యల పరిష్కారానికి వేదికగా చక్కగా పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లా యంత్రాంగం, అధికారులు సమిష్టిగా పనిచేసి కరీంనగర్ జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ భవన సముదాయం ద్వారా జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు మరింత మంచి పరిపాలన అందించాలని పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్ భవనం పేదలకు అండగా నిలిచే పరిపాలనా కేంద్రంగా నిరంతరం పనిచేయాలని మంత్రి ఆకాంక్షించారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా పాలన అందిస్తుందని తెలిపారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, అధికారులు నూతన కలెక్టరేట్ భవనం ద్వారా పేదల సంక్షేమమే లక్ష్యంగా మరింత బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వంపై పేద ప్రజలకు మరింత నమ్మకం, విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించి జిల్లా యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులకు సూచించారు. నూతన కలెక్టరేట్ భవనం కేవలం పరిపాలనా కార్యకలాపాలకే పరిమితం కాకుండా పేదలు, సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

# నిస్సహాయతతో కలెక్టరేట్ గడప తొక్కే పేదల కన్నీరు తుడవాలి

- పథకాల ప్రయోజనాలు అత్యంత నిరుపేద వర్గాలకు చేరేలా ఉద్యోగులు పని చేయాలి
- కరీంనగర్ నగర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు
- రూ.1096.22 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 51 కోట్లతో నిర్మించిన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించిన సీఎం



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : సమస్యతో, బాధతో, నిస్సహాయ స్థితిలో కలెక్టరేట్ గడప తొక్కే ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కలిగించేలా సమీకృత జిల్లా కలెక్టరేట్ పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి పరిష్కరించాలని వారి కన్నీరు తుడవాలని, ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించే విధంగా పనిచేయాలన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి బృందానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఘన స్వాగతం పలికారు. కరీంనగర్‌లో రూ.51 కోట్లతో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టరేట్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రూ.29.62 కోట్లతో జిల్లాలో చేపడుతున్న మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులకు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు, కే.ఎస్.సీ.సీ.ఎల్. స్పెషల్ గ్రాంట్స్ కింద రూ.21.60 కోట్లతో చేపట్టిన వరదనీటి మురుగు కాల్వల నిర్మాణ పనులకు, రూ.25 కోట్లతో చేపట్టనున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ బిల్డింగ్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.5.70 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ భవనాన్ని, రూ.6.50 కోట్లతో నిర్మించిన కాశ్మీర్ గడ్డ సమీకృత వెజ్ - నాన్ వెజ్ మార్కెట్‌ను, రూ.16.50 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిఆర్ఎఫ్ కార్యాలయాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. వేద మంత్రాల, సర్వమత ప్రార్థనల మధ్య జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలెక్టర్ కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేట్ చాంబర్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఆహ్వానితులైన జిల్లా ప్రముఖులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పేద ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేలా పనిచేయాలని, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాలయం సంపూర్ణంగా ఉపయోగపడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు అత్యంత నిరుపేద వర్గాల వరకు చేరే విధంగా ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రతినిధులుగా పేదలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధతో, సమస్యలతో కలెక్టరేట్ కార్యాలయానికి సహాయం కోసం వచ్చే వారిని తమ కుటుంబ సభ్యులుగా భావించాలని సీఎం సూచించారు. తమ కుటుంబ సభ్యులకు ఏదైనా సమస్య వస్తే ఎలా స్పందిస్తామో, అదే విధంగా ఇతరుల పట్ల మన ప్రవర్తన ఉండాలని అన్నారు.

**ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం..**

ప్రజా పాలన ప్రారంభమయ్యే సమయానికి ఉద్యోగులకు జీతభత్యాలు ఒకటో తేదీన ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్రం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నేడు ఆ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని తెలిపారు. జీతభత్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పదోన్నతులు, బదిలీలు, ఆరోగ్య భద్రత కార్డులు వంటి ఉద్యోగుల సమస్యలను ఉద్యోగుల సహకారంతో పరిష్కరిస్తున్నామని అన్నారు. సమస్యలు మొత్తం పరిష్కారం కాకపోయినా ప్రజలకు సేవలు అందిస్తూనే తమ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందామని ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రంలో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర మార్గాల ద్వారా ఉద్యోగాలు చేస్తున్న వారు దాదాపు పదిన్నర లక్షల మంది ఉన్నారని, వారు నాలుగు కోట్ల ప్రజలకు సేవలు అందిస్తున్నారని సీఎం తెలిపారు.

గౌరవెల్లి రిజర్వాయర్ 98 శాతం పూర్తయిందని, సుప్రీంకోర్టులో కేసు కారణంగా మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చిందని, దీనిపై కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. వందల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ వాటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోతే చేసిన పని మొత్తం నిష్ఫలమవుతుందని అన్నారు. ఒక సంవత్సరం కాలంలో ఎలివేటెడ్ కారిడార్లు అందుబాటులోకి వస్తాయని, వీటిని రూ.5,000 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందని సీఎం తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన పనులకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపడం మన బాధ్యత అని అన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు తదితర అనేక అంశాలపై కరీంనగర్ జిల్లాలో పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించేందుకు మరోసారి వస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డిఆర్‌ఓ స్వామి, వివిధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో గంజాయి పట్టివేత

- రూ.30 లక్షల విలువైన 109 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్



భద్రాచలం సెప్టెంబరు 30 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో భారీగా గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు, కొత్తగూడెం ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. భద్రాచలం పోలీసుల ఆధ్వర్యంలో డీటీఎఫ్, కొత్తగూడెం ఎక్సైజ్ అధికారులు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. భద్రాచలం డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టిన అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన దివాకర్ మండల్, తెలంగాణకు చెందిన సుమన్ పాల్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు 109 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువను సుమారు రూ.30 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో కొత్తగూడెం ఏఈఎస్ ఎన్.శ్రీనివాసరావు, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామాదేవి, భద్రాచలం ఎస్‌హెచ్ఓ కిస్తయ్య, పీఈఎస్ఐ సలీంవుల్లా ఖాన్, భద్రాచలం ఎస్ఐ అల్లూరి రాజశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఓసిపిలు కాంట్రాక్టర్లమయం

- కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు సరిచేయాలి
- నీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు అందించాలి
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

పెద్దపల్లి (జనంసాక్షి) : మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బుధవారం రామగుండంలో పర్యటించారు. స్థానిక బిజెపి నాయకులు అయనకు ఘన స్వాగతం పలికారు. ఎన్టీపీసీ కృష్ణానగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈటల మాట్లాడుతూ సింగరేణి లో ఉన్న కార్మికులను యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. ఓసిపి లు కాంట్రాక్టర్ల మయం అయ్యాయి. సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక హామీలు ఇచ్చి విస్మరించారు. వేలాది కోట్ల రూపాయల డిపాజిట్లతో కళలాడిన సింగరేణి ఇప్పుడు అప్పుల ఉబిలో నెట్టవేయబడింది. సింగరేణి కార్మికులకు జీతాలు ఇవ్వాలంటే బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్తితి నెలకొందని అన్నారు. ఒక విధంగా సింగరేణి మూసివేసే పరిస్థితి కి వచ్చింది. తక్షణమే సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలు తో పాటు లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. సింగరేణి సంస్థ కు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. సింగరేణి కార్మికుల ఆగ్రహానికి గురి కాకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్ళీ పాతాపంధాను కొనసాగిస్తోంది. రాష్ట్రంలో 8 గంటల కరెంట్ కూడా సరిగా ఇవ్వడం లేదు. నాణ్యమైన కరెంటు రాకపోవడంతో రైతుల మోటార్లు కలిపోతున్నాయి. రైతుల సమస్యలు పరిష్కరించే పరిస్థితి లో ఈ ప్రభుత్వం లేదన్నారు.

## శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానం క్షేమంగా ల్యాండ్ అవ్వడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని విమానాశ్రయ వర్గాలు ధ్రువీకరించాయి. అనంతరం సాంకేతిక బృందం విమానాన్ని తనిఖీ చేసి మరమ్మతులు ప్రారంభించింది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడకు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ యాజమాన్యం వెల్లడించింది.

## వ్యభిచారం చేస్తూ పట్టుబడిన చేర్యాల ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్లు

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

చేర్యాల (జనంసాక్షి) సెప్టెంబర్ 30 : చేర్యాల పట్టణానికి చెందిన కొందరు ప్రైవేట్ వైద్యులు హైదరాబాద్ లోని మాదాపూర్ పరిధిలో ఓ అపార్టుమెంట్ లోని ఓ గదిలో నలుగురు యువతులతో కలిసి ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్న నిందితులు పోలీసులకు పట్టుబడ్డట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చేర్యాల పట్టణంలో గత 20 సంవత్సరాలుగా ఓ ప్రైవేట్ హాస్పిటల్ నడుపుతున్న డాక్టర్, ఓ స్కానింగ్ సెంటర్ నడుపుతున్న డాక్టర్ అందులో ఉన్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. మాదాపూర్ పోలీసులు నమ్మదగిన సమాచారంతో ఆదివారం దాడులు చేసి కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన స్థానికంగా చర్చనీయాం శంగా మారింది. ఈ సంఘటనలో నాలుగు డాక్టర్లు, నాలుగులు అమ్మాయిలు, వ్యభిచార గృహం నడిపిస్తున్న ధనుం జయ్ అనే వ్యక్తి పట్టుబడినట్లు తెలిసింది. ఈ ఘటనలో దొరికిన వారిపై కేసు నమోదయిందని సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులో చెక్కర్లు కొడుతుంది. ఎంతో పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న వైద్యుల తీరుపై స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

## గండి మైసమ్మలో అర్ధరాత్రి ఏటీఎం పగలగొట్టి చోరీ

- పోలీసుల చాకచక్యంతో చిక్కిన నిందితుడు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : ఏటీఎంను ధ్వంసం చేసి నగదు చోరీకి యత్నించిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్టు చేశారు. గండిమైసమ్మలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో ఈ నెల 27న తెల్లవారుజామున 1 గంట నుంచి 1.47 గంటల మధ్య చోరీకి ప్రయ త్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం ప్రాంగణంలోని పరికరాలు ధ్వంసమైన విషయాన్ని ఉదయం 6.20 గంటలకు గుర్తించిన బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంకు శాఖాధికారి కె. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు సూరారం నివాసి, కాకినాడ జిల్లా వాసి ఉండ్రసపు వీరబాబు (26)ను దుండిగల్‌లోని బీఆర్ఎస్ భవన్ సమీపంలో మెద్చల్ రోడ్డుపై అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని ఎనిమిదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.ఏటీఎంల వద్ద భద్రతా సిబ్బంది లేని ప్రాంతాలను గుర్తించి, ముందస్తు ప్రణాళికతో చోరీకి యత్నించేవాడని తెలిపారు. ఈ కేసులో నేరానికి వినియోగించినట్లు పేర్కొన్న సుత్తి, కట్టింగ్ మెషీన్, స్క్రూడ్రైవర్, పదునైన అంచు కలిగిన ఇనుప రాడ్, వైర్ కట్టింగ్ ప్లయర్,మరో స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టీజీ08వీ7402 నంబరు గల మారుతీ సుజుకీ కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.దర్యాప్తు బృందానికి అభినందనలుదుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ నాయుడు ఆధ్వర్యంలో కేసును ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. మెద్చల్ డివిజన్ ఏసీపీ చి. శంకర్‌రెడ్డి పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో దర్యాప్తు కొనసాగినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో చురుకుగా పాల్గొన్న అధికారులు, సిబ్బందిని కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి, అభినందించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎంలలో లోపల, బయట నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూడాలని పోలీసులు బ్యాంకు అధికారులకు సూచించారు. ఏటీఎంను ధ్వంసం చేయడం లేదా బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన వెంటనే సమాచారం అందేలా అలారం, ఇతర భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు.రాత్రి వేళల్లో సమస్యాత్మక ప్రాంతాల్లోని ఏటీఎంలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు తగిన వెలుతురు,అవసరమైన చోట భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.సీసీ కెమెరాలు,అలారాలు, తాళాలు,షట్టర్లు, లైటింగ్ తదితర భద్రతా పరికరాలను ఎప్పటి కప్పుడు తనిఖీ చేసి నిర్వహణ చేపట్టాలని బ్యాంకు అధికాలకు పోలీసులు సూచించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370